ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ప్రఖర ప్రజ్ఞ

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహః

సజల శ్రద్ధ

**సంకల్పం - సంరక్షణ**

వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**

శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక వర్గం
**డా॥ మారెళ్ల శ్రీరామకృష్ణ**
**డా॥ తుమ్మూరి కందర్ప రామచంద్ర రావు**
**కె.బి.సోమయాజులు**
**జి.సత్యవాణి**
**అశ్విని సుబ్బారావు**

**సంపుటి 5 సంచిక 12**
**మార్చ్ 2005**
**తారణ : మాఘం - ఫాల్గుణం**
**విడిప్రతి రూ॥ 8.00**
**సం॥ చందా రూ॥ 85**
**3సం॥ చందా రూ॥ 250**
**10 సం॥ చందా రూ॥ 750**

## వీరవ్రతం

జీవితం ఒక సంగ్రామం. ఆ సంగ్రామంలోని ప్రతి రంగంలోనూ ఎంతో మెలకువగా యుద్ధం చేయవలసి ఉంటుంది. తక్కువ సాధన సంపత్తి కలిగిన సేనాపతి వైశాలమైన శత్రుసైన్యంతో పోరాడుతూన్నప్పుడు ఎలాంటి అజాగ్రత్త రాకుండా చూసుకుంటాడు. ఆత్మరక్షణ కోసం కార్యశూరత చూపుతాడు. జీవితంలోనూ ఆ జాగరూకత, ఆ మెలకువ చూపవలసి ఉంటుంది.

భగవద్గీతను ఈ ఆధ్యాత్మిక పరిస్థితికి భూమికగా పరిగణించవచ్చు. పాండవులు అయిదుగురే. అయితే వారి ఆదర్శాలు మహోన్నతమైనవి. కౌరవులు వందమంది. కానీ, వారి మనస్తత్వం నికృష్టమైనది. కౌరవ, పాండవులు ఒకే ఇంటిలో పెరిగారు. పెద్దవారు అయ్యారు. కనుక, వారిమధ్య సన్నిహిత సంబంధాలు ఉండేవి. యుద్ధంనుండి తప్పుకోవాలని అర్జునుడు అనుకున్నాడు. అవినీతి సాగించే పెత్తనాన్ని సహించాలని అనుకున్నాడు. కృష్ణ భగవానుడు ఆయనకు ఇలా బోధ చేశారు - యుద్ధంవినా మరో మార్గం లేదు. అసురత్వాన్ని జయించనిదే దేవత్వం బ్రతికి బట్ట కట్టలేదు. అసురత్వం జయిస్తే, ప్రపంచం సర్వనాశనం అవుతుంది. కనుక, మన ప్రయోజనం కోసమే కాక, ప్రపంచ ప్రయోజనం కోసం కూడా అసురత్వంతో యుద్ధం చేయాలి. భగవాను ఆదేశాన్ని శిరసావహించి, అర్జునుడు యుద్ధం చేశాడు. విజయం సాధించాడు. భగవద్గీతకు నేపథ్యం ఇదే.

గీతాకాలపు మహాభారతం నేటికీ సమాప్తం కాలేదు. మనలోపల చెడు ఆలోచనలు అనే కౌరవులు నేటికీ తమ దుష్టత్వాన్ని ప్రకటిస్తూనే ఉన్నారు. దుర్యోధన, దుశ్శాసనుల దుర్మార్గాలు రోజూ సాగుతూనే ఉన్నాయి. మానవత్వపు గౌరవ గరిమ అనే ద్రౌపదికి వస్త్రాపహరణం జరుగుతూనే ఉన్నది. ఆమె సిగ్గుతో ఆక్రోశిస్తూనే ఉన్నది. ఇలాంటి పరిస్థితులలో సైతం యుద్ధానికి సిద్ధం కాని అర్జునుణ్ణి ఏమని పిలవాలి? ఇలాంటి మనస్తత్వం కలిగిన వారిని నపుంసకులనీ, పిరికిపందలనీ, ఆడంబరులనీ కటువైన మాటలతో నిందించారు. తమ బాహ్య, ఆంతరిక శత్రువులతో పోరాడడానికి వెనుకాడే మనలోని అందరూ ఇలా నిందించదగినవారే.

తమ జీవితాన్ని శాంతిగా, విశ్రాంతిగా గడపాలని కోరుకునే వ్యక్తులు వాస్తవానికి చాలా అమాయకులు. యుద్ధంలో విజయం పొందిన తర్వాతనే శాంతి లభించడం సాధ్యపడుతుంది. జీవన-నిర్మాణం అనే ధర్మక్షేత్రం ఒక కురుక్షేత్రం. ఈ రణరంగంలో సేనలు రెండూ ఎదురుబదురుగా నిలిచి ఉన్నాయి. దేవాసుర సంగ్రామపు శంఖారావం ఇక్కడే ప్రతిధ్వనిస్తోంది. ఇలాంటి పరిస్థితిలో వీరవ్రతధారికి యుద్ధం చేయడం తప్ప మరో మార్గం లభించదు. మెలకువ కలిగిన సేనాపతివలె మనం కూడా మన అంతర, బాహ్య క్షేత్రాలలో పటిష్టమైన వ్యూహారచన చేయాలి. గాండీవాన్ని సంధించడం తప్ప, పాంచజన్యాన్ని పూరించడం తప్ప మనకు మార్గాంతరం లేదు. HHH

**నీ విలువను తెలుసుకో, అన్ని వస్తువులనూ పాదాక్రాంతం చేసుకో.**

# విషయ సూచిక

**ముఖ చిత్రం : శివుడు**


1. **సంపాదకీయం :**
   వీర వ్రతం 1
2. **విషయ సూచిక** 2
3. **వేద మంత్రం** 3
4. **ముఖచిత్ర కథనం :**
   ఆత్మశోధనకు అద్భుత పర్వం మహా శివరాత్రి 4
5. **దేవ సంస్కృతి సౌరభం :**
   ఆధ్యాత్మిక పవర్‌హౌస్‌లు మన తీర్థక్షేత్రాలు 6
6. **ఆధ్యాత్మిక చికిత్స :**
   ఆధ్యాత్మిక రహస్యాలకు ఆలవాలం మానవ జీవనం 10
7. **మనం-మన ఆరోగ్యం :**
   గాఢనిద్రకు ఉపకరించే సూత్రాలు 12
8. **బోధ కథ :**
   నిజమైన బ్రాహ్మణత్వం 14
9. **సాధు సంత్‌ల జీవితాలు :**
   అద్భుతాలు చూపిన అవధూత - చివటం అమ్మ 16
10. **వ్యక్తి నిర్మాణం :**
    సార్థక సంభాషణ సరస్వతీ సాధన 18
11. **సమాజ నిర్మాణం :**
    సమాజసేవకు సాధనం జ్ఞానదానం 21
12. **సాధన విజ్ఞానం :**
    సాధనలోని త్రివేణి-భజన, మననం, చింతన 23
13. **ఆదిశక్తి గాయత్రి సాధన - 3 :**
    యజ్ఞమూ, గాయత్రీ పరస్పర పూరకాలు 27
14. **కృష్ణావతారం - 28 :**
    వసుదేవుని యజ్ఞదీక్ష 31
15. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 15**
    సద్గురువు సాక్షాత్కరించిన సుముహూర్తం - 2 33
16. **నావారితో నా మాట :**
    మహోద్యమం సాగిస్తున్న విరాట్ యాత్ర-3 38
17. **బ్రహ్మాండంలో సమానుభూతి :**
    ఖగోళ విజ్ఞానానికి కొత్తకోణం 42
18. **బోధ కథ :**
    అపర భగీరథుడు 45
18. **వార్తలు :**
    పొన్నూరులో 24 కుండముల గాయత్రీ యజ్ఞం 47
    ఆకివీడులో లక్షా 24వేల దీపాలతో దీపయజ్ఞం 48


## మార్చి, ఏప్రిల్ నెలలలో పర్వదినాలు

**మార్చి :**

8. మహాశివరాత్రి.
12. రామకృష్ణ పరమహంస జయంతి.
25. హోలీ.

**ఏప్రిల్ :**

9. ఉగాది.
14. అంబేద్కర్ జయంతి, రమణమహర్షి జయంతి.
15. దయానంద సరస్వతి జయంతి.
17. శ్రీరామనవమి, సమర్థరామదాసు జయంతి.
22. మహావీర జయంతి.
24. హనుమజ్జయంతి.

**శాంతినిచ్చే మాతృమూర్తులు గంగ, గీత, గాయత్రి.**

# వేద మంత్రం

స్వయం వాజింస్తన్వం కల్పయస్వ స్వయం యజస్వ స్వయం జుషస్వ ।
మహిమా తే౽న్యేన న సన్నశే ॥

-యజుర్వేదం 23/15

**భావార్థం** : ఇతరుల ఆశీర్వాదం, ఉపదేశం వలన ఎవరి ధ్యేయమూ ఎన్నడూ సిద్ధించదు. ఇందుకు స్వయంగా మన శరీరం, మనస్సు, ఆత్మలతో సత్కర్మలు, పరోపకారం చేయాలి.

**సందేశం** : మనుష్యునిలో దేవత్వ భావనల పతనానికి మూలకారణం నామమాత్రపు బ్రాహ్మణులు ధర్మాన్ని తమ స్వార్థపూర్తికి సాధనంగా చేసుకొని ప్రజల ముందు దీని వికృత స్వరూపాన్ని ఉంచుటయే. భగవంతుని విగ్రహాన్ని పూజ చేయి, బ్రాహ్మణులను సేవించు, అన్ని రకాల దానాలిచ్చి ప్రసన్నుల్ని చేసుకో, కోరికలన్నీ పూర్తిగా నెరవేరుతాయి - అనే మాటల్ని వారు గట్టిగా ముడివేసుకున్నారు. ఏ బ్రాహ్మణులు ధర్మం బదులు ఎల్లపుడూ అధర్మాచరణ చేస్తున్నారో, వారి ఉపదేశం, ఆశీర్వాదం మనుష్యులను భవబంధనాల నుంచి విముక్తి చేయగలుగుతాయా?

ఒకవేళ కేవలం వారి ఆశీర్వాద మాత్రం చేత మనకు మేలు జరిగితే, నేడు ప్రపంచంలో ఎవరూ దీనులుగా దుఃఖితులుగా ఉండరు. ఇటువంటి అబద్ధపు అభిప్రాయాలన్నిటి చేతనే మానవ జీవితంలో నలువైపులా ఆర్తనాదాలు పెరిగిపోయాయి. జనులు సోమరులు, అకర్మణ్యులైనారు. స్వయంగా ఏ పనీ చేయరు. ఓటమికి భగవంతుణ్ణి, అదృష్టాన్ని నిందిస్తూ ఉంటారు. "తుమ్మ మొక్క నాటాడు, మామిడి పండ్లు ఎలా వస్తాయి?" - అనే తంతు అయినది.

మనుష్యుడు ఎలా ఆలోచిస్తాడో, ఎలా చేస్తాడో అలాగే అవుతాడు-అనేది వేద వాక్యం. ఏ మనుష్యుడు తాను నిర్బలుడు, శక్తిహీనుడు అని భావిస్తాడో, అతనిని ప్రపంచంలో ఏ శక్తీ బలవంతునిగా, శక్తిశాలిగా చేయలేదు, అందుకు అతడు తన ఆలోచనలు మార్చుకోవటం అత్యంత ఆవశ్యకం. ఉపదేశం, ఆశీర్వాదముల వలన అతని మనస్సులో ఉత్సాహం, తేజస్వీ భావన కలిగి తదనుసారం అతని జీవితం శ్రేష్ఠతతో, పరాక్రమంతో దేదీప్యమానమవుతుంది. ఆశీర్వాదం, ఉపదేశముల శక్తి అతని కార్యాలలో సాఫల్యం కలిగించి ఎల్లవేళలా సహకారిగా ఉండి, లక్ష్యం చేరుస్తుంది. అతని అంతఃచేతనలో విశ్వాసాన్ని నింపుతుంది. అతడు రెట్టింపు ఉత్సాహంతో పని చేయుట ప్రారంభిస్తాడు.

ఆశీర్వాదం ఇవ్వటం తనంతట తాను గొప్పతనంతో కూడిన ఒక జవాబుదారీ. సమర్థుడు, తగిన వ్యక్తియే ఆశీర్వాదం, ఉపదేశం ఇచ్చుటకు తగిన అధికారి కాగలడు. దీనితో పాటు పాత్రత - కుపాత్రతల ధ్యానముంచుకోవాలి. తాను స్వయంగా ఏమీ చేయకుండా కేవలం భగవంతుడు, గురువు లేదా బ్రాహ్మణ ఆశీర్వాదంతోనే కోరికలు నెరవేరుతాయని కలలు కనేవాడు పెద్ద మూర్ఖుడు కాక ఇంకెవరు? మహాభారత యుద్ధానికి ముందు ధృతరాష్ట్రుడు అర్జునుణ్ణి 'విజయీభవ' అని ఆశీర్వదించాడు, కానీ స్వయంగా తన కొడుకు దుర్యోధనుడు కోరినప్పటికీ ఆ ఆశీర్వాదాన్ని ఇవ్వలేకపోయాడు.

ఉపదేశం, ఆశీర్వాదం కేవలం పురుషార్థానికి పుష్టి కలిగించే పని చేయగలుగుతాయి. ఆశీర్వాదం ఇచ్చే వారి పట్ల మనకు నిజమైన శ్రద్ధ ఉంటే, మన మనస్సులో అపూర్వ ఉత్సాహం కలుగుతుంది. కార్య సాఫల్యం పట్ల పూర్ణ విశ్వాసం కలుగుతుంది. ఈ విధంగా మన శరీరం, మనస్సు, ఆత్మ ఏకోన్ముఖమై సత్కర్మలు, పరోపకార కార్యాలలో లగ్నమవుతాయి. దేవత్వ భావన వికాసం పొందుతుంది.

H H H

**దేవుని సృష్టిని శ్రేష్ఠంగా, సుందరంగా తీర్చిదిద్దడమే దైవారాధన.**

ముఖచిత్ర కథనం

# ఆత్మశోధనకు అద్భుత పర్వం మహా శివరాత్రి

మహాకాల భగవానుని దివ్య స్వరూపాన్ని ఆవిష్కరించే పర్వం, సాధకులకు వరాలిచ్చే పర్వం మహాశివరాత్రి వచ్చింది. మహాశివరాత్రి మామూలు పండుగ కాదు. సాధనకు అతి దుర్లభమైన తరుణం ఇది. శివరాత్రి రోజున ఉపవాసం చేసి, ఉపాసన చేసే సాధకులపై దేవాధిదేవుడైన మహాకాలుని కృప వర్షిస్తుంది. భూత భావన భగవానుడు అలాంటి సాధకుల పట్ల ప్రసన్నుడు అవుతాడు. సదాశివుడు - మహా మృత్యుంజయుడు ఆ సాధకులకు శుభాలు చేకూర్చుతాడు.

ఒకసారి కైలాస శిఖరంపై పార్వతీ మాత భోలానాథుణ్ణి ఇలా అడిగింది-

**కర్మణా కేన భగవన్ వ్రతేన తపసాయి వా ।**

**ధర్మార్థ కామమోక్షాణాం హేతుస్త్వం పరితుష్యతి ॥**

అనగా-

ఓ భగవానుడా! ధర్మ, అర్థ, కామ, మోక్షములకు హేతువు నీవే. సాధకుల సాధనకు సంతృప్తి పొంది, నీవే వారికి వరాలు ప్రదానం చేస్తావు. కనుక - ఏ కర్మవల్ల, ఏ వ్రతం వల్ల, ఏ విధమైన తపస్సు వల్ల నీవు ప్రసన్నుడవు అవుతావో తెలుసుకోవాలని ఉంది.

### పరమేశ్వరుని వాగ్దానం

అందుకు జవాబుగా భగవానుడు ఇలా అన్నాడు-

**ఫాల్గుణే కృష్ణ పక్షే యా తిథిః స్యాచ్చతుర్దశీ ।**
**తస్యాం యా తామసీ రాత్రిః సోచ్యతే శివరాత్రిత ॥**

**తత్రోపవాసం కుర్వాణః ప్రసాదయతి మాం ధృవం ।**
**న స్నానేన న వస్త్రేణ న ధూపేన చర్చయా ॥**

**తుష్యామి న తథా పుష్పైః యథా తత్రోపవాసతః ॥**

అనగా-

ఫాల్గుణ మాసం కృష్ణ పక్షం చతుర్దశి తిథిని ఆశ్రయించి ఉదయించే అంధకారమయమైన రాత్రిని శివరాత్రి అని పిలుస్తారు. ఆ రోజున ఉపవాసం చేసే వ్యక్తి ఖచ్చితంగా నన్ను సంతృప్తి పరుస్తాడు. స్నానం, వస్త్రం, ధూపం, పుష్పములను అర్పించడం కన్న ఆ రోజున ఉపవాసం చేయడం వల్ల నేను మరింతగా ప్రసన్నుడను అవుతాను.

ఈ శాస్త్ర వచనంలో గూఢార్థాలు అనేకం ఇమిడి ఉన్నాయి. వీటిని సక్రమంగా అర్థం చేసుకోనిదే ప్రయోజనం సిద్ధించదు. **అజ్ఞాత్ జ్ఞాపకం హి శాస్త్రం.** తెలియని దానిని తెలియజెప్పేదే శాస్త్రం. శివరాత్రినాడు ఉపవాసం, అనుష్ఠానం చేయడం వెనుక ఉన్న గూఢమైన ఉద్దేశ్యం ఏమిటో, దాని వెనుక ఉన్న తత్వం ఏమిటో మనం తప్పక తెలుసుకోవాలి. లేకపోతే, శివరాత్రి నాటి అతి దుర్లభ సాధన నుండి ప్రయోజనం పొందలేము.

### ఉపవాసంలోని రెండు తత్వాలు

కనుక శివరాత్రి ఉపవాసంలోని రహస్యాన్ని మనం తెలుసుకోవాలి. ఉపవాసంలో రెండు తత్వాలు కలసి ఉన్నాయి. మొదటిది. **ఆహార నివృత్తిః ఉపవాసః.** అనగా - నిరాహారంగా ఉండడం ఉపవాసం. ఆహారం అంటే భోజనం మాత్రమే కాదు. **అహ్రియవే మనసా బుద్ధ్యా ఇంద్రియైర్వా ఇతి ఆహారః.** అనగా-మనస్సు ద్వారా కాని, ఇంద్రియాల ద్వారా కాని బయటి నుండి గ్రహించేది ఆహారం. కనుక - నిరాహారంగా ఉండడం అంటే భోజనం మానివేయడం మాత్రమే కాదు; కల్పన, భావన, ఆలోచనలలో కూడా ప్రాపంచికతను వదులుకోవడం. ప్రాపంచికమైన విషయ వాసనలను, ప్రపంచానికి సంబంధించిన ఎలాంటి స్పందనలను మన ఆంతరిక చేతనలో ప్రవేశించనివ్వకూడదు.

రెండవ అర్థం. ఉపవాసం అంటే మన ఆరాధ్యునికి సమీపం కావడం. ప్రభువు స్వరూపాన్ని చింతన చేయడం ద్వారా మనకు ఈ దగ్గరితనం లభిస్తుంది. మహాకాల భగవానుని దివ్య స్వరూపంలోని రహస్యంపై ధ్యానం చేయడం వల్ల ఆ దగ్గరితనం లభిస్తుంది. కనుక శరీరం ద్వారా, ఇంద్రియాల ద్వారా, మనస్సు ద్వారా, బుద్ధి ద్వారా బయటి

**రాజహంస పాలు త్రాగుతుంది. నీటిని వదిలివేస్తుంది.**

విషయాలను, ప్రాపంచిక విషయాలను గ్రహించకుండా అనుక్షణం మహాకాల భగవానుని మహిమను చింతన చేయడం వల్ల శివరాత్రి ఉపవాసం సార్థకం అవుతుంది.

మహేశ్వర భగవానుని మహిమను మహేశ్వరీ మాత కన్నా ఎవరు తెలుసుకోగలరు. శివతత్వాన్ని మాత ఇలా బోధిస్తోంది.

## శివస్వరూపంలో రహస్యం

స ఆదిః సర్వ జగతాం కోస్య వేదాన్వయం తతః ।
సర్వ జగద్దయస్య రూపం దిగ్వాసాః కీర్త్యతే తతః ॥

గుణత్రయమయం శూలం శూలీ యస్మాద్ విభర్తి సః ।
అబద్ధా సర్వతో ముక్తా భూతా ఏవం స తత్పతిః ॥

శ్మశాన వాపి సంసారః తద్వాసీ కృపమార్థినామ్ ।
భూతయః కథితా భూతిః తాం విభర్తి సమ్‌తిభృత్ ॥

వృషో ధర్మ ఇతి ప్రోక్తః తమారూఢస్తమో వృషీ ।
సర్పాశ్చ ద్యోషాః క్రోధాద్యాః తాన విర్భర్త జగన్మయః ॥

నానా విధాన్ కర్మయోగాః జటారూపాన్ విభర్తిపః ।
వేదత్రయా త్రినేత్రాణి త్రిపురః త్రిగుణ వపుః ॥

భస్మీ కరోతి తద్దేవః త్రిపురః స్మృతః ।
ఏవం విధం మహాకాలం విదుర్యోం సూక్ష్మ దర్శనః ॥

అనగా -

*దేవాధిదేవుడైన ప్రభువు జగత్తుకు ఆది అయినవాడు. మరి, అతడి వంశంగురించి ఎవరు తెలుసుకోగలరు. జగత్తు సమస్తం అతడి స్వరూపం. కనుకనే అతడు దిగంబరుడు. ఆయన త్రిగుణాత్మకమైన శూలాన్ని ధరిస్తాడు. కనుక అతడిని శూలి అని పిలుస్తారు. ఆయన పంచభూతములకు బద్ధుడు కాడు. ఆయన సర్వథా విముక్తుడు. కనుకనే ఆయన భూత గణాలకు అధిపతి. ఈ సంసారమే స్మశానం. తన భక్తులను కరుణించి దీనిలో నివసిస్తాడు. ఆయన విభూదియే అందరికీ విభూతి (ఐశ్వర్యం)ని ప్రదానం చేస్తుంది. కనుకనే ఆయన విభూదిని శరీరంపై ధరిస్తాడు. ధర్మమే వృషభం. దానిపై ఆరూఢుడు కావడంవల్ల ఆయన వృషభవాహనుడు అయినాడు. క్రోధం మొదలగు దోష సమూహమే సర్పములు. జగన్మయుడైన మహేశ్వరుడు వాటన్నింటినీ వశపరచుకుని వాటిని ఆభరణములుగా ధరిస్తాడు. వివిధ కార్యకలాపములే జటలు. వాటిని ధరించడంవల్ల ఆయన జటాధారి అయినాడు. త్రిగుణాలతో కూడిన శరీరమే త్రిపురం. దానిని భస్మం చేయడం వల్లనే ప్రభువు త్రిపురారి అయినాడు. ఈవిధంగా భగవానుని స్వరూపాన్ని గుర్తించిన సూక్ష్మదర్శులు ఆయనను వదలి మరెవరిని శరణు పొందుతారు.*

## యుగ పరివర్తన ప్రక్రియ

మహాశివరాత్రి పుణ్యక్షణాలలో పూర్తిగా ఉపవాసం ఉండి, మహేశ్వరుని చింతన చేస్తే, భక్తులకు ఆయన కోరుకున్న ఫలాలను ఇస్తాడు. మహాకాలుడు ఈ సమస్త సృష్టికీ అధిష్ఠాత, నియామకుడు. ఆయన కాలానికీ అధీశ్వరుడు. కనుకనే ఆయన మహాకాలుడు అయినాడు. ఆయన సైగతో యుగ పరివర్తన జరుగుతుంది. సృష్టి తన క్రమాన్ని మార్చుకుంటుంది. ఆయన శక్తి ద్వారానే యుగ ప్రత్యావర్తన ప్రక్రియ వేగం పుంజుకుంటుంది. **సంభవామి యుగే యుగే** అనే తన చిరంతన ప్రతిజ్ఞను నెరవేర్చడంకోసం ఆ ప్రభువు వివిధ యుగాలలో ఈ భూమిపై అవతరిస్తాడు. ఆయన అవతరించిన సమయంలో పలువురు లీలా సహచరులు ఆయనతో కలుస్తారు. కృతార్థులు అవుతారు. మహత్తరమైన ఆయన చేతన యొక్క స్పర్శవల్ల యుగం మారుతుంది. ధరిత్రి ధన్య మవుతుంది.

## భావ విప్లవానికి కొత్త ఒరవడి

2003 సంవత్సరం మహాశివరాత్రి రోజున దేవసంస్కృతి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మహాకాలుని విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఈ ప్రతిష్ఠ భావ విప్లవ మహోద్యమ చరిత్రలో ఒక క్రొత్త అధ్యాయానికి ప్రతిష్ఠ. అది మహేశ్వర మహాకాలుడు సంచాలన చేస్తూన్న యుగ ప్రత్యావర్తన ప్రక్రియలో కొత్త ఒరవడికి ప్రతిష్ఠ. అది మహాకాల భగవానుడు భక్తులకు కొత్త వరాలను వర్షించడం.

మహాశివరాత్రి పుణ్యక్షణాలలో నిరాకార భగవానుని ఈ సాకార రూపం యొక్క అర్చన భక్తుల, సాధకుల జీవితాలలో పరమశివుని అనుగ్రహాన్ని వివిధ రూపాలలో అందిస్తుంది.

H H H

**సాఫల్యానికి సూత్రాలు-దృఢ సంకల్పం, కఠోర పరిశ్రమ.**

## దేవ సంస్కృతి సౌరభం

# ఆధ్యాత్మిక పవర్‌హౌస్‌లు మన తీర్థక్షేత్రాలు

### చైతన్యానికి దోహదం

తీర్థక్షేత్రాల గొప్పతనం, మహిమ అసామాన్యమైనవి. అవిశ్వాస సంక్షోభంలో చిక్కుకున్న ఈ సమయంలో సైతం తీర్థక్షేత్రాల ప్రయోజనం, వర్తమాన ప్రాధాన్యం నిలచే ఉన్నాయి. ఎందుకంటే - వాటి సిద్ధాంతం అశాస్త్రీయమైన మూఢ నమ్మకాలపై కాక శాస్త్రీయతపై, ఆచరణాత్మకతపై ఆధారపడి ఉంది. అజ్ఞానంవల్ల, సరైన అవగాహన లేకపోవడంవల్ల తీర్థాలపట్ల గ్రుడ్డి నమ్మకం వ్యాపించి ఉంది. వాస్తవానికి - తీర్థాలలోని దివ్య వాతావరణంవల్ల శారీరకంగా, మానసికంగా, ఆత్మికంగా ప్రయోజనం పొందగలుగుతాము. చేతనాత్మకమైన ఉత్కృష్టతను అభివృద్ధి చేయడం తీర్థాల ప్రత్యేక లక్షణం. ఆ అభివృద్ధి మన ఆకాంక్షలను పూర్తి చేస్తుంది.

### తరింపజేసేది తీర్థం

తీర్థయాత్రలవల్ల పుణ్యం వస్తుందని శాస్త్రాలు చెపుతున్నాయి. ఆత్మక్షాళన, ప్రాయశ్చిత్తం, పాప ప్రకటీకరణలతో తీర్థాలు ముడిపడి ఉన్నాయి. 'తీర్థ' అనే శబ్దం 'తౄ' ధాతువునుండి ఏర్పడింది. 'తౄ' అనగా తరణం, ఉత్తరణం. దాటలేని నదులను, తీవ్రమైన ఆపదలను, అడ్డుకోలేని ఆటంకాలను దాటడానికి సాయపడేది - అని దాని అర్థం. ఇలా తీర్థం ఒక ఒడ్డు నుండి మరొక ఒడ్డుకు తీసుకువెళుతుంది. చేతనను క్రింది నుండి ఎగువకు తీసుకువెళుతుంది. ఉన్నతోన్నతం చేస్తుంది.

ఇలా 'తీర్థం' అనే పదం స్థలాన్ని మాత్రమే కాక వ్యక్తినీ, గుణాన్నీ కూడ పేర్కొంటుంది. ఈవిధంగా గురువును తీర్థంగా పరిగణించారు. ఎందుకంటే - గురువు సంసార సాగరాన్ని తరింపజేస్తాడు, దాటిస్తాడు. దాటించేది ఏదైనా తీర్థమే. గురువు జీవిస్తూన్న తీర్థం. జంగమ తీర్థం (కదిలే తీర్థం) ప్రత్యేకత ఇది. భవనాలు, జలాశయాలు, విగ్రహాలు, ఆలయాలు మున్నగు జడ పదార్థాలు స్థావర తీర్థాలు (స్థిరంగా ఉండే తీర్థాలు). అయితే వీటి స్థూల ప్రభావం కన్న సూక్ష్మ ప్రభావం హెచ్చు. అయినా వీటి స్థూల ప్రభావం కళ్లకు కనిపించే మనోహర దృశ్యంవలె ఉంటుంది. వాస్తవానికి - కనబడేది జరగదు; జరిగేది కనబడదు. ఈ భ్రమలో కూరుకుపోయిన మనిషి మనసు అనుమానాల కారు మబ్బుల్లో చిక్కుకుంటుంది. వాస్తవాలకు దూరం అవుతుంది.

### తీర్థాలలో దివ్య చైతన్య తరంగాలు

తీర్థంలోని ప్రత్యేకత ఆ స్థలంలో ప్రవహించే దివ్య చైతన్య తరంగాలలో ఇమిడి ఉంటుంది. ఈ చైతన్య శక్తులే ఏ స్థలాన్ని అయినా ప్రాణవంతం చేస్తాయి. సామర్థ్యవంతం చేస్తాయి. వాటిని తాకినంత మాత్రాన రకరకాల అనుభూతులు కలుగుతాయి. రంగు రంగుల అనుభూతులు కలుగుతాయి. తీర్థానికి నిజమైన అర్థం ఇది - ఎక్కడ సత్ ప్రవృత్తులు నిరంతరం కదులుతూ ఉంటాయో, తమ సంపర్కంలోనికి, తమ సాన్నిధ్యంలోనికి వచ్చే వ్యక్తులకు వాటిని అవలంబించేందుకు ప్రేరణ ఇస్తాయో, ఆ స్థలం తీర్థం. తీర్థ తత్వం దేవాలయాలకో, నదులూ సరస్సులకో, పూజా పురస్కారాలకో పరిమితం కాదు. ఇవి ఆ తత్వానికి బాహ్య రూపాలు. తీర్థ తత్వానికి ప్రాణం ఒక ప్రత్యేకమైన వ్యవస్థ, ఒక ప్రత్యేకమైన విధానం. ఆ వ్యవస్థలోపల ఆ స్థలాలలో నివసించే మనీషులూ, బ్రహ్మవేత్తలూ విస్తృతమైన జన సంపర్కం ద్వారా జనమానసంలో ధర్మంలోని వాస్తవిక తత్వాన్ని బోధిస్తారు. దానిద్వారా తమ జీవితంలోని రహస్యాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తూ ఉంటారు.

**ఇంద్రియ సంయమనం, మానసిక ఏకాగ్రతల కలయికయే మానవీయ విద్యుచ్ఛక్తి.**

ఈ ప్రయత్నం ఫలితంగా, ఈ పురుషార్థం ఫలితంగా మానవ చేతన స్థాయి పెరుగుతూ వచ్చేది. ప్రాణవంతమైన, సజీవమైన ఈ ప్రక్రియ తీర్థతత్వంలోని అసలు రహస్యం.

### వివేకానందుని అనుభూతి

తీర్థం శ్రద్ధకు సజీవ ప్రతీక. సజీవమైన కొలబద్ద. శ్రద్ధ వస్తువులలో లేదు. ఉత్కృష్ట వ్యక్తులు, తపస్వులు విశ్వాసాలను పెంచడానికై నడిపే కార్యకలాపాలవల్ల శ్రద్ధ జన్మిస్తుంది. బాహ్య రూపాలకన్న ఎన్నెన్నో రెట్లు హెచ్చుగా తీర్థాల మహిమ ఆరోజుల్లో నడిచిన ఆ మహాత్ముల కార్యకలాపాలలో నిండి ఉంది. ఆ కార్యకలాపాల ప్రభావాన్ని యుగ యుగాల వరకు అనుభూతి పొందగలుగుతాము. తపస్సులోని తీవ్రమైన శక్తి దీర్ఘకాలం ఆ వాతావరణంలో కలగలిసి ఉంటుంది. దీర్ఘకాలం వరకు ఆ తపశ్శక్తి తన ప్రభావాన్ని ప్రసరిస్తూ ఉంటుంది.

**బుద్ధుని తప స్థలం బోధగయలో స్వామి వివేకానంద ఆ బుద్ధ భగవానుని మహాచేతనలో తాను ఏకరూపం అయినట్లు అనుభూతి పొందారు.**

### ఋషుల తపోభూములు

పర్వత గుహలలో, కొండలోయలలో, నదుల సంగమ స్థలాలలో ఆర్య ఋషులు జన్మించారు; వారు ఆయా స్థలాలలో తపస్సు చేశారు; దాని ఫలితంగా ఆ స్థలాలు దివ్య తీర్థాలుగా పరిణతి పొందాయి - అని ఋగ్వేదం చెపుతోంది.

బ్రహ్మ మానసపుత్రులలో ఒకరైన వైదిక ఋషి అంగిరా తపస్సు చేసిన స్థలం అలకనంద తీరంలో ఉన్నదని మహాభారతం వన పర్వంలో పేర్కొనబడింది.

ఋషి అంగిరా సరస్వతీనది తీరంలో ఉన్న శీతల ప్రదేశంలో మొదటిసారిగా అగ్నిని ఆవిష్కరించారని ఋగ్వేదం(1-31-1) చెపుతోంది.

మరీచి పుత్రుడు కశ్యపుడు హరిద్వార్‌లో నివసించేవారు. ఆయన గంధమాదన పర్వతంపై కూడ తపస్సు చేసేవారు. అలకనంద తీరంలో తపస్సు చేసేవారు.

భృగుపుత్రుడు జమదగ్ని ఉత్తరకాశీ సమీపంలో నాపురీ అనే స్థలంలో తపస్సులో నిమగ్నులు అయేవారు.

సప్తఋషులలో ఒకరైన వశిష్ఠుడు అరుంధతితో కలసి హిమాలయాలలోని టిహరీలో ఉన్న చిసోన్ (వశిష్ఠాశ్రమం)లో నివసించేవారు.

ఋషి అత్రి ఆశ్రమం మండల్ చట్టీకి మూడు మైళ్ల దూరంలో ఉన్న దుర్గమమైన గుహలో ఉంది.

బదరీ క్షేత్రంలో నర నారాయణుల తపస్థలం ఉంది.

ఉత్తర కాశీవద్ద గల గంగానానీ పరాశర ఋషి తపోభూమి.

బృహస్పతి భరద్వాజ ఆశ్రమం హరిద్వార్‌లో ఉండేది.

సప్తఋషులలో ఒకరైన గౌతమ మహర్షి ఆశ్రమంకూడ హిమాలయాలలో మందాకిని తీరంలో ఉండేది.

ఈ నది పరిసరాలలో అగస్త్యముని అనే స్థలంలో అగస్త్య ఋషి ఆశ్రమం ఉన్న జ్ఞాపకాలు నేటికీ నిలచి ఉన్నాయి.

అసుర గురువు శుక్రుని తండ్రి భృగు ఋషి ఆశ్రమం ఉత్తర గఢ్‌వాల్‌లోని బృగుపంథ్ అనే దుర్గమ స్థలంలో ఉంది.

పురూరవ, ఊర్వశుల తపోభూమి మందాకిని, అలకనందల తీర ప్రదేశం.

వాలఖిల్య ప్రభాస్‌లో వాలఖిల్య ఋషులు తపస్సు చేశారు.

పాత శ్రీనగర్‌లో ప్రస్తుత శంకర మఠం సమీపంలో దేవల ఋషి తపోభూమి ఉండేది.

**కలసి పంచుకుని తినడంలో ఆనందం, సామరస్యం ఉన్నాయి.**

ఉఖీమఠంలో ఆర్యనరేశుడు మాంధాత తపస్సు చేశారు.

కణ్వుని ఆశ్రమం చౌకీఘాట్ కోట్ద్వార్ సమీపంలో గఢ్వాల్‌లోని మాలినీనది ఒడ్డున ఉండేది.

మందాకినీ, గంగా నదుల సంగమ స్థలం ఉగ్ర దేవత రుద్రుని క్షేత్రంగా పరిగణించబడుతోంది. కేదారనాథ్, తుంగనాథ్, రుద్రనాథ్, రుద్ర ప్రయాగ తీర్థాలతో రుద్ర భగవానునికి సంబంధం ఉన్నదని చెపుతారు.

వేదవ్యాసుని ఆశ్రమం బద్రీనాథ్ సమీపాన ఉన్నదని విమల్ చరణ్ లాహా "ప్రాచీన భారత్‌కే ఐతిహాసిక్ భూగోల్" అనే తన గ్రంథంలో వ్రాశారు.

గంగోత్రిలో భగీరథుడు కూర్చొని తపస్సు చేసిన శిల నేటికీ సురక్షితంగా ఉంది.

ఈ శిలపైననే పరమపూజ్య గురుదేవులు తమ హిమాలయ తపశ్చర్య (4 సంవత్సరాలు)లో నాలుగింట మూడువంతులు గడిపారు.

ఋషుల ఈ తపఃస్థలాలు నేటికీ ఆధ్యాత్మిక శక్తితో నిండి ఉన్నాయి. మేఘమాలలవలె అవి విస్తృత క్షేత్రంలో ప్రేరణల వర్షం కురిపిస్తున్నాయి. భావనల పైరులను పండిస్తున్నాయి. కనుక అవి ఆధ్యాత్మిక శక్తి ఉత్పాదనకు 'పవర్ హౌస్'లుగా పని చేస్తున్నాయి.

అలాగే - కొన్ని స్థలాలలో దేవతల లీలలు జరిగాయి. అవతార చేతనల లీలలు జరిగాయి. ఆ దివ్య శక్తియొక్క ఆకర్షక ప్రభావం వల్ల ఆయా స్థలాల వాతావరణం తమ మహిమ చూపుతుంది. సంపర్కంలో వచ్చిన వ్యక్తులపై అద్భుతమైన ప్రభావం చూపుతుంది.

## శ్రీ అరవిందుల సాధన మహిమ

అలాంటి ఒక సంఘటన. ఒక మామూలు ఖైదీని అలీపూర్ జైలులోని ఒక చీకటి గదిలో ఉంచారు. ఆ ఖైదీ ఆ గదిలో అసాధారణంగా ప్రవర్తించాడు. అలా ఎందుకు జరిగిందో దర్యాప్తు చేశారు. 1908లో ఆ గదిలో శ్రీ అరవిందులు ఉన్నారు. సాధన చేశారు. అక్కడ అందరిలో, అన్నింటిలో ఆయనకు శ్రీకృష్ణుడు దర్శనం ఇచ్చాడు. ఆ **దివ్య వాతావరణంలోని శక్తి తరంగాలు ఆ ఖైదీని ప్రభావితం చేశాయి.** ఆ క్షేత్రంలోని చైతన్య తరంగాలను ధారణ చేసే సామర్థ్యం మనలో ఉన్నప్పుడే దాని ప్రయోజనం మనకు లభిస్తుంది.

## హరిద్వార్ క్షేత్ర మహిమ

మహాయోగి పండిత గోపీనాథ్ కవిరాజు తమ హరిద్వార్ పర్యటన సంస్మరణలో ఒక విషయం పేర్కొన్నారు. హరిద్వార్‌లో బ్రహ్మాండీయ శక్తుల ప్రవాహం ఉధృతంగా ఉన్నదని ఆయన వ్రాశారు. తపస్సు, జ్ఞానముల ఫలితంగా హరిద్వార్ తీవ్రమైన వేడిమితో నిండి ఉంటుంది. ఫలితంగా - అక్కడ కర్మ బీజములు అసలు ఉత్పన్నం కావు. కర్మలు జరుగుతాయి. బ్లాక్‌బోర్డుమీద సీమసున్నంతో గీసిన గీతలవలె అవి ఉంటాయి. వాటిని ఇట్టే తుడిచి వేయవచ్చు. తపస్సు ప్రభావంవల్ల అక్కడ కర్మబీజములన్నీ సమాప్తం అయిపోతాయి.

అయితే ఈ స్థలం స్థూలంలో కాక, నాల్గవ కొలత (ఫోర్త్ డైమెన్షన్)లో నిలచి ఉంది. గోపీనాథ్ కవిరాజు తీర్థములను వైజ్ఞానికంగా ఇలా వివేచన చేశారు -

## దేశ కాలములకు అతీతం

భారతదేశంలోని కాశీ, మథుర, బృందావనం, పూరీ, గోకర్ణం, అవంతి మున్నగు తీర్థక్షేత్రాలు ఈ నాల్గవ కొలత (స్థలము, కాలము, బరువు - వీటికి అతీతమైన మరో కొలత)తో సంబంధం కలిగిన స్థలాలు. ఇవన్నీ ఊర్ధ్వలోకం నుండి అవతరించిన స్థలాలు. వీటన్నింటికీ తమ తమ సూక్ష్మ స్థాయిలు ఉన్నాయి. వీటిని స్పేస్ - టైమ్ (దేశము - కాలము) పరిధిలో అర్థం చేసుకోవడం దుష్కరం. ఎందుకంటే - వీటి

**ఉన్నతికి మూలాధారం-'సాదా జీవనం, ఉదాత్త ఆలోచన.'**

సూక్ష్మ ప్రభావాలు దేశ కాలాలకు అతీతమైనవి.

కాశీ తీర్థంలోని వాస్తవం ఏమంటే - అది స్పేస్ టైమ్‌కు అతీతమైనది. అది దేశ, కాలాలకు ఊర్ధ్వంలో (ఎగువన) నిలచి ఉన్నది. కనుకనే 'కాశతే తత్వం' అని దీనిని వర్ణించారు. అనగా- అక్కడ నిరంతరం తత్వముల కాంతివలయం ఉంటుంది. కాశీ తీర్థంలో దేహాభిమానం మిగలదు. అక్కడ మృత్యువు తర్వాత జీవుడు పరమతత్వంలో విలీనం అవుతాడు. పరమతత్వంలో కలసిపోతాడు. కాశీలో మరణించిన తర్వాత మోక్షం లభిస్తుందనే మాటకు అర్థం ఇదే.

## వింధ్యాచలం, కామాఖ్య

ఒక్కొక్క తీర్థానికీ ఒక్కొక్క ప్రత్యేక మహత్తు ఉంది. ఒక తీర్థంలో సహజంగానే భావ వికాసం జరుగుతుంది. ఒక తీర్థంలో ప్రేమ, మరో తీర్థంలో జ్ఞానం, వేరొక తీర్థంలో యోగశక్తులు వ్యక్తం అవుతూ ఉంటాయి. ఆ విశిష్ట చేతన ఫలితంగా అలా జరుగుతుంది.

వింధ్యాచలం, కామాఖ్య పీఠం త్రికాల స్థలాలు. అయితే, వీటి ప్రభావాలు వేర్వేరుగా ఉంటాయి. కామాఖ్యలో శక్తుల జాగరణ అత్యంత తీవ్రంగా జరుగుతుంది. కనుక అక్కడ తాంత్రిక సాధనలు త్వరగా సఫలం అవుతాయి. వింధ్యాచల తీర్థంలో సంసార చక్రంనుండి బయటపడడానికి అనేక మార్గాలు ఉన్నాయి. వాస్తవానికి ఇవి ఆధ్యాత్మిక ప్రక్రియలు - మామూలు బుద్ధికి అందనివి.

## శరీరంలో తీర్థాలు

తీర్థాలన్నీ మన శరీరంలో ఉన్నాయని తీర్థాల రహస్యాలను తెలుసుకున్న మర్మజ్ఞులు చెపుతారు. న్యాసంద్వారా వివిధ శక్తులను శరీరంలో స్థాపించడం జరుగుతుంది. న్యాసం అంటే అర్థం - భావనా శక్తిద్వారా ఆ శక్తిని కల్పన చేయడం.

అధ్యాత్మవిద్య ఆచార్యులు ఇలా చెపుతారు -

బాహువుల మధ్యలో కాశీ తీర్థం ఉంది. ఇక్కడ అహంబుద్ధి-దేహాభిమానం వదులుకోవడమే కాశీ మృత్యువు.

నాభి క్రింద కామాఖ్య తీర్థం ఉంది.

హృదయం ఎడమ వైపున సాకేతం, అయోధ్య తీర్థం ఉన్నాయి.

'సహస్రపత్రం గోకులే' అనగా-సహస్ర దళ కమలం మధ్య బృందావనం, గోకుల తీర్థం ఉన్నాయి.

ఇవన్నీ ఆంతరిక తీర్థాలు. శరీరమంతా తీర్థమయమని దీన్ని బట్టి స్పష్టమవుతోంది. అంతటా తీర్థాలు ఉన్నాయి. జ్ఞానమార్గంలో పయనించేవారు తీర్థయాత్రలు చేస్తారు. తమ పాప తాపాలను క్షాళన చేసుకుంటారు.

అపనమ్మకం ప్రబలిన ఈ రోజుల్లో తీర్థయాత్ర ఎలా చేయాలి? సంయమనంతో, సంయుత భావంతో తీర్థయాత్రలు చేయాలి. ఏ తీర్థంవైపు వెళుతున్నామో ఆ తీర్థం యొక్క అధిష్ఠాన దేవసత్తాను ధ్యానం చేయాలి.

అంతే కాదు. పీడిత ప్రజలనూ, సంత్-మహాత్ములనూ సేవ చేస్తే కూడా తీర్థయాత్ర చేసిన పుణ్యం వస్తుంది. సదాచరణను, సంయమనాన్నీ పాటిస్తూ తన సత్కర్మను చేయడం కూడా తీర్థయాత్రయే. ఎందుకంటే - తీర్థములన్నీ మన శరీరం లోపల ఉన్నాయి. కనుక సత్కర్మ ద్వారా, నిష్కామ సేవాభావం ద్వారా కూడా తీర్థయాత్రల పుణ్యం సంపాదించవచ్చు. దీనివల్ల మీ ఆంతరిక చేతన సంస్కరించబడుతుంది. దానికి క్షాళన జరుగుతుంది. ఫలితంగా తీర్థయాత్రలోని పరమ రహస్యాన్ని అర్థం చేసుకోగలుగుతాము. దాని నుండి ప్రయోజనం పొందగలుగుతాము.

H H H

**గాయత్రి జపించు - ప్రాణశక్తిని పెంచుకో.**

ఆధ్యాత్మిక చికిత్స

# ఆధ్యాత్మిక రహస్యాలకు ఆలవాలం మానవ జీవనం

## పని చేస్తున్నది సగం మెదడే

మానవ జీవనంలోని ఆధ్యాత్మిక రహస్యం అద్భుతమైనది. అందులో ఎన్ని ఆశ్చర్యాలు నిండి ఉన్నాయంటే - మామూలు బుద్ధికి వాటిని నమ్మడం సాధ్యపడదు. అనుభవం చెపుతూన్న విషయం ఇది. శరీరం ద్వారా మనకు జీవితం పరిచయం అవుతోంది. కానీ ఆ శరీరం గురించి మనకు తెలిసింది సగం సగమే. ఈ శరీరం మాంసంతో, చర్మంతో కప్పబడిన అస్థిపంజరంగా పైకి కనబడుతుంది. దానిలోపల రక్తం, ప్రాణం ప్రసరిస్తూన్నట్లు తెలుస్తుంది. అయితే, శరీరం లోపల మరెన్నో సూక్ష్మతలు ఉన్నాయని వైజ్ఞానిక దృష్టి చెపుతోంది. వాటి విషయంలో అత్యాధునిక పరిశోధనలు సైతం ఏమీ చెప్పలేకపోతున్నాయి. లోపల స్రవించే గ్రంథుల వ్యవస్థలు, మాంస కండరాలలో పెనవేసుకొని ఉన్న తంత్రికల గుచ్ఛాలు, మెదడులో ఉన్న నాళాలలో సగానికి పైగా నిష్క్రియంగా, పని చేయకుండా పడి ఉండడం - ఇవన్నీ మూడవ సహస్రాబ్దంలోని గొప్పగొప్ప శాస్త్రవేత్తలను తికమక పెడుతున్నాయి.

## శాస్త్ర నిపుణులకు అందని రహస్యాలు

ఆధునిక శాస్త్ర విజ్ఞానానికీ, వైజ్ఞానిక నిపుణులకూ అంతు చిక్కని సూక్ష్మ వ్యవస్థలు ఆధ్యాత్మిక రహస్యాలకు ద్వారాలు కావచ్చని శాస్త్రవేత్తలలో పలువురు భావిస్తున్నారు. కొద్ది సంవత్సరాల క్రితం, మూడవ సహస్రాబ్ది ప్రారంభ సమయంలో "ప్రిడిక్షన్ ఫర్ ది నెక్స్ట్ మిలెనియమ్'' అనే గ్రంథం వెలువడింది. డేవిడ్ క్రిస్టాఫ్, టాడ్ డబ్లియు నికర్సన్ అనే విజ్ఞాన శాస్త్ర నిపుణుల సంపాదకత్వంలో అది ప్రచురితమయింది. ఈ గ్రంథంలో 270 మంది ప్రముఖ శాస్త్ర నిపుణుల ఆలోచనలు ఉన్నాయి. భవిష్యత్తులో మానవుని వికాసం ఎలా ఉంటుందో వారు తెలిపారు. భవిష్యత్తులో మానవుడు తన జీవితంలోని ఆధ్యాత్మిక రహస్యాలను శాస్త్రీయ పద్ధతిలో తెలుసుకునే అర్హత సంపాదించగలుగుతాడనే విశ్వాసం ఆ గ్రంథంలోని సారాంశం.

## ఆధ్యాత్మిక సాధనాలు అవసరం

అయితే ప్రస్తుత పరిస్థితి ఏమిటంటే - దేహ రహస్యాలు తెలియడం లేదు. ప్రాణ ప్రవాహం గురించి కూడా అజ్ఞానమే ఉన్నది. నాడీ మండలంలో ప్రవహించే ప్రాణానికీ, విశ్వ ప్రాణానికీ ఎలాంటి సంబంధం ఉంది? ఈ ప్రశ్నకు సవ్యమైన, శాస్త్రీయమైన జవాబు లేదు. మరో ప్రక్క - ఆధ్యాత్మికత అనే భవ్య భవనపు పునాది అంతా ప్రాణవిద్యపైనే ఆధారపడి ఉంది. ప్రాణంలోని తేడాలు, ఆ తేడాలలోని అంతరాలు, భావనలపై, ఆలోచనలపై దాని ప్రభావం - ఇదంతా విలక్షణమైన విషయం. దానిని అనుభూతి పొందితే ఏ వ్యక్తి అయినా జీవితాన్ని తన చేతుల్లోకి తీసుకోగలుగుతాడు.

ప్రాణం విషయంలో వలెనే - మనస్సులోని ఆధ్యాత్మిక రహస్యాలను మనస్తత్వ శాస్త్ర నిపుణుల సముదాయం కనుగొనలేకపోయింది. మనస్సు ఆలోచించే వ్యవస్థ మాత్రమే కాదు. మనస్సులోని అవచేతన, అచేతన పొరల లోతు వర్తమాన జీవితానికి ఎంతో అతీతమైనది. ఈ పొరలలో ఎన్నెన్నో అంతరాలు ఉన్నాయి. ఆధ్యాత్మిక సాధనాల ద్వారా మాత్రమే వాటిని తెలుసుకోగలుగుతాము. వాటిని వెలికి తీయగలుగుతాము. వాటిని మేలుకొలుప గలుగుతాము.

వాటి మేలుకొలుపు జరిగినప్పుడు - ఈ మనస్సే మనకు అతీంద్రియ విషయాలను చూపుతుంది. ఏదో అంతు తెలియని కిటికీ గుండా భవిష్యత్తు దృశ్యాలు కానవస్తాయి. జీవితపు పొరలు లెక్కకు మిక్కిలి అయినవి. వాటి రహస్యాలు అసంఖ్యాకములు. నిజమైన జిజ్ఞాసువే వాటిని తెలుసుకోగలుగుతాడు. ఆరోగ్యప్రదమైన జీవితానికి నిజమైన అర్థం అన్వేషించాలనే తపన కలిగిన వ్యక్తి మాత్రమే వాటిని తెలుసుకోగలుగుతాడు. ఆధ్యాత్మిక చికిత్స ద్వారానే ఆరోగ్యప్రదమూ, సఫలమూ అయిన జీవితాన్ని పొందవచ్చుననే సత్యాన్ని గ్రహించిన వ్యక్తి మాత్రమే దీనిని తెలుసుకోగలుగుతాడు.

## సత్‌ప్రేమ్ సాధన

ఇలాంటి నిజమైన సాధకుడు ఒకడు 1953లో శ్రీ అరవిందుల ఆశ్రమానికి సాధన కోసం వచ్చారు. ఆయనకు గతంలో పాండిచ్చేరితో సంబంధం ఉంది. ఆయన ఇంతకుముందు పాండిచ్చేరిలోని ఫ్రెంచి వలస ప్రభుత్వంలో పని చేశారు. అప్పుడే ఆయనకు శ్రీ అరవిందులతోను, శ్రీమాతతోనూ

**సద్బుద్ధికి అధిష్ఠాన దేవత గాయత్రి.**

ఆత్మీయ సంబంధం ఏర్పడింది. 'మానవ జీవనంలో అనంతమైన ఆధ్యాత్మిక రహస్యాలు ఇమిడి ఉన్నాయి' - అనే ఈ ఒక్క మాట ఆయన గుండె లోతులను తాకింది. ఆయన తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చారు. డచ్ గయానా వెళ్లారు. ఆయన అక్కడి అమెజాన్ అరణ్యాలలో సంవత్సరం పాటు సాహసంతో సాధన చేశారు. ఆ తర్వాత బ్రెజిల్ మీదుగా ఆఫ్రికా చేరారు. సాహసపూర్వకమైన ఈ అన్వేషణలో ఆయనకు సద్గురువు మార్గదర్శనం అత్యవసరమని అనుభవం అయింది.

ఈ అనుభూతి ఆయనను శ్రీమాత చరణాల వద్దకు తెచ్చింది. 30 సంవత్సరాల వయస్సులో ఆయన శ్రీమాతకు సమర్పిత శిష్యులు అయినారు. శ్రీమాత ఆయనను 'సత్‌ప్రేమ్' అని పిలిచారు. సాధన గురించిన సాహసిక సంకల్పం, సద్గురువు పట్ల అపారమైన శ్రద్ధ - రెండూ ఆయనలో ఏకం కావడంతో, ఆయనకు కొత్త జీవితం ప్రారంభమయింది. ఆయన తన నూతన మార్గంలో పురోగమించారు. ఆ ప్రయాణంలో కొత్తకొత్త ఆధ్యాత్మిక రహస్యాలు ఒక్కొక్కటిగా అవగతం అయినాయి.

## పదార్థం, శక్తి రూపాంతరాలు

సృష్టికీ, మానవ జీవనానికీ మూలం శక్తి అని ఆయనకు మొట్ట మొదట అనుభవమయింది. ఈ శక్తి తన నిర్ణీత పద్ధతిలో వేర్వేరు రూపాలు ధరించింది. లోకాల సృష్టి ఈ విధంగానే జరిగింది. మానవ జీవనానికి కూడా ఈ విధంగానే ఉనికి ఏర్పడింది. ఈ విషయాలన్నీ ఆయన అనుభవంలోకి వచ్చాయి.

ఈ అనుభూతి తర్వాత ఆయన ఇలా అన్నారు - $E=mc^2$ అనే ఐన్‌స్టీన్ సూత్రం వైజ్ఞానిక సూత్రమే కాక ఆధ్యాత్మిక సూత్రం కూడా. పదార్థం శక్తిగా, శక్తి పదార్థంగా రూపాంతరం చెందుతూ ఉంటుంది. మారుతూ ఉంటుంది. మానవ జీవనం కూడా ఈ రూపాంతరణం (రూపం మార్పు) ఫలితమే. దేహం, ప్రాణం, మనస్సు, అంతఃకరణ, అంతరాత్మల సంయోగం వల్ల వ్యక్తిత్వం ఏర్పడుతుందని మనం చెపుతాము. వాస్తవానికి ఆ వ్యక్తిత్వం శక్తి తరంగాల సుఖదాయక సంయోగం. కర్మ, ఇచ్ఛ, భావనలకు అనుగుణంగా ఈ శక్తి తరంగాలలో హెచ్చు తగ్గులు ఏర్పడుతూ ఉంటాయి. స్థితిలో ఏర్పడే ఈ పరివర్తనకు వర్తమాన జీవనంతో పాటు గతంలో (గత జన్మలలో) చేయబడిన కర్మలు, ఇచ్ఛలు, భావనలు కారణాలు అవుతాయి.

ఇవి ఉపయోగకరంగా ఉంటే మంచి మార్పు జరుగుతుంది. ఇవి హానికరంగా ఉంటే చెడు మార్పు జరుగుతుంది. జీవితంలో ఒక ప్రత్యేక శక్తి తరంగం తగ్గితే- ఆరోగ్యం, మానసిక స్థితి, కుటుంబ పరిస్థితి, సామాజిక పరిస్థితి అందుకు అనుగుణంగా మార్పు చెందుతాయి. తపస్సు, యోగం, మంత్రవిద్య మున్నగు ప్రక్రియల ద్వారా ఈ పరిస్థితులను చక్కదిద్దవచ్చు.

సత్‌ప్రేమ్ ఈ ప్రయోగాలన్నింటినీ ఒక శాస్త్రవేత్త వలె చేశారు. ఆయన తన ప్రయోగాల ఫలితాలను లిపిబద్ధం చేశారు. మానవ జీవనంలోని ఆధ్యాత్మిక రహస్యాలను వివరంగా తెలుసుకొనగోరేవారికి సత్‌ప్రేమ రచనలు మార్గదర్శకాలుగా, దీపస్తంభాలుగా పని చేస్తాయి.

## ఈ గ్రంథాలు దీపస్తంభాలు

తన ప్రయోగాల ఫలితాలను ఆయన మొట్టమొదట "శ్రీ అరవింద అండ్ ది ఎడ్‌వెంచర్ ఆఫ్ కాన్షస్‌నెస్" అనే గ్రంథంగా రూపొందించారు. ఆ తర్వాత ఆయన "ఆన్ ది వే ఆఫ్ సూపర్‌మాన్‌హుడ్" అనే గ్రంథాన్ని ప్రచురించారు. శ్రీమాత సన్నిధిలో తన అనుభూతులను ఆయన 'మదర్స్ ఎజెండా" అనే గ్రంథంలో వర్ణించారు. 13 ఖండాల గ్రంథం అది. ఆ తర్వాత ఆయన "ది డివైన్ మెటీరియలిజమ్", "ది న్యూ స్పిసీజ్", "ది మ్యూటేషన్ ఆఫ్ డెత్" అనే గ్రంథత్రయాన్ని రచించారు. ఆ తర్వాత "ది మైండ్ ఆఫ్ సెల్స్" రచించారు. 1989లో ఆయన తన సాధనా కథను "ది రివోల్ట్ ఆఫ్ ఎర్త్" అనే గ్రంథంలో వర్ణించారు.

సత్‌ప్రేమ తన జీవితం మొత్తాన్ని మానవ జీవనంలోని ఆధ్యాత్మిక రహస్యాల అన్వేషణలో గడిపారు. ఒక మహా శాస్త్రవేత్త వలె ఆయన తన పరిశోధన ఫలితాలను మానవాళికి అందించారు. ఆ ఫలితాల సారాంశాన్ని ఇలా చెప్పవచ్చు-

1. మనమంతా సృష్టితో, సృష్టికర్తతో, ఒండొరులతో లోతుగా గుదిగ్రుచ్చబడి ఉన్నాం.

2. కర్మ చక్రమే మనందరి జీవితాలను నడుపుతోంది, పరివర్తన చేస్తోంది.

మరో రెండు అంశాలు కూడా ఉన్నాయి-

(1) ఇచ్ఛ, సంకల్పం, సాహసం, శ్రద్ధల ద్వారా మనమంతా మనలోని అనంత శక్తులను మేలుకొలుప గలుగుతాము.

(2) ఆధ్యాత్మిక చికిత్స మనిషిలోని వికృతులకు ఒకేఒక సమాధానం, ఆస్తికత ద్వారా దీనిని మన ఉనికిలో అనుభూతి పొందగలుగుతాం.

HHH

**తోటమాలిలా జీవించు. వికసిస్తూన్న పువ్వులు నీ కృషిని గానం చేస్తాయి.**

మనం - మన ఆరోగ్యం

# గాఢనిద్రకు ఉపకరించే సూత్రాలు

## శ్రమ తర్వాత విశ్రాంతి

శరీర అవయవాల క్రియాశీలత, రక్తప్రసరణలో చురుకుదనం, జీర్ణ ప్రక్రియలో క్రమబద్ధత - వీటిని నిలిపి ఉంచడానికై శ్రమించడం చాలా అవసరం. అయితే, ఇందుకు మరో పక్షం కూడా ఉంది. అది ఏమిటంటే - నిరంతరం శ్రమిస్తూ ఉండడం వల్ల శారీరక శక్తిలో ఒక నిర్ణీత భాగం ఖర్చువుతుంది. అందువల్ల బలహీనత ఏర్పడుతుంది. శరీరం దెబ్బ తింటుంది. కనుక, శ్రమించిన తర్వాత విశ్రాంతి తీసుకోవడం అత్యవసరం. పగలు తర్వాత రాత్రి వస్తుంది. జీవితం తర్వాత మృత్యువు వస్తుంది. వీటి వెనుక ఉన్న సూత్రం ఇది - తీవ్రంగా శ్రమించడం వల్ల తరిగిన శక్తిని పూడ్చుకోడానికీ, తర్వాతి పనులకూ తర్వాతి జీవితానికీ తగినంత శక్తినీ, సజీవతనూ పొందడం అవసరం. శ్రమకు, విశ్రాంతికీ ఇలాంటి సంబంధం ఉంది.

శరీరంలో నిరంతరం నశించడం, ఏర్పడడం అనే ప్రక్రియ సాగుతూ ఉంటుంది. పాత కణాలు నశిస్తూ ఉంటాయి; కొత్త కణాలు పుడుతూ ఉంటాయి. పనీ, శ్రమా బాగా పెరిగితే, నశించే పని ఎక్కువై ఉత్పత్తి అయ్యే పని తగ్గితే - మన రక్తంలో ఒక విధమైన రసాయనిక దుర్గంధం చేరుతుంది. అది రక్తంతో పాటు ప్రసరిస్తూ ఉంటుంది. ఆ రసాయనిక దుర్గంధంలోని హెచ్చు తగ్గులపైన అలసట, దౌర్బల్యం, ఇబ్బంది ఆధారపడి ఉంటాయి.

## మనశ్శాంతి ముఖ్యం

అలసట లక్షణాలు శారీరకంగాను ఉంటాయి, మానసికంగాను ఉంటాయి. ఒకోసారి రెండూ కలసి ఉంటాయి. బాగా వ్యాయామం చేసిన తర్వాత, చాలాసేపు ఈత కొట్టిన తర్వాత మన మాంస కండరాలు అలసట చెందుతాయి. అదే పనిగా చదువుతూ ఉండడం వల్ల, మెదడు చింతలలో సంక్షోభాలలో మునిగిపోవడం వల్ల మెదడు యొక్క సంతులన శక్తి దెబ్బ తింటుంది. మెదడు పని చేయడం మానివేస్తుంది. కోలాహలం కూడా మానసికమైన అలసటకు ప్రధాన కారణం. అలసట కలుగగానే పని ఆపివేయాలి. విశ్రాంతి తీసుకోవాలి.

బ్లడ్‌ప్రెషర్, గుండెనొప్పి, ఉన్మాదం వంటి భయంకర రోగాలు అలసట వల్ల కలిగే దుష్పరిణామాలు. శారీరకంగా, మానసికంగా అలసిపోవడంవల్లనే జనం గంగానది ఒడ్డున నివసించాలనీ, పర్వత శిఖరాలకు వెళ్లాలనీ, గ్రామసీమలలో కాలం గడపాలనీ కోరుకుంటారు. ఒకోసారి సంసారం పట్ల వారికి విరక్తి కలుగుతుంది. పని చేయడం వల్ల కన్న తొందరపాటు వల్ల, చింతల వల్ల శారీరక శక్తి మరింతగా క్షీణిస్తుంది.

విశ్రాంతి తీసుకోవడం అంటే అర్థం కూర్చొని, పడుకుని అలసట తీర్చుకోవడం, కానీ మనస్సులో మాత్రం చెడు తలపులు సుళ్లు తిరుగుతూ ఉండడం కాదు. ద్వేషం, క్రోధం, ప్రతీకారం, హింసవంటి భావనలు చెలరేగుతూ ఉంటే, శరీరం కదలకుండా ఉన్నా విశ్రాంతి లభించదు. శాంతి లభించదు. మానసిక అశాంతి శరీరాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ధమనులు శిథిలం అయిపోతాయి. రక్తం చెడిపోతుంది. ఆరోగ్యం దెబ్బ తింటుంది.

మానసికమైన ఒత్తిడిని తొలగించి శారీరకమైన అలసటను దూరం చేయడంలోనే నిజమైన విశ్రాంతి లభిస్తుంది. మానసిక ఒత్తిడి వల్ల నిద్ర రాదు. ప్రక్కమీద పడుకున్నా విశ్రాంతి లభించదు. అలాంటి స్థితిలో శరీర అవయవాలను వదులు చేయడానికి ప్రయత్నించాలి. విశ్రాంతి తీసుకునే ముందు మనస్సును చింతారహితం చేయాలి. కళ్లు రెండూ మూసుకుని శరీరమంతటినీ వదులు చేస్తూ ఉండాలి.

## మంచి వినోదం అవసరం

నిద్ర వల్ల శరీరానికి శక్తి తిరిగి చేకూరుతుంది. మనస్సు పొందిన అలసటను తొలగించి దానని తిరిగి క్రియాశీలం చేయడానికై మనస్సుకు విశ్రాంతి ఇచ్చే కళను వినోదం అంటాము. వినోదం వల్ల ప్రసన్నత వస్తుంది. మనస్సు తేలిక అవుతుంది. విశ్రాంతిలో శరీరం వదులవుతుంది. వినోదం వల్ల మనస్సు తేటపడుతుంది.

వినోదం లేకుండానే మనస్సుకు విశ్రాంతి ఇవ్వవచ్చు. అయితే అది కష్టసాధ్యమైన పని. అందుకు ఉన్నత స్థాయి యోగ-సాధనలు అవసరం అవుతాయి. సామాన్య ప్రజలకు వినోదమే మంచిది. అలసిపోయినపుడు ప్రజలు సంగీతం, సినిమా, చౌకబారు సాహిత్యాలతో మనసును సేద దీర్చుతారు.

వ్యక్తిత్వం సమగ్రంగా వికసించడానికి వినోదం అత్యవసరం. శిక్షణ, ఆరోగ్యం, సంపర్కం, తగు వాతావరణముల ద్వారా ఈ అవసరాన్ని విశుద్ధమూ, ఆరోగ్యప్రదమూ అయిన రీతిలో తీర్చుకోవాలి.

## వినోదంలో మంచీ, చెడూ

ఆరోగ్యప్రదమైన వినోదం వ్యక్తికి తాజాతనం ఇస్తుంది. జీవితంలో రసాన్ని నింపుతుంది. మనోభూమిలో కొత్త శక్తిని ప్రసారం చేస్తుంది. అనారోగ్యకరమూ, మలినమూ అయిన వినోదం జీవితాన్ని నీరసంగా తయారుచేస్తుంది. కుంటుపరుస్తుంది. పెడదారులు

**లోక కళ్యాణం నీ వల్ల కాకుంటే - పాషాణం నీ కన్న మిన్న.**

పట్టిస్తుంది. దుర్వ్యసనాలకు లోను చేస్తుంది. చెడు నడతలకు దారితీస్తుంది. ఆరోగ్యప్రదమైన వినోదం వ్యక్తికి ముందుకువెళ్లే ప్రేరణ ఇస్తుంది. కష్టాలతో సంఘర్షించే ప్రేరణ ఇస్తుంది. మరోప్రక్క మలినమైన వినోదం వ్యక్తిలో పిరికితనాన్నీ, దుష్ట ప్రవృత్తులను ప్రేరేపిస్తుంది. భోగవిలాసాల మోజులో పడవేస్తుంది. మనిషిలోని పశు ప్రవృత్తులను రెచ్చగొట్టే వినోదం హేయమైనది. మానవీయ గుణాలపట్ల విశ్వాసాన్ని మేలుకొలిపే వినోదం శ్రేష్ఠమైనది. ఈ గీటురాయిపై వినోధ సాధనాలను గీసిచూడవలసి ఉంటుంది.

నేటి వినోద సాధనాలలో టివి, సినిమాలు, పుస్తకాలు ప్రధానమైనవి. కానీ, ఇవి ఎక్కువగా పశు ప్రవృత్తులను రెచ్చగొడుతున్నాయి. మనిషిని చిక్కుల్లోకి దింపుతున్నాయి. మానవీయ గుణాలపట్ల విశ్వాసాన్ని మేలుకొలిపే నవలలూ, కథలూ, కవితలూ, సినిమాలు బహుఅరుదుగా కనిపిస్తున్నాయి. అశ్లీలాలతో నిండిన పుస్తకాలు బజారులో కోకొల్లలు.

అనారోగ్యకరమైన వినోదం చెడు సంస్కారాలను బలపరుస్తుంది. అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తుంది. కనుక వినోదాన్ని విశ్రాంతి కోసమే కాక, మనస్సును ప్రభావితంచేసే ఒక కళగా మనం పరిగణించాలి. చెడు అభిరుచులనూ, వికృతులనూ రెచ్చగొట్టే వినోదానికి దూరంగా ఉండాలి.

## నవ్వండి, నవ్వించండి

విశ్రాంతి, నిద్ర శరీరానికి అవసరం. వినోదం మనస్సుకు అవసరం. వినోద సాధనాలను ఎంపిక చేయడంలో మెలకువ వహించాలి. వినోదం పేరిట పత్రికలలో, సినిమాలలో, టెలివిజన్‌లో మనకు అందుతూన్నది వైద్యుడు మందుకు బదులు విషం ఇచ్చిన విధంగా ఉంటోంది. చౌకబారు, అశ్లీల, ఉత్తేజకర సంభాషణలతో కూడిన నవలలు, పత్రికలలో వచ్చే కథలూ వినోదం పేరిట మన కుటుంబాలకు ఎంతో హాని కలిగిస్తున్నాయి. వినోదం కోసం హాస్యం కురిపించే సీరియల్‌లు చూడండి. నవ్వించే సంఘటనలను స్మరించండి. అలాంటి సంఘటనలను మన కుటుంబంవారికి వర్ణించండి. హాయిగా నవ్వండి, నవ్వించండి. మంచి పాటలు వస్తే పాడండి, వినండి. ఆనందం పొందండి. ప్రశంసించండి. చిన్న పిల్లలు వినోదానికి చక్కని సాధనాలు. వినోదం ఆరోగ్యప్రదంగా ఉండాలి. తేలికగా ఉండాలి. మనస్సును సేదతీర్చాలి. అంతేకాని - అలసిపోయిన మనస్సుకు మరింత ఒత్తిడి కలిగించకూడదు. మనస్సును ఉద్రేకపరచకూడదు. మనస్సును పెడదారి పట్టించకూడదు.

## గాఢనిద్రకు పది సూత్రాలు

1. నిద్రించే సమయం నియమితంగా, నిర్ణీతంగా ఉండాలి. రాత్రి ఎక్కువసేపు మేల్కొనకూడదు. పదిగంటలకు ముందు తప్పనిసరిగా నిద్రపోవాలి. రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత నిద్రపోయేవారికి ఉదయం నిద్రలేచినపుడు తాజాతనం ఉండదు.

2. చలికాలంలో సైతం కిటికీల తలుపులన్నీ మూసివేయ కూడదు. గదిలో కారు చీకటి ఉండకూడదు. బాగా వెలుగు ఉండ కూడదు.

3. నోరు తెరచి నిద్రపోకూడదు. నిద్రపోయేటప్పుడు బిగుతు వస్త్రాలు ధరించకూడదు. వస్త్రాలు వదులుగా ఉండాలి. తక్కువగా ఉండాలి. కాళ్లూ, చేతులూ కడుక్కుని, తుడుచుకుని పడుకుంటే మంచి నిద్ర వస్తుంది.

4. నిద్రపోయేటప్పుడు చింతల మూటను దూరంగా విసిరివేయాలి. ఒత్తిడి, చింత, భయం, ఉద్వేగం వంటి వాటిని పూర్తిగా తొలగించివేయాలి.

5. నిద్రపోయేటప్పుడు పగలు జరిగిన విషయాలను స్మరించవద్దు. నామ జపం చేయండి. లేదా ఈశ్వర స్మరణ చేయండి. 100 నుండి 1 వరకు అంకెలను నెమ్మదిగా లోలోపల లెక్కపెడుతూ ఉండండి.

6. ప్రతి అవయవాన్నీ వదులు చేయాలి. కళ్లు మూసుకోవాలి. దీర్ఘంగా శ్వాస తీసుకోవాలి. శ్వాసపైన ధ్యానను కేంద్రీకరించాలి. మీరు ఒక పసిపాపఅనీ, మీ ఇష్ట దైవం ఒడిలో పడుకున్నారనీ భావన చేయండి.

7. నిద్రకోసం మాత్రలు వాడడం చాలా హానికరం. ఆ వాడకం అలవాటుగా మారుతుంది. ఆతర్వాత ఆ మాత్ర వేసుకోకపోతే నిద్ర రాదు. అత్యవసరమైతేతప్ప నిద్ర మాత్రలు వాడవద్దు.

8. భోజనం చేసిన వెంటనే నిద్రపోకూడదు. సాయంత్రం త్వరగా భోజనం చేయాలి. నిద్రపోయే సమయానికి ఆ భోజనం అరిగిపోవాలి.

9. టీ, కాఫీ, అతి భోజనం, అతిగా శ్రమించడం, కోలాహలం నిద్రకు శత్రువులు. వీటిని పరిహరించండి.

10. నిద్ర పట్టకపోతే - పది నిమిషాలపాటు పాదాలు రెండూ వేడినీళ్లలో ఉంచండి. చన్నీళ్లలో తడిసిన సంచీలను తలపై ఉంచండి. కళ్లు కడుక్కుని పడుకుంటే మంచి నిద్రపడుతుంది.

H H H

**ఉజ్వల భవిష్యత్తుకు మంత్రాలు - విజ్ఞత, నిజాయితీ, కర్తవ్య నిష్ఠ, సాహసం.**

# బోధ కథ

# నిజమైన బ్రాహ్మణత్వం

ఆమె సరళ స్వభావం కలిగిన మహిళ. ఆ సరళతలో సాత్వికమైన సమ్మోహన శక్తి ఉంది. ఆమె నవ్వితే మల్లె పువ్వులు విచ్చుకున్నట్లు ఉండేది. ఆ నవ్వు ఇతరుల విషాదాన్ని హరించివేసేది. తెల్లని ఆమె శరీరం ఎప్పుడు శ్రమ బిందువులతో అలంకరించబడి ఉండేది. అనుక్షణం శ్రమిస్తూ ఉండడం ఆమె స్వభావం. కుటుంబ సభ్యులకే కాక, పట్టణ ప్రజలకు కూడ సేవ చేయడం ఆమె జరిపే నిరంతర సాధన. ఆమె అంతఃకరణలో సదా **నమో తస్స భగవతో అరహతో సమ్మాసంబుద్ధస్స** అనే స్తోత్రం నినదిస్తూ ఉండేది. భగవానునికి చేసే ఈ స్తోత్రం ఏదో ఒక సందర్భంలో ఆమె పెదవులనుండి వెలువడేది.

ఆమెలోని ఈ బుద్ధ ప్రేమ పలువురికి ప్రేరణ ఇస్తోంది. ఆమె కుటుంబ సభ్యులు మాత్రం దానిని ఎంతమాత్రం సహించలేకపోతున్నారు. కులట అనీ, కుల కళంకిని అనీ, కులానికి శని అనీ ఆమె భర్త ఆమెను నానామాటలూ అనేవాడు. ఆమెపై తిట్ల వర్షం కురిపించేవాడు. అయినా ఆమె బాధ పడేది కాదు. నవ్వి ఊరుకునేది. ఎందుకంటే, ఆమె అంతఃకరణలో భగవానుని కృపా ప్రసాదం పొంగిపొరలేది. రాజగృహ నగరమంతా ఆమెలోని ఈ సహనశీలతను గురించి చెప్పుకునేది. ఆమె పేరు ధనజాతి. ఇన్ని యాతనలను ఆమె ఎలా భరిస్తోందని జనం విస్తుపోయేవారు. ఆమె ఈ పరిస్థితులకూ, వ్యక్తులకూ, భావాలకూ దూరంగా ఉండేది. ఎందుకంటే, ఆమెకు తన ఆరాధ్యుని కరుణపై పూర్తి నమ్మకం ఉంది. తాను బ్రాహ్మణ కులానికి కళంకమని తనను ఎవరు నిందించినా - తాను నిజమైన బ్రాహ్మణత్వంవైపు పురోగమిస్తున్నానని ఆమెకు తెలుసు.

ఒక రోజున పరిస్థితి మితిమీరిపోయింది. ఆ రోజున వారి ఇంటిలో విందు జరుగుతోంది. ఇంటి పనులలో ఉరుకులూ పరుగులూ పెట్టడంలో ఆమె కాలు జారి క్రిందపడింది. విందుకు బ్రాహ్మణులంతా వచ్చారు. బంధువులంతా వచ్చారు. భర్త ఉన్నాడు. భర్త అన్నదమ్ములందరూ ఉన్నారు. ఈ వాతావరణంలో ఆమె లేవడానికి ప్రయత్నించింది. లేవగానే అలవాటు ప్రకారం '**నమో తస్స భగవతో అరహతో సమ్మాసంబద్ధస్స**' అంటూ బుద్ధ భగవానుణ్ణి స్మరించింది. అందుకు బంధువులంతా మండిపడ్డారు. 'నీవు ఇప్పుడు చెప్పిన మాటకు అర్థం ఏమిటి' - అని ఆమె మరిది ఆమెను వ్యంగంగా ప్రశ్నించాడు. ఆమె సహజ ధోరణిలో ఇలా జవాబు చెప్పింది- 'దీని అర్థం ఇదే : నమస్కారం ఆ భగవానునికి, సమ్యక్ సంబుద్ధి పొందిన అర్హతునికి.'

ఈ మాటలు విన్న ఆమె భర్త దేవాశీషుడు ఆమెపై విరుచుకుపడ్డాడు. 'దుష్టురాలా! ఆ బోడిగుండు శ్రమణుణ్ణి ఎక్కడ పడితే అక్కడ ప్రశంసిస్తావా' - అంటూ ఆమెపై తిట్ల వర్షం కురిపించాడు. ఆతర్వాత తన సోదరులవైపు చూచి ఇలా అన్నాడు- 'వెళ్లండి. మీరు ఇప్పుడే వెళ్లి ఆ గౌతమునితో శాస్త్రార్థం చేయండి. అతడిని ఓడించి తిరిగిరండి.'

తన భర్త చెప్పిన ఈ మాటలకు ఆమె నవ్వుకున్నది. మరోమారు '**నమో తస్స భగవతో అరహతో సమ్మాసంబుద్ధస్స**' అన్నది. తన మరదులతో ఇలా అన్నది - వెళ్లండి. శాస్త్రార్థం చేయండి. ఆ భగవానునితో శాస్త్రార్థం చేసే సామర్థ్యం ఎవరికి ఉంది. అయినా వెళ్లండి. అందువల్ల మీకు ప్రయోజనం కలుగుతుంది.'

ఆ మరదులలో ఒకడు భారద్వాజుడు. అతడు క్రోధంతో, అహంకారంతో, విజయం సాధించాలన్న ఆవేశంతో బుద్ధుని వద్దకు వెళ్లాడు. అతడు తీవ్రంగా జ్వరం వచ్చిన వ్యక్తిలా ఉన్నాడు. అతడి శరీరం, మనస్సు, ప్రాణం, అంతఃకరణం - అన్నీ మండిపోతున్నాయి. ఆ జ్వాలలు ఎగసి పడుతున్నాయి. అయితే - బుద్ధ భగవానుని ప్రశాంతత జడివానలా అతడిపై కురిసింది. ఆయన సన్నిధిలో అతడి క్రోధం చల్లారింది. ఆయన కళ్లు చూచిన తర్వాత, ఆ కళ్లనుండి జాలువారుతూన్న కరుణయొక్క స్పర్శను అనుభూతి పొందిన తర్వాత - ఆ వ్యక్తిలో గెలవాలనే కోరికకు బదులు ఓడిపోవాలనే కోరిక జనించింది. అతడి మనస్సు, ప్రాణమూ అకస్మాత్తుగా రూపాంతరం చెందాయి. బుద్ధత్వం సన్నిధిలో ఉండడంవల్ల కలిగిన ఫలితం అది.

**ఆత్మగౌరవాన్ని అమ్ముకున్నవాడు పశువు కన్న హీనుడు.**

ఆ భారద్వాజుడు కొన్ని ప్రశ్నలు అడిగాడు. అయితే, వివాదంకోసం కాక జిజ్ఞాసతో అడిగాడు. ముముక్షత్వంతో అడిగాడు. వివాదం విషాదాన్ని మాత్రమే సృష్టిస్తుందనీ, నిజమైన జిజ్ఞాస ముముక్షత్వానికి జన్మ ఇస్తుందనీ అతడికి బోధపడింది. ముముక్షత్వం పండితే బుద్ధత్వం వెలికివస్తుంది. అతడి విషయంలో ఇదే జరిగింది. భగవానుని సమాధానాలు అతడికి సంతృప్తి కలిగించాయి. అతడు సమాధి స్థితిలోకి వెళ్లిపోయాడు.

ఆ తర్వాత అతడు ఇంటికి తిరిగివచ్చాడు. అతడు ఇంటికి తిరిగి రావలసిన అవసరం ఏదీ లేదు. అతడు బుద్ధుడే అయిపోయాడు. బుద్ధునిలో తనను తాను కోల్పోయాడు. ఆ రోజునే అతడు పరివ్రాజకుడు అయినాడు. అర్హతుడు అయినాడు.

ఇలాంటి సంఘటనలు బహు అరుదుగా జరుగుతాయి. అతడు అదే రోజున సన్యాసి అయినాడు. అదే రోజున సమాధి స్థితిలోకి వెళ్లాడు. అదే రోజున అతడిలో ముముక్షత్వం మేలుకొన్నది. అదే రోజున అతడికి బుద్ధత్వం సిద్ధించింది. అసాధ్యం సాధ్యపడింది. ఎన్నో జన్మల తర్వాత బుద్ధత్వం లభించినా తొందరగా లభించినట్లే. ఇలా ఒక్క రోజులో అది లభించడం పరమాద్భుతమైన విషయం.

అతడి అన్నగారు దేవాశీషునికి ఈ మార్పు సంతోషం కలిగించకపోగా, క్రోధావేశం కలిగించింది. తన తమ్ముడు సన్యాసి అయినాడని తెలియగానే అతడు బుద్ధ భగవానుణ్ణి నానా తిట్లు తిట్టసాగాడు. బండ బూతులు తిడుతూ అతడు బుద్ధ భగవానుడు మకాం చేసిన వేణవనం చేరాడు. అక్కడ భగవానుడు ఒక రావిచెట్టు నీడన అరుగుమీద కూర్చొని ఉన్నారు. ఆయన ముఖమండలంపై అపారమైన శాంతి విరాజిల్లుతోంది. ఆయన నర నరంనుండి ప్రేమ ధార ప్రవహిస్తోంది. ఆయన విశాల నేత్రాలు కరుణకు కేంద్ర బిందువులుగా వెలిగిపోతున్నాయి. ఆయనను చూడగానే అతడి క్రోధ జ్వాలలు ఆరిపోయాయి. మండే నిప్పు కణాలు నీళ్లలో పడి ఆరిపోయినట్లు.

అక్కడ ఉన్న భిక్షువులు భగవానుడు చేసిన ఈ అద్భుతాన్ని చూచి ఆశ్చర్యచకితులు అయినారు. వారు తమలోతాము ఇలా మాట్లాడుకోసాగారు - 'బుద్ధ గుణంలో ఎంతో అద్భుతం ఉంది. దుష్టుడు, అహంకారి, కోపిష్టి అయిన వ్యక్తి ఇలా శాంతచిత్తుడై సన్యాసం స్వీకరించాడు. అతడు బ్రాహ్మణ ధర్మాన్ని వదులుకున్నాడు.'

ఈ మాటలు విన్న భగవానుడు ఇలా అన్నారు - 'భిక్షువులారా! మీరు పొరపడుతున్నారు. ఆయన బ్రాహ్మణ ధర్మాన్ని వదులుకోలేదు. వాస్తవానికి అతడు ఇంతకు ముందు బ్రాహ్మణుడు కాడు. ఇప్పుడు బ్రాహ్మణుడు అయినాడు'. అప్పుడు బుద్ధుడు ఈ ధర్మవాక్యం చెప్పారు -

**ఛేత్వా నంధిం వరత్తం చ సందానం సహనుక్కమం ।**
**ఉక్ఖిత్ పలిఘం బుద్ధం తరహం బ్రూమి బ్రాహ్మణం ॥**
**అక్కోసం వదవంధ్యంచ అదుట్ఠో యో తితిక్ఖతి ।**
**ఖంతీబలం బలానీకం తమహం బ్రూమి బ్రాహ్మణం ॥**

అనగా -

నద్ధా, రస్సీ, సాంకల్, ఖూంట్‌లను పెల్లగించి పారవేసిన బుద్ధ పురుషుడిని నేను బ్రాహ్మణుడని పిలుస్తాను.

తిట్లను, వధను, బంధనాన్ని మనసు వికలం కాకుండా సహించే వ్యక్తిని, తన బలానికి సేనాపతిగా క్షమాబలాన్ని నియమించిన వ్యక్తిని నేను బ్రాహ్మణుడని పిలుస్తాను.

భగవానుడు చెప్పిన ఈ వచనాన్ని అక్కడ ఉన్న భిక్షువులతోపాటు దేవాశీషుడు, అతడి తమ్ముడు కూడ వింటున్నారు. ఈ వచనాల అర్థాన్ని మరింతగా స్పష్టంగా తెలుసుకోవాలనే ఉత్సుకత వారి కళ్లలో కనిపించింది బుద్ధ భగవానునికి. భక్తులలోని ఈ జిజ్ఞాసను పూర్తి చేస్తూ వారిలా అన్నారు -

'భిక్షువులారా! నద్ధా అంటే క్రోధం. సాంకల్ అంటే మోహం. రస్సీ అంటే లోభం. ఖూంటా అంటే కామం. ఈ నాలుగింటినీ త్రెంచివేసినవాడే, పవిత్రమూ క్షమాశీలమూ అయిన అంతఃకరణ కలిగినవాడే బ్రాహ్మణుడు.'

తన భర్త, మరది ఇలా రూపాంతరంపొంది, అపురూపమైన బ్రాహ్మణత్వాన్ని సాధించిన కథను ధనజాతి కూడ విన్నది. అంతా విని ఆమె ప్రభువు మహిమకు తలవంచి, '**నమో తస్స భగవతో అరహతో సమ్మాసంబుద్ధస్స**' అన్నది.

M M M

**ఆలోచన ఉత్కృష్టంగా ఉంటే మెరుస్తుంది శీలం.**

## సాధు సంత్‌ల జీవితాలు

# అద్భుతాలు చూపిన అవధూత - చివటం అమ్మ

ప్రకృతిలో స్త్రీ పురుష వివక్ష లౌకిక ప్రపంచానికి మాత్రమే. నిరాకార, నిర్గుణ పరబ్రహ్మతత్త్వం అవతరించడం కొరకు ఏ శరీరాన్నైనా (ఉపాధి) ఆశ్రయిస్తుంది. దశావతారాలు ఈ పరిధిలోకే వస్తాయి. ఆత్మ సాక్షాత్కారం పొందిన మహనీయులకు స్త్రీ పురుష భేదం లేదు. ప్రకృతి అంతా స్త్రీత్వమే. పురుషోత్తముడైన పరమాత్మ ఒక్కడే పురుషుడు. భగవదన్వేషణలో ఆ అంశను పొందిన వారికి దేహభ్రాంతి, భౌతిక ప్రపంచంతో సంబంధం ఉండవు. ఇంద్రియవశులైనవారికే అహంకార మమకారములు. జితేంద్రియత్వం సిద్ధించినవారికి ఆహార విహారాదులు, నాగరికతా లక్షణాలు అవరోధాలు కావు. లౌకికదృష్టికి వీరు మాట్లాడే మాటలు, చేసే చేష్టలు, వీరి ఉనికి బాలోన్మత్త పిశాచాలవలె అగుపిస్తాయి. జనన మరణాల కతీతమైన స్థితిని పొందటం, ఇహలోకానికి సంబంధించినవన్నీ వదులుకోవటం, తత్ త్వమ్ అసి అన్నదానికి లక్ష్యమవటం అవధూత లక్షణం. అవధూతలు తాము తరించి ఇతరులను తరింపజేస్తారు.

ఇటువంటి లక్షణాలు కలిగిన వ్యక్తి - పశ్చిమ గోదావరి జిల్లాలోని కుగ్రామం రేలంగిలో జన్మించిన అచ్చమ్మ. మాయిష్టి భద్రయ్య రెండవ భార్య కుమార్తె అచ్చమ్మ. అచ్చమ్మ భర్త గరగ అంజయ్య. వీరి ఏకైక సంతానం సూరయ్య. వ్యాపారార్థం చివటం వచ్చి చేరింది అంజయ్య కుటుంబం. చిన్నతనం నుండి దైవభక్తి గల అచ్చమ్మ చివటంలో భజనలకు హాజరవుతూ, తమ యింట్లో భజనలు చేస్తూ ఉండేది. నిరంతరం ఆమె జపించేది రామనామం. ఇటువంటి ధోరణికి భర్త సహకారం లేక అచ్చమ్మ అనేక కష్టనష్టాల కోర్చుకుంటూ జీవనం సాగించింది.

ఏ ధర్మాన్ని అనుష్ఠించడానికి యోగులు జన్మిస్తారో ఆ సమయం ఆసన్నమవగానే వారి జీవన క్రమంలో మార్పురావడం సహజం.

ఒకనాడు భర్తను కొడుకును వదలి, ఎక్కడో భజనలు చేసే ఒక భక్తుని ఇంట ప్రవేశించింది అచ్చమ్మ. తిరిగి ఆమెను ఇల్లు చేర్చే ప్రయత్నం జరిగినా - పుట్టిన ఊరు రేలంగి, భృతి కోసం సంసారం ఏర్పరచుకొన్న చివటం, చిన్నాయగూడెం, జగన్నాథపురం, మన్నెం, రాజమండ్రి స్త్రీల మఠం, సిద్ధాపురం ఇంకా అడవులు శ్మశానాలు తిరుగుతూ మళ్ళీ చివటంలోని కుటీరంలో చేరింది. భర్త మరణించినా కొడుకు దూరమైనా ఆమెలో మార్పు లేదు. కొడుకు వివాహానికి సైతం వెళ్ళలేదు. కొంతకాలం కాషాయవస్త్రం ధరించిన అచ్చమ్మ ఒంటిపై మాటిమాటికీ జారిపోయే చీరను అట్లాగే తీసి తనముందు నడుస్తున్న పిల్లవాడిపై వేసి దిగంబరంగా ఉండిపోయింది. అమ్మ ఇట్లా మారిపోవటానికి మరొక కథ కూడా ప్రచారంలో ఉంది.

పాలకొల్లు లక్ష్మిపాలెంలో సాధురాం బాబాజీ పౌరాణిక ఉపన్యాసాలు చెప్పేవారు. ఒకనాడు ఉపన్యాసంలో అవధూత లక్షణాలు చెబుతున్న బాబాజీని మరొకసారి వివరించమని అమ్మ కోరిందట. కోరిక విన్న బాబాజీ అట్లాగే ఆచరించగలవా అని ప్రశ్నించారట. వెంటనే అమ్మ తన వస్త్రాన్ని విప్పి ఆయనపైకి విసిరిందట. ఆయన తనపై కండువా తీసి అమ్మపై విసరి - ముండనం చేయించుకొని ముండలాగా ఉండమని అన్నారట. బాబాజీని గురువుగా భావించిన అమ్మ ఆ కండువా ధరించి అది చిరిగిపోయాక దిగంబరంగానే ఉండ నారంభించారట.

చివటంలో అమ్మ భిక్షకు వెళితే పురుషులు వినమ్రంగా ప్రక్కకు తప్పుకునేవారు. ఊరివారెప్పుడూ అమ్మ ఆ విధంగా ఉన్నందుకు తప్పుపట్టలేదు. సంసారాన్నీ, దేహభ్రాంతినీ వదలిన అమ్మ జీవితంలో అద్భుత సంఘటనలెన్నో ఉన్నవి. తనను గౌరవించినా, వెక్కిరించినా, అగౌరవపరచినా, రాళ్ళతో కొట్టి హింసించినా అందరిపైనా ప్రేమ దృక్కులనే ప్రసరింపజేసింది. మానావమానాల కతీతమై స్థిత ప్రజ్ఞత్వాన్ని ప్రదర్శించింది. ఎన్నో ఏండ్లు మౌనవ్రతం కూడా సాగించింది.

**విజ్ఞానం బాహ్య ప్రగతి. జ్ఞానం ఆంతరిక అనుభూతి.**

అమ్మ ప్రయాణాన్ని నిరోధించాలని తల్లి దండ్రులు గదిలో బంధిస్తే - ఎక్కడికి వెళ్ళాలనుకుందో అక్కడ ప్రత్యక్షమయ్యేది. శ్మశానంలో ఎందుకు తిరుగుతావని అడిగితే - చావు రాకుండా ఉండటానికనేది. జమ్మిచెట్టు కిందే ఎందుకు కూర్చున్నావంటే - కాయలు కాయని చెట్టుకింద కూర్చోవాలనేది. జన్మ రాహిత్యానికి సంబంధించిన ఆధ్యాత్మిక దృష్టి ఉంటే తప్ప అమ్మ మాటలకు అర్థం తెలియదు. ధ్యానం చేసేవారికి ఆహార నియమాల గురించి, బ్రహ్మచర్యం గురించీ నియమాలు తెలియజేసేది అమ్మ. మనిషిలో ఇద్దరు దొంగలున్నారని - ఒకటి నిద్ర, రెండోది తిండి అని. పగలు తిండి రాత్రి నిద్ర ఇక దైవాన్నెప్పుడు చూస్తాడని అమ్మ భావం. ఒక భక్తుడికి కురుమద్దాలి మాల పిచ్చమ్మ ధ్యానం చేసుకునే స్థలంలోని మట్టిని, తన కుటీరంలోని మట్టిని కలిపి అరుగు కట్టి ధ్యానం చేసుకొమ్మని చెప్పింది. అన్నింటినీ మృత్యువు తింటే, మృత్యువును రామనామం తింటుందని బోధించింది. ఎప్పుడూ సద్గ్రంథాలను గట్టిగా చదివించేది. అంత పెద్దగా ఎందుకు చదవాలంటే హృదయానికి వినబడాలనేది. కంఠం నుండి వెలువడే ధ్వని బాహ్య ప్రపంచంలోని ధ్వనులను దరికి చేరనీయ కుండాలని అమ్మ బోధించే అర్థం. అప్పుడే సరైన సాధనా క్రమం అలవడుతుంది. భాగవతంలోని పద్యాలను చదివించుకునేది. చదివేవారు మధ్యలో మరిచిపోతే ఆయా భాగాలను అందించేది. సుందరకాండ చదివే ఒక భక్తురాలితో - ఓర్పు గలిగిన ఆంజనేయుడు కార్యసాధకుడైనాడు. లేకపోతే రాముడికీ, సుగ్రీవుడికీ మాట వచ్చేది. ఓర్పే దేముడు అని చెప్పింది.

ఈ మాటలు షిర్డీబాబా చెప్పిన శ్రద్ధా, సబూరీలను స్మరింపచేస్తాయి. అమ్మ జీవితంలోని కొన్ని విచిత్రాలను గమనిద్దాం. బురదనీటిలో స్నానం చేయటం, ఆ నీరే త్రాగటం, మలమూత్ర విసర్జన పట్ల కూడా ధ్యాస లేకపోవడం, భక్తులను తరింపచేయడానికి మాత్రమే అప్పుడప్పుడు ఆహారం తీసుకోవడం, భక్తులిచ్చిన చుట్టలు కాల్చడం, కొన్ని సందర్భాలలో తనను మోసే భక్తులకు మల్లెపువ్వంత బరువే కావటం, ధ్యానంలో ఉన్న అమ్మను సిగరెట్లతో కాలిస్తే చలనం లేకపోగా కాలిన మరక కూడా శరీరంపై లేకపోవడం, ప్రయాణం వద్దని అమ్మ చెబితే వినక బయలుదేరిన ఒకరు, దారిలో మొరాయించిన కారు నడవడానికి రోడ్డు ప్రక్కనున్న కరెంటు స్థంభాన్ని కొడితే అక్కడ కుటీరంలోని అమ్మ శరీరంపై వాత తేలటం, ఖాళీ భిక్షా పాత్ర నుండి వేడి అన్నాన్ని భక్తులకు పెట్టటం, రామనామంతో సర్వరోగాలు నయం చేయటం, షిర్డిబాబా చరిత్రలోవలె సమయానుకూలంగా వర్షాన్ని కురిపించడం, కొందరు భక్తులను అమ్మ సాయిబాబా చరిత్ర పారాయణ చేయమనటం, ఎంతోమంది మహనీయులు అమ్మను దర్శించటం - ఇవన్నీ అవధూతల జీవితాలలో సాధారణంగా జరిగే అద్భుతాలే.

సమాధి చెందే ముందు తన భక్తులకు సందేశాన్నిచ్చింది అమ్మ. పోట్లాటలో ఒకటికి రెండు మారుమాటలాడరాదనీ, ఏడవకుండా దృఢంగా ఉండాలనీ, ఇంటికి వచ్చిన వారిని ఆదరించి అన్నం పెట్టాలనీ చెప్పింది. ఇంతకంటే మానవతా విలువలు ఏ మాటల్లో దొరుకుతాయి?

1981 జూన్‌లో అమ్మ అస్వస్థురాలైంది. వారం రోజులు వైద్యం చేయించుకున్న అమ్మ తనకు డాక్టరు అవసరం లేదన్నది. అమ్మ సమాధి చెందుతారేమో అని బాధపడుతున్న భక్తురాండ్రను కంటనీరు పెట్టరాదనీ, ఇన్నాళ్ళు విన్న ఉపదేశాల ఫలితమిదేనా అంటూ మందలించింది. శరీరాన్ని వదలి పెడుతున్నానని చెబుతూ గీతా పఠనం వింటూ కపాలాన్ని ఛేదించుకొని ప్రాణోత్క్రమణం చేసింది అమ్మ(8-6-1981 మధ్యరాత్రి). కంటికి కనిపించే భౌతిక రూపం సమాధినిష్ఠమైంది. మనోనేత్రంతో దర్శించే భక్తులకు అనుక్షణం అనుభూతిని ప్రసాదిస్తూనే ఉంది.

అమ్మ నివసించింది పూరిపాకలో, ఉపయోగించిన వస్తువులన్నీ పేదరికాన్ని చాటేవే. భక్తులు ఆశ్రమం కట్టిస్తామన్నా పది పూళ్లు తుడిచిపెట్టి కట్టించే ఆశ్రమం వద్దని - చిన్న కుటీరాన్ని నివాసం చేసుకున్నది. శరీరానికి అచ్ఛాదన సైతం లేక ఎండకు ఎండి, వానకు తడిసి, మానావమానాలు లెక్కచేయక జీవించి, మరణించి కూడా జీవించే ఉన్నానంటూ భక్తుల హృదయాలలో తన ఉనికిని చాటుకున్నది. జీవితానికి అర్థం తెలిపే సందేశాలను తన జీవితం ద్వారా సమాజానికి అందించింది అమ్మ.

- డాక్టర్ బి.రుక్మిణి

**మదిర, మాంసం, తామసిక భోజనం తన మన జీవనాలకు మహా ప్రమాదాలు.**

వ్యక్తి నిర్మాణం

# సార్థక సంభాషణ సరస్వతీ సాధన

## శరీరంపై భావనల ప్రభావం

మనోభావాలు శరీరం మొత్తాన్ని ప్రభావితం చేస్తాయి. క్రోధం, ఆవేశం, భయం, శోకం, వియోగం లాంటివి ఉత్పన్నమైనపుడు కళ్లు, చెంపలు, నుదురు చెప్పకుండానే మానసిక స్థితిని తెలియజేస్తాయి. లోపల ఉత్పన్నమయ్యే భావనల ఛాయ మొహంలో కనబడుతుంది. కోపంలో కళ్లు ఎర్రబడతాయి. శరీరం కంపిస్తుంది. ఆకలి, నిద్ర దూరమవుతాయి. ఆంతరిక భావనలు శరీరం మీద పడతాయని ఇది స్పష్టం చేస్తుంది. ఆవేశపరుల గుండెలు వేగంగా కొట్టుకుంటాయి. శ్వాస వేగం పెరుగుతుంది. తల తిరుగుతుంది. గొంతు ఎండిపోతుంది. తరచు దాహం వేస్తుంది. మనస్సు ప్రభావం శరీరం మీద పడుతుందనడానికి ఇదే నిదర్శనం. ఈ ప్రభావాన్ని సూక్ష్మరూపంలో చూడాలనుకుంటే, వాక్కులోని రహస్యమయ కంపనాల ద్వారా సునాయాసంగా చూసి తెలుసుకోవచ్చు.

మోసగాళ్లు, ధూర్తులు తీయని మాటలతో ప్రలోభపెట్టి అమాయకులను మోసం చేస్తూ ఉంటారు. ప్రలోభంతో వెనుకా ముందు ఆలోచించకుండా, యథార్థాన్ని విశ్లేషించకుండా కేవలం మాటల అర్థంతోనే ముందుకు సాగే అస్తవ్యస్త మానసిక స్థితిగలవారే ఈ మాయలో పడుతుంటారు. పిల్లల మనస్తత్వం గలవారే మోసాలకు గురవుతూ ఉంటారు. కొంతైనా తర్కం, యథార్థాన్ని శోధించడం ఎక్కడ ఉంటుందో అక్కడ వాస్తవిక స్థితి తెలుస్తుంది. అపుడు మోసం నుండి బయటపడవచ్చు. ఇది వ్యావహారిక జ్ఞానం. సూక్ష్మబుద్ధి వికసిస్తే, చురుకైన ఆత్మచేతనను గీటురాయిగా భావించి ముందుకు సాగే శక్తి వికసిస్తే - ఎవరి వాణివైనా విని దానిలోని ప్రభావాన్ని, వ్యక్తిత్వాన్ని సునాయాసంగా అర్థం చేసుకోవచ్చు.

వాక్కు ద్వారా తెలిసేదే ఇచ్చిపుచ్చుకోవడం కాదు. వ్యక్తిత్వ లక్షణాలు కూడా పరస్పరం పరివర్తన చెందుతాయి. సద్భావనాసంపన్నులైన వ్యక్తులు బాగా ఉపన్యాసం ఇవ్వకపోయినా - వారి మామూలు మాటలలో కూడా తీయదనం, సృజనాత్మకత, సదుద్దేశ్యం కలగలసి ఉంటాయి. ఎదుటి వారి హృదయాలను వారు స్పృశిస్తారు. ఉద్వేగ పరిస్థితులలో భారీ సహాయ సహకారాలు పొందుతారు. ఉన్నతులైన వ్యక్తులు మాటలతోనే తమ తోటివారిని ప్రభావితం చేస్తారు. వారి నేత్ర జ్యోతులు, ముఖ కవళికలు, సమస్త శరీరం నుండి బయల్పడే తేజో వలయ శక్తి తమ పనిని తాము నిర్వర్తిస్తాయి. సంబంధిత వాతావరణాన్ని ప్రభావితం చేస్తాయి.

## బ్రహ్మాండంలో భావనల వ్యాప్తి

ఈ ప్రభావం ఎక్కువగా వాక్కు ద్వారా జరుగుతుంది. సద్భావనలు నిండిన వ్యక్తుల వాక్కు ఎవరికి నిర్దేశించబడిందో వారినే కాక విరాట్ బ్రహ్మాండంలో వ్యాపించిన జడ చేతనలను కూడా ప్రభావితం చేస్తుంది. ఈ దృష్టితో గంభీరంగా ఆలోచిస్తే - ప్రత్యక్షంగా ఎక్కువగా పని చేస్తున్నట్లు కనబడని వ్యక్తులు కూడా ప్రపంచంలోని వ్యాపక క్షేత్రాన్ని ప్రభావితం చేయగలరని తెలుస్తుంది. సద్భావనా సంపన్నులైతే, వారు వాక్కుతోనే ప్రపంచానికి గొప్పసేవ చేసినవారవుతారు. మరోప్రక్క దుర్భావనలు కలవారు తమ వాగ్బాణాలతో ఇతరులను హింసిస్తారు. ప్రపంచానికి హాని కలిగిస్తారు. నీటిలో విసిరివేసిన రాయి వేలాది అలలను ఉత్పన్నం చేస్తుంది. ఇదే విధంగా అంతరిక్షంలో ప్రవహించే వ్యక్తిత్వం

ప్రసన్నతను మించిన టానిక్ లేదు.

తన సుగంధాన్ని, దుర్గంధాన్ని వాతావరణంలోకి వ్యాపింపజేస్తుంది.

కటువైన, కర్కశమైన మాటలు ముందుగా వక్తకే చేటు తెస్తాయి. ఉగ్ర మనఃస్థితి శరీరం మొత్తాన్ని తొట్రుపాటుకు గురి చేస్తుంది. వాణి నుండి ఆ భూకంపం విస్ఫోటనంలా బయటకు వచ్చినపుడు దానితో బయటి క్షేత్రం దద్దరిల్లడమే కాక విస్ఫోట క్షేత్రం కూడా బాగా దెబ్బ తింటుంది. క్రోధులు, ఈర్ష్యాళువులు, నిందలు వేసేవారు. రంధ్రాన్వేషకులు, నిరాశాపరులు, పలాయనవాదులు ఇతరులకు చెడు చేస్తారు; ఉద్విగ్నతకు గురి చేస్తారు. అయితే అందరికంటే ముందు వారే హానికి గురవుతారు. దుర్భావనలు గలవారు కాస్త వెనుకా-ముందుగా శారీరక, మానసిక రోగాల బారిన పడవలసివస్తుంది. తమకు, తమతోటి వారికి వారు శాపంగా పరిణమిస్తారు.

## వాక్కును సంస్కరించుకో

వెనుకబడిన వర్గాల వారు తమ లోపాలలో అశుభ్రత, అపవిత్రత, వ్యసనాలు ముఖ్యమైనవిగా గుర్తిస్తారు. కాని లోతుగా ఆలోచిస్తే - జగడాలు, తిట్లు, నిందలు, అసభ్య, అస్తవ్యస్త మాటలు కూడా వారిని హీన స్థితిలో ఉంచడానికి బాధ్యత వహిస్తాయని గోచరిస్తుంది. కుటుంబంలోని ఇలాంటి సంభాషణలు పిల్లల మీద అసాధారణ ప్రభావాన్ని చూపుతాయి. ఆ కుటుంబాలలోని అన్ని తరాల వారు ఆ స్థాయిలోనే ఉంటారు.

కనుకనే- దూరదృష్టి గలవారు వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకోడానికి ముందుగా వాక్కును సంస్కరించుకోమని చెబుతారు. సభ్యత, సంస్కృతుల ప్రథమ సోపానం సభ్యత, సౌమ్యత, సమతుల్యత, సద్భావనలతో నిండిన వాణి ఉచ్చారణతోనే ప్రారంభమవుతుంది. అసంబద్ధమైన, సంయమనం లేని మాటలు మాట్లాడే వారు ఎప్పుడూ గౌరవనీయులు కాజాలరు. వారు తుచ్ఛులుగాను, వెనుకబడిన వారుగాను, బాధ్యతారహితులుగాను గుర్తింపబడతారు.

మానసిక ఆకర్షణ శక్తి వాక్కు ద్వారా బయటి క్షేత్రాన్ని ప్రభావితం చేస్తుంది. తన స్థాయి వ్యక్తిత్వాన్ని, వాతావరణాన్ని సమీకరించి పరిసర ప్రాంతాలలో వ్యాపింపజేస్తుంది. చెడు సంభాషణలు చేసేవారి ఆంతరిక దక్షత ఎప్పుడూ వారిని సరసోల్లాసాలతో నిండిన జీవన ఆనందాన్ని ఆస్వాదించనివ్వదు. దుర్భావనల ప్రతిక్రియ విరోధం, కలహాలు, నిందలు, సహాయనిరాకరణ, అవిశ్వాసముల రూపంలో బయటపడుతుంది. వాటి కారణంగా- ప్రగతిపథంలో అడుగడుగునా అవరోధాలు ఎదురవుతాయి.

## వాణిలో తీయదనం

ఉపనిషత్తుల ఋషి పరబ్రహ్మ ఎదుట తన మహత్తర ఆకాంక్షను వ్యక్తీకరిస్తూ ఇలా చెప్పారు-''జిహ్వా సే మధుమత్తమా.'' అనగా - నా వాణి తీయదనంతో నిండి ఉండుగాక. నిజంగా ఎవరైనా మధుర వచనాలు చెప్పే అభ్యాసం చేస్తే, వారికి ప్రగతిపథంలో అనేక అవరోధాలు సహజంగానే తొలగిపోతాయి. ప్రశంసాపూర్వకమైన, ఉత్సాహపూరితమైన మాటలతో ఎవరినైనా నవజీవనం వైపు ప్రేరేపిస్తే - అది నిస్సందేహంగా ధన సహాయం కంటే అత్యంత విలువైన సహాయంగా పరిణమిస్తుంది. పోగొట్టుకున్న ఆత్మ విశ్వాసాన్ని తిరిగి పాదుకొల్పితే-దానికి మించిన ప్రయోజనం మరొకటి లేదు. సద్భావనలు గల వ్యక్తులు తమ స్థాయికి అనుగుణంగా ఇలాంటి సలహాలే ఇస్తారు. వాటిని ఏ మాత్రం ఆత్మావలోకనం చేసుకున్నా, అభివృద్ధి దిశలో వేగంగా ముందుకు సాగవచ్చు.

ఋగ్వేదంలో ఒక ఆర్షవచనం ఉంది-ఎక్కడ ఆచితూచి మాటలు ఎన్నుకొని మాట్లాడుతారో అక్కడ అభ్యుదయం పరిగెత్తుకుంటూ వస్తుంది. ఎక్కడ తేనె ఉంటే అక్కడకు

**నవ్వు జీవన సౌరభం.**

తేనెటీగలు బలవంతంగా ఆకర్షింపబడతాయి. వాక్కు ప్రభావం ఉచ్చారణకర్తల విజయాలను ప్రోది చేసేదిగా ఉండాలి. ఆచితూచి మాట్లాడడం అంటే - ఆలోచించి, అర్థం చేసుకొని, ప్రభావ, పరిణామాలను దృష్టిలో పెట్టుకొని వివేకంతో, సదుద్దేశ్యంతో మాట్లాడడం. నిజానికి ఇలా మాట్లాడడమే సార్థకం. కటువైన, ద్వేషంతో కూడిన భాషణల సమయంలో మౌనంగా, మూగగా ఉండడం అత్యుత్తమం.

భగవంతుడు చెవులు రెండు ఇచ్చాడు. కాని నాలుక ఒకటే. దీని అర్థం-ఎక్కువ వినాలి, తక్కువ మాట్లాడాలి. భావార్థం ఏమిటంటే - చింతన, మననం, స్వాధ్యాయ, సత్సంగాలు ఆధారంగా సద్భావనలను సముచితంగా సంగ్రహించి వాటిలో ఉత్తమమైన సారంగల వాటినే నాలుక మీదకు తేవాలి. నాలుకలో అమృతమూ ఉంది. విషమూ ఉంది. విషాన్ని తాగేవారి నోరే వారిని నాశనం చేస్తుంది. దుర్భావగ్రస్తులు, సంస్కార హీనుల వాణిని కూడా విషంగానే చెప్పాలి. అది మొదటి అనర్థాన్ని వక్తకే కలిగిస్తుంది. అతడి గౌరవాన్ని హరించివేస్తుంది. కాని అమృత వచనాలు చెప్పడం వలన వక్త తనకు తానే ఉల్లాసాన్ని పొందుతాడు. తోటివారు కూడా ఆ రసాస్వాదనలో తృప్తి చెందుతారు. వివేకం, సత్యం, దూరదృష్టి, సదుద్దేశ్యాలు కలగలిసిన పదాలను సరస్వతి అన్నారు. నాలుక మీద సరస్వతి నాట్యం చేస్తుంది అంటే - వాక్కులోని తీయదనమే మంచితనాన్ని పరిచయం చేస్తుంది అని అర్థం.

## ఆచార్య వినోబా చేసిన జపం

పని పాటలకు సంబంధించిన మాటలు మినహాయిస్తే- భావాలను ఉత్తేజపరచి, ఆలోచనలను సంస్కరించే దృష్టితో చేసే సంభాషణలన్నీ ఒక విధమైన జపమే. జప ఉద్దేశ్యం - ఏవో కొన్ని పదాలను పదేపదే ఉచ్చరించి, ఫలితంగా ఆ మంత్ర భావార్థాన్ని హృదయంగమం చేసుకొని, పరిపక్వం చేసుకోవడం. ధర్మ గ్రంథాలలోని పాఠాలు, భక్తిగీతాల ఆలాపన ఈ దృష్టితో చేసేవే. ఇది ఆయా సమయాలలో ఉపన్యాసాలు, ప్రవచనాలు, సత్సంగాల ద్వారా కూడా సాధించవచ్చు. తమ, ఇతరుల సద్భావనలను మేలుకొల్పే, సత్ప్రవృత్తులను వికసింపజేసే మాటలు చెప్పే వ్యక్తులు మౌనసాధన, జప, ఉపాసనల ఫలితాన్ని పొందుతారు. అలాంటి వచనాలు చెప్పేవారికి కూడా మంచిని చేస్తాయి. ఇలాంటి వారి వలన లోకకళ్యాణం జరుగుతుంది.

ఆచార్య వినోబా పండరీపురం సర్వోదయ సమ్మేళనంలోని ఒక ప్రవచనంలో వాణి ఉపాసన గురించి ప్రసంగిస్తూ ఇలా చెప్పారు- "నేను చెప్పేది జపం కోసమే. ప్రచారం కోసం కాదు. ఏ ఆలోచనలు చెబుతానో అవన్నీ దృఢంగా తయారవుతాయి. ఏది చేసినా అది మీరే చేశారు. నేను మాత్రం జపం చేశాను. భూదాన జపం చేశాను. భూదానం లభించింది. సంపదదాన జపం చేశాను. సంపద దానం లభించింది. నేను యజ్ఞమూ చేయను. దానమూ చేయను. తపస్సూ చేయను. కేవలం జపమే చేస్తాను. ఆ జపంతోనే నా పనులన్నీ నెరవేరుతాయి."

## సరస్వతిని ఉపాసించు

శతపథ బ్రాహ్మణంలో ఒక కథనం: సమాజంలోని వికారాన్ని, మాలిన్యాన్ని కడిగివేసే పదాల ప్రవాహాలే సరస్వతి మంత్రం. సరస్వతి అనుగ్రహంతో అనేక సిద్ధులు లభిస్తాయి. అష్టసిద్ధులు, నవనిధుల అధిష్ఠాన దేవత అయిన సరస్వతి ఉపాసనాత్మక కర్మకాండకు ఎంతో మహత్తు ఉన్నది. అయితే సత్ప్రయోజనం కోసం సద్భావనలు, వివేకం, మధురత నిండిన పదాల ఉచ్చారణే సర్వజనీన సారస్వత మంత్రం. ఇలాంటి భాషణ కొద్ది పదాలతో ఉన్నా - అది అందరి కళ్యాణం కోసం శ్రేయస్కరమైన ప్రతిఫలాన్ని ఉత్పన్నం చేస్తుంది.

- అనువాదం ; డి.వి.ఆర్.మూర్తి.

**దేవుణ్ణి కలియడానికి అతి సమీప స్థలం అంతఃకరణ.**

సమాజ నిర్మాణం

# సమాజసేవకు సాధనం జ్ఞానదానం

## సత్‌ప్రవృత్తుల నుండి సత్కార్యాలు

పరమార్థ పరాయణత్వంతో జీవించాలంటే దాని పేరుమీద ఏమీ చేయవలసిన అవసరం లేదు. దాని కోసం మనం ఉపయోగించే శక్తి అన్ని విధాలా సార్థకమయ్యే పనులే చేయాలి. మనలోనే కాక సమాజంలో సత్ప్రవృత్తులను స్థాపించడం, పెంచడం అన్నిటికంటే ఉపయోగకరమైనది. ప్రపంచంలో జరిగే సత్కార్యాల వెనుక సత్ప్రవృత్తులే పని చేస్తూ ఉంటాయి. పచ్చని పైరుతో పంటపొలాలు నిండుతాయి. విత్తనాల అస్తిత్వం ఉంటేనే. విత్తనం లేకుండా మొక్క మొలవదు కదా? మంచి కార్యమైనా, చెడు కార్యమైనా సునాయాసంగా తలెత్తదు. వాటి మూలంలో మంచి లేదా చెడు ఆలోచనల బీజం ఉంటుంది. కాలానుగుణంగా బీజం అంకురించి ఏ విధంగా వికసించి ఫలాన్నిస్తుందో, అదే విధంగా సత్ప్రవృత్తులు అనేక రకాల పుణ్య-పరమార్థాల రూపంలో వికసిస్తాయి. ఏ శుష్క హృదయంలో మంచి భావనలు, మంచి ఆలోచనలకు స్థానం ఉండదో, దాని వలన జీవితంలో ఏ శ్రేష్ఠ కార్యాలైనా జరగడం దాదాపు అసంభవమనే చెప్పాలి. ఏవైనా మంచి పనులు చేసి ఆదర్శాలను అనుకరించే ప్రతి ఒక్కరికీ తమ పాశవిక ప్రవృత్తులను నియంత్రించ గలిగే మంచి ఆలోచనల ప్రయోజనం తప్పక లభిస్తుంది. దుర్బుద్ధిగ్రస్తులైన వారు మంచి ఆలోచనల అవసరాన్ని, ప్రయోజనాన్ని తెలుసుకోలేకపోవడం వలన, వాటిని వ్యర్థంగా భావించి దూరంగా ఉండడం వలన అసహ్యకరమైన స్థితిలో పడి ఉంటారు. స్వాభావికంగా మనిషి ఒక రకమైన కురూపియైన నల్లటి ఇనుపముక్క లాంటివాడు. మంచి ఆలోచనల పరుసవేది తాకితేనే బంగారంగా మారుతాడు. ఒక తుచ్ఛమైన ప్రాణికి మానవత్వపు గొప్పదనాన్ని, గౌరవాన్ని ఇవ్వగలిగే శక్తి కేవలం మంచి ఆలోచనలకు మాత్రమే ఉంది. ఈ సౌభాగ్యం లభించని దీనులు తమ జీవన లక్ష్యాన్ని ఎలా అర్థం చేసుకోగలరు? అందుకోసం ఏదైనా ప్రయత్నం, శ్రమ ఎలా చేయగలరు?

ఈ సృష్టిలో అనేక ఉపయోగకరమైన పరమార్థ కార్యాలున్నాయి. అవన్నీ శరీరాల లాంటివి. వాటి ఆత్మలోపల సద్భావనలు నిండి ఉంటాయి. సద్భావనలతో నిండిన సత్కార్యాలు కూడా నేడు కేవలం ఆడంబరాలుగా మాత్రమే తయారవుతున్నాయి. అనేక సంస్థలు ఈనాడు పరమార్థాన్ని ఆడంబరం చేస్తూ సింహపు తోలును కప్పుకు తిరిగే నక్కను తలపింపజేస్తున్నాయి. వాటివలన ఎవరికీ ఎటువంటి ప్రయోజనమూ ఉండదు. కపటం పెరుగుతుంది. పడిన శ్రమను కూడా ప్రజలు సందేహంగా, అనుమానంగా చూడడం ప్రారంభిస్తారు. ప్రాణం లేని శరీరానికి ఎంత అందమైన వస్త్రాలు ధరింపజేసినా, దానిని ఎవరూ హర్షించరు. దాని వలన ఎవరికీ మంచి జరుగదు. ఇదే విధంగా సద్భావనలు లేని లోకహిత, జనసేవా ప్రయత్నాలు మంచిని ఇవ్వకపోగా చెడును ఉత్పన్నం చేస్తాయి.

తమ ఆచరణల ద్వారా మనసా, వాచా, కర్మణా చెడును వ్యాపింపజేసేవారు అధికంగా ఉండడం వల్లనే ఈనాడు ప్రపంచమంతటా చెడే వ్యాపించి ఉంది. మంచిని ప్రచారం చేసేవారిలో శ్రద్ధ లేదు. వాగాడంబరులుగానే వారు కనబడుతున్నారు. ఫలితంగా చెడులా మంచి వ్యాపించడం లేదు. అవి పుస్తకాలలో ఉండే సూక్తుల లాగే కేవలం చెప్పడానికి, వినడానికి మాత్రమే పనికి వస్తాయి. ప్రజలు కథలను, వార్తలను, వ్యవహారాలను చెప్పడం, వినడంగానే గుర్తిస్తున్నారు. దీనితోనే పుణ్యం వస్తుందనే అపోహలో ఉన్నారు.

**ఆత్మచింతన, ఆత్మ సంస్కరణ ముక్తికి మార్గాలు.**

## సమస్యలకు మూల కారణం దుర్బుద్ధి

సత్ప్రవృత్తులను మనిషి హృదయంలో ప్రవేశపెట్టడానికి మించిన గొప్ప కార్యం మరొకటి లేదు. వస్తువుల సహకారం అవసరమైన సేవలను ఆర్థికంగా సంపన్నులైనవారు తప్ప ఇతరులు చేయలేరు. ప్రతి మనిషీ తన స్వశక్తితో, వివేకంతోనే తన సమస్యలను అధిగమించగలడు. ఇతరుల మీద ఆధారపడి జీవించడం ఏ ఒక్కరికీ గౌరవప్రదం కాదు. అది సమస్యలను ఒక స్థాయి వరకు మాత్రమే నెరవేర్చగలదు. వ్యక్తిగత, సామూహిక జీవనంలో ఎదురయ్యే కఠిన పరిస్థితులకు ఏకైక కారణం దుర్బుద్ధి. మనిషి తన అలవాట్లని మార్చుకొని, స్వభావాన్ని సరిచేసుకొని, ఆలోచనలలో, కార్యాలలో ఎటువంటి తారతమ్యం లేకుండా చూసుకుంటే బయటనుండి ఎదురవుతున్నట్లు కనిపించే ఆపదలన్నీ తొలగిపోతాయి. వ్యక్తిగత, సామాజిక కళ్యాణం సత్ప్రవృత్తులను అధికంగా ప్రోది చేయడంలోనే నిక్షిప్తమై ఉంది. పూర్వం ఈ ప్రయత్నంలో చాలామంది తమ జీవితాలను ఉన్నతంగా చేసుకున్నారు. వారిని గొప్పవారుగా గుర్తించి గౌరవసూచకమైన బ్రాహ్మణ పీఠం మీద ప్రతిష్ఠించేవారు. అందువలన సత్ప్రవృత్తులను వ్యాపింపజేయడం ప్రపంచంలో అన్నిటికంటే గొప్ప కార్యం. కనుక ఈ కార్యంలో లగ్నమైన వారు సన్మానానికి అర్హులు.

## యుగనిర్మాణ సత్సంకల్పాల ప్రాధాన్యం

అన్నింటిలోను ఉత్తమ దానం బ్రహ్మదానం. బ్రహ్మదానం అనగా జ్ఞానదానం. మానవుని నైతిక స్థితిని స్థిరంగా ఉంచే నిష్ఠ, భావనలే జ్ఞానం. యుగనిర్మాణ సత్సంకల్పాలలో ఇవ్వబడిన పుణ్య ప్రచార ప్రేరణలు ఈ బ్రహ్మదానం క్రిందకే వస్తాయి. ఈ అమృతజాలంలో తడవడం వలన ఎండిపోతున్న యుగ మానసం మరల పచ్చపచ్చగా పుష్పించి, ఫలించి పరిపూర్ణంగా తయారవుతుంది. ఈ పరమార్థ కార్యాన్ని నిర్వహించడానికి పరమాత్మ మనిషికి విశేష శక్తిని, మహిమను ప్రసాదించాడు.

సమయం, పలుకుబడి, జ్ఞానం, శ్రమ, ధనం-ఈ అయిదు శక్తులలో అత్యధిక భాగాన్ని మనం పరమార్థం కోసమే వెచ్చించాలి. వ్యక్తిగత జీవన అవసరాలకోసం దివ్యశక్తులను నాశనం చేసుకోకూడదు. వాటిలో ఎంతోకొంత భాగాన్ని పరమార్థం కోసం, సత్ప్రవృత్తుల వికాసం కోసం సురక్షితంగా ఉంచుకోవాలి. నిత్య జీవితంలో అనేక ఇతర కార్యాలు అవసరమవుతాయి. ఏదోవిధంగా వాటిని నిర్వర్తిస్తూ ఉంటాము. అదే విధంగా ఈ పరమార్థ కార్యాన్ని కూడా ఒక నిత్య అవసరంగా, ఇహ-పరలోకాలకు శ్రేయస్కరంగా గుర్తించాలి. మనం గొప్పవి అని భావించే కార్యాలలో సమయాన్ని, పలుకుబడిని, జ్ఞానాన్ని, శ్రమను, ధనాన్ని నియమిత రూపంలో నిరంతరం వెచ్చిస్తూ ఉండడం భారం అనిపించదు. ఈ మార్గంలో చేసే ప్రయత్నం జీవితాన్ని ధన్యం చేసే అత్యుత్తమ కార్యంగా గోచరిస్తుంది.

## సంచార గ్రంథాలయాల విశిష్ట పాత్ర

సత్ప్రవృత్తుల అభివృద్ధికి యుగనిర్మాణ యోజన అంతర్గతంగా అనేక కార్యక్రమాలు తెలియజేయబడ్డాయి. సంచార గ్రంథాలయం అందరికీ సులభమైనది. ఎవరికి వారు తమ శక్తిని అనుసరించి ఇందుకోసం ప్రణాళికలు రూపొందించుకోవాలి. సమయాన్నీ, శ్రమను ప్రతివ్యక్తీ ఇవ్వగలడు. వాటిలో ఖచ్చితమైన భాగాన్ని వెచ్చించే నియమాన్ని పాటించాలి. పలుకుబడి గల వ్యక్తులు వాటిని బాహాటంగా సమర్థించాలి. ప్రజల మీద ఇందుకోసం ఒత్తిడి పెంచితే ఎక్కువ ప్రగతి సాధ్యమవుతుంది. జ్ఞానులు తమ సలహాలు సూచనలతో ప్రేరణనిస్తూ ప్రోత్సహించవచ్చు. ధనవంతులు అవసరమైన సాధనాలు అందించవచ్చు. కనీసం ఒక గంట సమయం, నెలలో ఒక రోజు ఆదాయాన్ని సత్ప్రవృత్తుల అభివృద్ధి కోసం వెచ్చిస్తే - అది చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ కార్యంగా తయారవుతుంది.

-అనువాదం : డి.వి.ఆర్.మూర్తి.

H H H

**ఇతరుల కోసం జీవించే వ్యక్తి జీవన్ముక్తుడు.**

సాధన విజ్ఞానం

# సాధనలోని త్రివేణి-భజన, మననం, చింతన

ఉన్నత స్థాయి ఆధ్యాత్మ సాధనలోని భావ భాగంలో మూడు విభాగాలు ఉన్నాయి - భజన, మననం, చింతన. అంతఃకరణ ఆరోగ్యం, తీక్షణత, పుష్టి, ప్రగతి ఈ ఆధారాలు మూడింటిపై నిలచి ఉంటాయి. గాయత్రీ మహామంత్రంలోని మూడు చరణాల సూక్ష్మ ప్రేరణ కూడా ఈ త్రివేణి అని చెప్పవచ్చు.

సాధనలోని అత్యున్నత స్థాయి అద్వైత స్థితి. ఆ స్థితిలో ప్రవేశించనిదే మనస్సు లగ్నము కాదు. పరమేశ్వర ప్రాప్తి జరుగదు.

ఉన్నత స్థాయి భజన కోసం శరీరం బిగువు పూర్తిగా సడలించాలి. మనస్సును తటస్థంగా, ఉదాసీనంగా ఉంచాలి. శరీరంలోని మాంస కండరాలలో ఉద్రేకం ఉండకూడదు. మెదడు ఎలాంటి ఆకర్షణా, ఉత్తేజం సృష్టించకూడదు. కొద్ది రోజులు అభ్యాసం చేస్తే ఈ స్థితి లభిస్తుంది. పడక కుర్చీ, మెత్తటి పరుపు, గోడ, చెట్టువంటి వాటిని ఆసరా చేసుకుని శరీరాన్ని నిద్రా స్థితి, మృత స్థితి వంటి సడలింపు స్థితిలోకి తేవాలి. దీన్ని శవాసనం లేక శిథిలీకరణ ముద్ర అంటారు. శరీరం దృష్టిలో ఇది పూర్తి విశ్రాంతి. మనస్సు దృష్టిలో ఇది ధ్యాన భూమిక. పద్మాసనం, బద్ధ పద్మాసనం వంటి ఉద్రిక్తత కలిగించే ఆసనాలు ధ్యానానికి ఆటంకాలు అవుతాయి.

మనస్సుకూ ఇదే వర్తిస్తుంది. ప్రపంచమంతటిలో శూన్యం వ్యాపించి ఉంది. ప్రళయ కాలంలో వలె - క్రింద అగాధమైన నీలి రంగు గల జలరాశి (సముద్రం) ఉంది. పైన నీలాకాశం ఉంది. అంతటా పరమశాంతిని ప్రసాదించే నీలిరంగు, నీరవత వ్యాపించి ఉన్నాయి. ఎక్కడా వ్యక్తి కాని, వస్తువు కాని లేదు. మనస్సును ఆకర్షించే పరిస్థితి ఏదీ లేదు. ఆ పరమశూన్యతలో బాలుని వలె మన నిర్మల చేతన కమల పత్రంపై పరుండి ఈదుతోంది. తన కాలి బొటనవ్రేలును నోటిలో పెట్టుకుని ఉంది. ఆత్మ స్వ-రసాన్ని పానం చేస్తోంది. ప్రళయ కాలం యొక్క ఇలాంటి చిత్రం బజారులో దొరుకుతుంది. మనఃస్థితిని ఆ స్థాయికి తేవడానికి ప్రయత్నించాలి. అప్పుడు శూన్యత అనే మానసిక స్థితి ఏర్పడుతుంది, పెరుగుతూ ఉంటుంది. శారీరక శిథిలత, మానసిక రిక్తత కలిగిన ఈ స్థితి భజన సాధనకు ప్రాతిపదిక.

భావపరమైన ధ్యానయోగానికి ఇది మొదటి సగం. శస్త్ర చికిత్స జరుపుతున్నపుడు, రక్తం ఎక్కిస్తున్నపుడు శరీరం కదలకూడదు. భజన సమయంలో మానసిక వ్యవస్థను అలా ప్రశాంతంగా ఉంచాలి.

ఇక రెండవ సగం. సర్వశక్తిమంతుడు, సర్వవైభవ శాలి, అన్ని ఉత్కృష్టతలూ కలిగినవాడు, ప్రేమ సాగరుడు అయిన పరమేశ్వరుడు మనలో ప్రవేశిస్తున్నట్లు, కలసిపోతున్నట్లు అనుభూతి పొందాలి. బ్రహ్మాండంలో వ్యాపించి ఉన్న దివ్యప్రకాశ సాగరంలో మనం చేపలా మునిగి ఉన్నట్లు అనుభూతి పొందాలి. మట్టిమీద నీళ్ళు పడినపుడు రెండూ కలసి కొత్త రూపం ధరించి బురద అవుతుంది. ఆ విధంగా పరమ ప్రకాశం మన రోమ రోమంలో వ్యాపిస్తోంది. (1) శరీరంలోని వివిధ అవయవాలలో ఉన్న విషం సంయమనం, బలిష్టత అనే రూపాన్ని ధరిస్తోంది. (2) మెదడులో వివేకం, తీక్షణమైన ప్రతిభ ఈ రెండూ తీక్షణమైన తేజస్సుగా మారి వ్యాపిస్తున్నాయి. అంతరాత్మలోని హృదయ వ్యవస్థలో అది దేవత్వం, ఆనందం అనే రూపం ధరించి ఉంది. ఈ విధంగా స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలలో పరమాత్మ యొక్క పరమజ్యోతి జ్వలిస్తూన్న అగ్నివలె ప్రవేశించడాన్ని చూడాలి. ఆ వెలుగులో తాను వెలగడాన్ని చూడాలి. భజన సాధనలో ప్రధాన విషయమైన ధ్యాన విద్య ఇది.

ఈ సంయోగ సమయంలో ఆనందానుభూతి ఉప్పొంగాలి. మాతాపుత్రుల, ప్రేమికుల సమాగమం కన్న హెచ్చు సుఖ సంతృప్తులను కలిగిస్తుంది. ఈ ఆత్మ, పరమాత్మల కలయిక. ఈ కలయిక యొక్క ప్రతిక్రియను కూడా

**మిడిమిడి జ్ఞానం వల్ల అహంకారం; అహంకారం వల్ల అధఃపతనం.**

అనుభూతిలోనికి తెచ్చుకోవాలి. శరీరాన్ని, మనస్సునూ పరమేశ్వరునికి సమర్పించడం, ఆయన వాటిని స్వీకరించడం అనే అనుభూతి పొందాలి. ఆ తర్వాత మన శరీరం పూర్తిగా పరమేశ్వరుని ఇచ్ఛకు అనుగుణంగా నడవాలి. మన ఇచ్ఛనూ, కామననూ పరమేశ్వరునిపై రుద్దకూడదు. ఆయన ఇచ్ఛలో మన ఇచ్ఛను లీనం చేయాలి. పరమేశ్వరునికి సంతోషం కలిగించే దానినే ఆలోచించాలి. భజనపరాయణుడైన భక్తునికి సముచితమైన పనినే చేయాలి. ప్రతిఫలం కోసం చేసే భజన వేశ్యావృత్తి అవుతుంది.

సంధ్యావందనానికి వలె భావనాత్మక సాధనలకు బ్రహ్మ ముహూర్తంలో జరగాలనే నిబంధన లేదు. దానిని వీలును బట్టి నిత్య ఉపాసనతో కాని, దానికి ముందు కాని, దాని తర్వాత కాని చేయవచ్చు. మనన సాధనకు కూడా ఇది వర్తిస్తుంది. దానిని భజనతో పాటు కాని, దానికి ముందు కాని, దాని తర్వాత కాని చేయవచ్చు. వాతావరణం ప్రశాంతంగా ఉండాలి. ఏకాంత స్థలాన్ని ఎన్నుకోవాలి. కళ్లు మూసుకోవాలి. పడక కుర్చీలో కూర్చొని ఇలా ఆలోచించాలి - శరీరం మృత అవస్థలో పడి ఉంది. ప్రాణం దాని నుండి బయటికి వచ్చి మరో ఉన్నత స్థానానికి హంసవలె వెళ్లి కూర్చున్నది. ఆ పడి ఉన్న శవం యొక్క అవయవాలను పోస్ట్‌మార్టమ్‌లో వలె వేటికవిగా విడదీయాలి. బట్టలతో నిండి ఉన్న పెట్టె వలె ఈ శరీరం తాత్కాలికమైన వినియోగానికై మనకు ఇవ్వబడిందని భావన చేయాలి. ఇదే విధంగా మెదడును ఒక చిన్న డబ్బావలె భావన చేసి, దానిలో మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం అనే నాలుగు నగలు, ఉపకరణాలు, పరికరాలు భద్రంగా ఉన్నట్లు చూడాలి.

ఈ ధ్యానాన్ని చేయగలిగినంత లోతుగా, చేయగలిగినంతసేపు చేయాలి. ప్రాణమనే హంస యొక్క ఆత్మసత్తా పూర్తిగా స్వతంత్రమైనదనే నిర్ణయానికి రావాలి. శరీరమనే బట్టల పెట్టె, మెదడు అనే పరికరాల డబ్బా జీవన రథానికి రెండు గుర్రాలుగా ఉండేవి. లక్ష్యాన్ని సాధించడానికి సహాయకంగా శరీరం లభించింది. దాని అలంకరణ కోసం ఆత్మకళ్యాణం అనే లక్ష్యానికి నీళ్లు వదులుకోకూడదు.

మరణం అనేది తప్పదు. ఆయుష్షు క్షణభంగురం అయినది. విషయాలు ఎండమావులు. వైభవం మన వెంట వచ్చేది కాదు. అది నిరర్థకమైనది. ఈ వాస్తవాన్ని గుర్తించాలి. అప్పుడు ఏమి చేయాలి, ఏమి చేస్తున్నాము అనేది తెలుస్తుంది. ఎటు వెళ్లాలో, ఎటు వెళుతున్నామో తెలుస్తుంది. జీవితమూ, మృత్యువూ పరస్పరం పూర్తిగా ముడిపడి ఉన్నాయి. వాటిలో ఏది పైకి వెళ్లినా, ఏది క్రిందికి వెళ్లినా ఏ మాత్రం ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. ఈ వాస్తవాన్ని ఆకళింపు చేసుకున్నప్పుడు మనిషి ఎంతో విలువైన తన కాలాన్ని సక్రమంగా వినియోగిస్తాడు. దాన్ని నిరర్థకమైన బాల్య క్రీడలకు దుర్వినియోగపరచడు. నరజన్మను అత్యంత శ్రేష్ఠంగా వినియోగించడం విషయంలో మనిషి అశ్రద్ధగా ఉండడానికి కారణం మృత్యువును మరచిపోవడం.

మననంలోని రెండవ భాగం ఆత్మబోధ. మన వాస్తవిక స్వరూపం, జీవిత లక్ష్యం, శరీరానికి ఆత్మకు ఉన్న సంబంధం, శ్రేయస్సు కలిగించేది ప్రియమైనది రెండింటిలో ఒక దాని ఎంపిక, మన కార్యకలాపాలను, ఆచార వ్యవహారాలను క్రమబద్ధం చేయడం మున్నగు కీలక నిర్ణయాలన్నీ ఆత్మబోధ కలిగిందా లేదా అనే కేంద్ర బిందువుపై ఆధారపడి ఉంటాయి. ఈ చైతన్యం కలుగనంత వరకు లోభ మోహాల దాహం తీరదు. తృష్ణ, వాసనల ప్రాబల్యం నశించదు. మాయాపాశం నుండి విముక్తి లభించదు. ఫలితంగా వ్యథల నుండి, వేదనల నుండి కూడా విముక్తి లభించదు. ఆత్మబోధ లభించకపోతే మానవ జీవనం యొక్క లక్ష్యం, ఆనందం చేజారిపోతాయి.

భజన అంటే పరమేశ్వర సత్తాతో ఆత్మసత్తాను సమీకరించడం, రెండింటి యొక్క పరస్పర విలయ సమన్వయాల అనుభూతి. మననం అంటే ఆత్మబోధ. శరీర స్వార్థాన్నీ సంబంధాలనూ, ఆత్మ యొక్క స్వార్థాన్నీ సంబంధాలనూ విడగొట్టడం. జీవన లక్ష్యం పట్ల శ్రద్ధ. అందుకు అనుగుణమైన విధి విధానాలను సాహసంతో నిర్ణయించడం. ఈ రెండింటి సాధన విధులు సులువైనవే. రెండింటిని ఒకేసారి కాని, వేర్వేరు సమయాలలో కాని చేయవచ్చు. ప్రశాంతమైన ఏకాంత స్థలంలో, సమతూకంతో కూడిన చిత్తంతో ఈ ధ్యాన, చింతనలను చేయవచ్చు. వీటిలో భావనలు ఎంత లోతుకు

**అశుభ కర్మ, దేహాభిమానం పతన హేతువులు.**

వెళితే, ఆత్మజ్యోతి అంత హెచ్చుగా ప్రకాశిస్తుంది. ఆత్మ, పరమాత్మల ప్రణయం, పరిణయం జరిగినపుడు లభించే దివ్య సంపదలు లభిస్తాయి.

భావ సాధనలోని మూడవ విభాగం చింతన. చింతన అంటే శారీరక కార్యకలాపాలను ఆదర్శవాదం ఆధారంగా, మానసిక వ్యాపారాలను ఉత్కృష్టత ఆధారంగా క్రమపద్ధతిలో నిర్ణయించడం. ఇందుకోసం ఉదయం నిద్ర లేవగానే 'ప్రతిరోజూ కొత్త జన్మ - ప్రతి రాత్రీ కొత్త మరణం' అనే వాస్తవాన్ని ముందుంచుకుని, ఆ రోజు దినచర్యను సమయపరంగాను, భావనాపరంగాను నిర్ణయించాలి. ఈ జన్మ ఒకరోజు కోసమే. నేటి రాత్రి మృత్యువు ఒడిలోకి, నిద్ర ఒడిలోకి జారిపోవలసిందే. కనుక, భగవంతుడు ప్రదానం చేసిన సమయ సంపదను, భావ వైభవాన్ని అత్యంత శ్రేష్ఠమైన రీతిలో సద్వినియోగం చేయడానికై, జీవితం నుండి ప్రయోజనం పొందడానికై సాహసంతో ఉద్యమించాలి. ఇందుకు ఎలాంటి ఆటంకమూ కలుగకుండా జాగ్రత్తపడాలి.

ప్రాతఃకాలం నుండి రాత్రి నిద్రపోయే వరకు టైమ్‌టేబుల్ (ఏ సమయంలో ఏ పని చేయాలో తెలిపే పట్టిక)వ్రాసుకోవాలి. కాలకృత్యాలు, భోజనాదులు, విశ్రాంతి, వృత్తి, ధార్మిక, సేవా కార్యక్రమాలు మొదలైన పనులన్నింటికీ తగు సమయం కేటాయించాలి. ఎనిమిది గంటలు సంపాదనకు, ఆరు గంటలు నిద్రకు, నాలుగు గంటలు నిత్య నైమిత్తిక కార్యాల కోసం కేటాయించాలి. వీటికోసం మొత్తం 18 గంటలు కేటాయించాలి. అత్యధికంగా 20 గంటలు కేటాయించవచ్చు. మిగతా నాలుగు గంటలూ జీవన లక్ష్యాన్ని సాధించడం కోసం కేటాయించాలి.

ప్రతి పనితోనూ ఒక ఆలోచన ముడిపడి ఉంటుంది. ఏ పనిని ఏ ప్రయోజనం కోసం చేస్తున్నాం? అందులో అభిరుచి, ఉత్సాహం ఎందువల్ల కలుగుతోంది? దాని వెనుక ఏదో ఒక కారణం, ఏదో ఒక ఆకర్షణ ఉండి తీరుతుంది. మనసులోని ఆకాంక్ష, శరీరం చేసే క్రియ - రెండింటి కలయిక వల్ల కర్మ ఏర్పడుతుంది. ఆ కర్మ ఆధారంగా సంస్కారం ఏర్పడుతుంది. పాప పుణ్యాల నిర్ణయం జరుగుతుంది. కర్మఫలం అనే ప్రతిక్రియ ఏర్పడుతుంది. భావం లేని క్రియ వట్టి కుప్పిగంతు మాత్రమే అవుతుంది. మనం మన ప్రతి కార్యకలాపంతో ఉదాత్త ఆదర్శాలతో నిండిన భావనను జోడించాలి.

ఉదాహరణకు - భార్యను మన సంరక్షణలో ఉంచబడిన పరమేశ్వర పుత్రికగా పరిగణించాలి. తన పుట్టింటి నుంచి ఏ స్థితిలో వచ్చిందో అంతకన్న ఆరోగ్యంగా, యోగ్యంగా, వికసితంగా, ప్రసన్నంగా, ప్రఫుల్లితంగా ఆమెను తయారు చేసే ప్రయత్నం నిరంతరం జరగాలి. ఆమెపట్ల కర్తవ్యం, స్నేహం, సౌజన్యం కురిపిస్తూ ఉంటే - భౌతిక సౌకర్యాల దృష్ట్యాను, ఆత్మిక ప్రగతి దృష్ట్యాను ఆమె ఎంతో సుఖాన్నీ, శ్రేయస్సునూ అందిస్తుంది.

అలాగే - పిల్లలను పరమేశ్వరుని ఉద్యానవనంలో వికసించిన పరిమళం వెదజల్లే పుష్పాలుగా పరిగణించాలి. తోటమాలిగా వారిని పెంచి పోషించాలి. మన సంపదగా, ముసలితనంలో ఆసరాగా, వంశాన్ని కొనసాగించే వారసులుగా మాత్రమే వారిని పరిగణిస్తే - వారు బంధనాలు అవుతారు. ఇహ పరాలలో రకరకాల దుర్గతులకు కారకులు అవుతారు. దృక్పథంలో తేడా ఉండడం వల్ల ఒక వ్యక్తికి శిశుపోషణ, కుటుంబ నిర్వహణ అపారమైన ఉద్వేగానికి కారణాలు అవుతాయి: సంస్కరించబడిన ఆలోచనా ధోరణితో జరిపే కుటుంబ సేవ గృహస్థయోగ సాధన అవుతుంది. తల్లితండ్రులు, సోదరీ సోదరులు మున్నగువారితో నిండిన కుటుంబం భావనాశీలుడైన వ్యక్తికి తన సద్గుణాల వికాసానికి నిర్మింపబడిన ప్రయోగశాలగా మారుతుంది. ఈ కొద్దిమంది వ్యక్తులను చక్కని పద్ధతిలో ఉంచడం ఒక చిన్న రాజ్యాన్ని పాలించడంతో సమానమైనది. నాయకత్వం, చక్కని కార్యనిర్వహణ, చక్కని వ్యవస్థ ఏర్పాటు చేయడం అనే దిశలో ఎవరు ఎంత యోగ్యతను సంపాదిస్తారు అనే పరీక్ష కుటుంబ జీవితంలో అనుసరించిన విధి విధానాల ద్వారా జరుగుతుంది. ఆ పరీక్షలో నెగ్గిన వ్యక్తికి భగవంతుడు మరింత విస్తృతమైన రంగాన్ని, మరింత ప్రముఖమైన బాధ్యతలను అప్పగిస్తాడు. ఈ వాస్తవాన్ని గుర్తించి, కుటుంబం కోసం సంపాదనలో, సౌకర్యాలను ఏర్పరచడంలో వినియోగించే సమయాన్ని, ఆలోచనను నిర్ణయిస్తే - గృహమే ఒక తపోవనం

**శిష్టాచారం సభ్యతకు ప్రాతిపదిక.**

కాగలుగుతుంది. అలాంటి వ్యక్తులకు తపోవనంలో గృహాన్ని ఏర్పరచుకునే అవసరం ఉండదు.

శరీరాన్ని భగవంతుని ఆలయంగా, భగవంతుని పనికి ఉపకరించే వాహనంగా పరిగణిస్తే, దానిని ఆరోగ్యంగా, సువ్యవస్థితంగా ఉంచే చర్యలు తీసుకుంటే - శరీర యాత్ర కోసం జరిపిన కృషి మరో రూపంలో పరమేశ్వర సేవగా, పరమేశ్వర పూజగా పరిణమిస్తుంది.

నిజాయితీ, తగినంత లాభం, ప్రజల అవసరాలు తీర్చడం, కుటుంబ వ్యవస్థ కోసం శ్రమసాధన అనే రూపంలో వృత్తినీ, సంపాదననూ పరిగణిస్తే - ఆ వృత్తి, ఆ వ్యాపారం, ఆ ఉద్యోగం, ఆ వ్యవసాయం, ఆ శిల్పం, ఆ బుద్ధి, ఆ శ్రమ ఒక విధమైన కర్మయోగంగా పరిగణించబడతాయి.

శరీరాన్ని వాసన, ప్రదర్శన, అహంకారం, అనాచారాల కోసం అవినీతికరంగా, విశృంఖలంగా తయారు చేస్తే, అది బంధనానికి కారణం అవుతుంది.

భోజనాన్ని భగవానుని ప్రసాదంగా, శరీరమనే యంత్రానికి ఇంధనంగా, ఆకలి అనే రోగానికి ఔషధంగా పరిగణించడం పరమార్థ పరాయణత్వం. జిహ్వాచాపల్యం వల్ల అనుచితమైన ఆహారం తీసుకుంటే - సామాన్యంగా కనిపించే ఆ భోజన ప్రక్రియ పాపాన్ని సృష్టిస్తుంది.

తాత్పర్యం ఏమంటే - రోజులో జరిగే కార్యకలాపాలన్నిటినీ ఉన్నత స్థాయి భావనలతో తీర్చిదిద్దాలి. ప్రతిరోజూ కాగితంమీద పూర్తి దినచర్యను వ్రాసి ఉంచుకోవాలి. రోజులోని సమయ విభజనను, ప్రతి పనితో జోడించే భావనలను వివరంగా వ్రాసి ఉంచుకోవాలి. ఆ కాగితాన్ని మేజాబల్లమీద కాని, జేబులో కాని పెట్టుకోవాలి. నిర్ణీతమైన కార్యపద్ధతిలో, ఆలోచన ప్రక్రియలో ఎంత సాఫల్యం లభిస్తున్నదో, ఎంత వైఫల్యం లభిస్తున్నదో గంట గంటకు నిర్ణయించాలి. ఈ క్రమంలో సాఫల్యం ఎంతో, వైఫల్యం ఎంతో రాత్రి నిద్రపోయే సమయానికి తెలుస్తుంది. సాఫల్యాలకు సంతోషించాలి. వైఫల్యాలు మరు జన్మలో, అనగా మరునాడు, రాకుండా జాగ్రత్త పడాలి.

రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు సన్యాసం వంటి భావనలను హృదయంలోనికి తెచ్చుకోవాలి 'ఉన్న కర్తవ్యాలను, పరమేశ్వరుడు అప్పగించిన కర్తవ్యాలను నిజాయితీతో నిర్వహించాను. మిగిలిన దానిని పరమేశ్వరుడు పూర్తి చేస్తాడు. కుటుంబం, ధనం, వైభవం మున్నగునవి అన్నీ భగవంతునివే. అతడి వారసత్వాన్ని అతడికే అప్పగించి, నిశ్చింతగా, నిర్లిప్తంగా, అనాసక్త కర్మయోగిలా నిద్ర - మృత్యువు ఒడిలోకి వెళుతున్నాను'- అని భావన చేయాలి. అంతిమ మృత్యువు కోసం ఇది గొప్ప సాధన. ఈ మనఃస్థితిలో దీర్ఘనిద్ర వస్తే, మరణం సంభవిస్తే - పరలోకంలో పరమశాంతి, సద్గతి లభించడం ఖాయం.

చింతన స్వరూపాన్నీ, శారీరక మానసిక కార్యకలాపాలనూ ఆదర్శవాదం ఉత్కృష్టతల మూసలో పోయాలి. అజాగ్రత్త వల్ల దుష్ట ప్రవృత్తులు చొరబడే అవకాశం లేకుండా చూచుకోవాలి. క్రమపద్ధతి లేని జీవనచర్యవల్లనే దుష్ట ప్రవృత్తులు మనమీద పెత్తనం చేస్తాయి. తగు జాగ్రత్తలు తీసుకుంటే, మెలకువ వహిస్తే - దుష్ట భావనలను సంస్కరించే అవసరం రానే రాదు. ఎప్పుడైనా అవి ఆక్రమణ జరిపినా - ఆలోచనాపరుడైన వ్యక్తి వాటిని జయించడానికై వాటికి విరుద్ధమైన ఆలోచనల సైన్యాన్ని సన్నద్ధం చేసుకుంటాడు. కాముకత్వానికి సంబంధించిన ఆలోచనలు మనసులో ప్రవేశిస్తే - వాటిని ఓడించడానికై, వ్యభిచారం వల్ల కలిగే అనేకానేక అనర్థాలతో, సంయమనం వల్ల బ్రహ్మచర్యం వల్ల కలిగే సత్‌పరిణామాలతో సుదీర్ఘమైన జాబితాను తయారు చేసి ఉంచుకుంటాడు. అవి వచ్చిన వెంటనే వాటిపై దాన్ని ప్రయోగిస్తాడు. ఈ ప్రక్రియ ప్రారంభమైతే, చెడు తలంపులను జయించడంలో ఏమాత్రం ఆలస్యం జరగదు.

ఉన్నత స్థాయి భావనాత్మక సాధనకై భజన, మనన, చింతనల త్రివేణిని ప్రవహింపజేయాలి. ఈ భావ సమన్వయం ద్వారానే గాయత్రీ మహామంత్రం యొక్క, ఉపాసనాత్మక కర్మకాండ యొక్క ప్రాణప్రతిష్ఠ సాధ్యపడుతుంది. ఈ రెండింటి సంయోగం వల్ల ఆధ్యాత్మిక రంగంలో మహత్తరమైన ప్రగతి సాధ్యపడుతుంది. HHH

**శరీరంలోపలి క్రియాత్మక శక్తియే ప్రాణం.**

## ఆదిశక్తి గాయత్రి సాధన - 3

# యజ్ఞమూ, గాయత్రీ పరస్పర పూరకాలు

### పిలక, జందెం, గాయత్రీ అందరికోసం

పిలక, జందెం హిందూ మతానికి ప్రతీకలు. క్రైస్తవులకు శిలువవలె, ముస్లింలకు చంద్రుడూ నక్షత్రాలవలె. సృష్టి ప్రారంభంలో ఉన్నది ఓంకారం. ఓంకారము నుండి మూడు వ్యాహృతుల రూపంలో మూడు తత్వాలు లేక గుణాలు, మూడు ప్రాణాలు, ఆ తర్వాత ఎన్నెన్నో తత్వదర్శనాలు, సాధనా విజ్ఞానాలుగా విస్తరణ. సృష్టితో ముడిపడి ఉన్న అనేక భౌతిక రహస్యాలు కూడా ఈ క్రమంతో కలగలసి ఉన్నాయి. చివరికి మిగిలేది కూడా గాయత్రి యొక్క బీజమంత్రం ఓంకారమే.

విషయాలను అర్థం చేసుకోగలిగే వయస్సు రాగానే ప్రతి హిందూ బాలకునికీ ద్విజత్వ దీక్ష ఇవ్వబడుతుంది. అతడి తలపై గాయత్రి యొక్క ధ్వజారోహణం పిలక రూపంలో చేయబడుతుంది. జందెం అంటే యజ్ఞోపవీతం. దాన్ని ధరించడం నర-పశువు జీవితం నుండి నర-దేవుని జీవితంలోకి ప్రవేశించడం. ద్విజత్వం అంటే జీవన చర్యను ఆదర్శాల అనుశాసనంతో బంధించడం. దీని సంస్మరణ ప్రతీక రూపంలో హృదయం, భుజం, వీపు మున్నగు శరీరంలోని ప్రముఖ భాగాలపై ప్రతి క్షణం అధివసించి ఉండడానికై తొమ్మిది మహా సద్గుణాల ప్రతీకగా ఉపనయనంలో వయస్సు వచ్చిన ప్రతి వ్యక్తికీ యజ్ఞోపవీతం ధరింపజేయబడుతుంది.

మధ్యయుగంలో, ఫ్యూడల్ అంధకార యుగంలో, ప్రతి రంగంలోనూ వికృతులు చొరబడ్డాయి. ఆ వికృతులు సంస్కృతిపరమైన భావ అనుభూతులనూ, ప్రతీకలనూ విడిచిపెట్టలేదు. గాయత్రీ మంత్రం బ్రాహ్మణ వంశం వారిదేననీ, ఇతర కులాల వారు దీనిని జపించకూడదనీ, స్త్రీలు కూడా గాయత్రిని పఠించకూడదనీ, ఇతరులు దానిని విని నేర్చుకునే విధంగా దానిని సామూహికంగా ఇవ్వకూడదనీ రకరకాల ఆంక్షలు విధించబడ్డాయి. కపోలకల్పితాలు అయిన ఇలాంటి ఆంక్షలు ఎందువల్ల విధించబడ్డాయి? ఆ కారణాన్ని వెదికితే ఒక విషయం స్పష్టమవుతుంది. మధ్యయుగంలో-వర్షాకాలంలో నాచు పెరిగినట్లు - ఎన్నెన్నో మతాలూ, సంప్రదాయాలు పుట్టుకువచ్చాయి. అవి తమ తమ వేర్వేరు నియమ నిబంధనలూ, ఆచారాలూ, కట్టుబాట్లూ, భక్తి సాధనలూ మున్నగు వానిని తమతమ పద్ధతులలో స్థిరపరచుకుని ఉండవచ్చు. అనాదిగా ప్రాచుర్యంలో ఉన్న గాయత్రి వాటి మార్గానికి ఆటంకంగా నిలచి ఉండవచ్చు. ఆ కారణంగా వాటి ఆటలు సాగకపోయి ఉండవచ్చు. ఆ స్థితిలో అనాదిగా గాయత్రిపై ఉన్న విశ్వాసం పట్ల సందేహాలు జనింపజేయాలనీ, అందువల్ల సత్పురుషుల దృష్టి శాశ్వత సత్యమైన గాయత్రి నుండి మరలుతుందనీ ఆ మత సంప్రదాయాలన్నీ ఆలోచించి ఉండవచ్చు.

కలియుగంలో గాయత్రీ మంత్రం ఫలించదనే అపోహను కూడా ఇలాంటివారే కల్పించారు. యుగనిర్మాణ యోజన గాయత్రీ మహామంత్రం ఆధారంగా ప్రపంచమంతటికీ చెందిన స్త్రీ పురుషులకు ఈ సిద్ధాంతాన్ని అందించిందనీ, ఆ కారణంగా వారందరికీ చక్కని ఫలితాలు లభించాయనీ, వారందరూ గాయత్రీ ఉపాసనతో పాటు జీవన సాధనను జోడించడం అందుకు కారణమనీ వారికి చెప్పవచ్చు. వారి మాట నిజమే అయితే, గాయత్రి నిరుపయోగమైనదనే ప్రజాభిప్రాయం ఏర్పడి ఉండేది. కాని-ఈ రోజుల్లో గాయత్రి ప్రపంచమంతటా విస్తరించిందని పరిశీలనల వల్ల తెలుస్తోంది. 'సద్బుద్ధి' యొక్క ఉపాసనయే కాలం ఇస్తున్న పిలుపు అనీ, మహత్తరమైన ఉపాసన అనీ అనుభవం ఆధారంగా అందరూ గుర్తించారు.

ఈ ఉపాసన విషయంలో స్త్రీ పురుషుల మధ్య

**మానసిక సామర్థ్య సంపూర్ణ వినియోగానికి సాధనం ధ్యానం.**

అంతరాన్ని అంగీకరించలేము. గాయత్రి స్వయంగా మాతృస్వరూపిణి. తల్లి ఒడిలో ఆమె కుమార్తెలను కూర్చోనివ్వకపోవడం ఏమి న్యాయం? భగవంతునితో బాంధవ్యాన్ని ఏర్పరచుకుంటూ ఆయనను 'త్వమేవ మాతా చ పితా త్వమేవ' అంటూ చెప్పే శ్లోకాలలో పరమాత్మను మొట్టమొదట తల్లిగా, ఆ తర్వాతనే తండ్రిగా, మిత్రునిగా, సఖునిగా, గురువుగా భావించారు. గాయత్రికి స్త్రీ రూపంలో గుర్తింపు ఇవ్వడం వెనుక మరో ప్రయోజనం కూడా ఉంది. మాతృశక్తి పట్ల ఈ రోజుల్లో కానవస్తున్న అవహేళననూ, నిర్లక్ష్యాన్ని రూపుమాపడమే ఆ ప్రయోజనం. ఈ శతాబ్దం నారీ శతాబ్దం. ఇంతవరకు ప్రతి కార్యక్రమంలోనూ పురుషునికి ప్రాముఖ్యం ఇస్తూ వచ్చాం. స్త్రీని చిన్నచూపు చూస్తూ వచ్చాం. ఆమెను వంచితగా ఉంచుతూ వచ్చాం. రానున్న రోజులలో ఈ పరిస్థితి పూర్తిగా తారుమారు అవుతుంది. మహిళకు ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. ఇలాంటి పరిస్థితిలో భగవంతునికి స్త్రీరూపంలో ప్రాధాన్యం ఇవ్వడంలో కొత్త విషయమూ లేదు, తిరస్కరించదగిన విషయమూ లేదు. శాశ్వతమైన సంప్రదాయానికి తిరిగి జీవం పోయడమే ఇది. స్రష్ట మొట్టమొదట ప్రకృతిని స్త్రీరూపంలోనే సృష్టి చేశాడు. ఆ ప్రకృతి గర్భం నుండే జీవులన్నీ ఉత్పత్తి అయినాయి. అటువంటపుడు స్త్రీని గాయత్రీ సాధన నుండి, ఉపనయనధారణ నుండి దూరం చేయడం విజ్ఞత ఎలా అవుతుంది? శాంతికుంజ్ చేపట్టిన గాయత్రి ఉద్యమం మూఢ నమ్మకాలపై ఆధారపడిన ఆంక్షలను ఎంత ఏకాగ్రతతో, ఎంత విజయవంతంగా వమ్ము చేసిందో ఎవరైనా ఎక్కడైనా చూడవచ్చు. గాయత్రి ఉపాసననూ, యజ్ఞోపవీత ధారణనూ ఎలాంటి విచక్షణా లేకుండా మామూలు వ్యక్తికి అందించింది ఆ ఉద్యమం. ఆ రెంటికీ ఆ విధంగా పూర్వపు స్థితి కల్పించింది. దీని సత్ఫలితాలు ప్రత్యక్షంగా లభిస్తున్నాయి కూడా. రానున్న రోజుల్లో ప్రపంచమంతా ఒక కేంద్రం వైపు పురోగమించబోతోంది. అలాంటి స్థితిలో గాయత్రికి భూమండలం అంతటా గుర్తింపు లభించడంలో, అది మానవులందరికీ అందడంలో ఆశ్చర్యం ఏముంది?

## యజ్ఞమూ, గాయత్రీ పరస్పర పూరకాలు

గాయత్రికి పూరకం అయిన మరో తత్వం యజ్ఞం. రెండూ కలసినపుడే ఒక సంపూర్ణమైన ఆధారం నిర్మాణం అవుతుంది. భారతీయ సంస్కృతికి తండ్రీ తల్లీ యజ్ఞమూ, గాయత్రి. ఇవి ప్రకృతి, పురుషులు. వీటికి మహామాయ, పరబ్రహ్మల జంటగా గుర్తింపు లభించింది. కనుకనే గాయత్రి యొక్క దైనిక సాధనలో అగ్నిని సాక్షిగా నిలిపే ప్రక్రియ, దీపం అగరువత్తు వంటి వాటిని కలిపి ఉంచే ప్రక్రియ కొనసాగుతోంది. గాయత్రి పురశ్చరణ తర్వాత జపం యొక్క అనుపాతంలో హవనం చేయడం, ఆహుతి ఇవ్వడం పద్ధతిగా సాగుతోంది. రెండూ కలిసి గాయత్రీ యజ్ఞ ప్రక్రియ ఏర్పడుతుంది. మతపరమైన కర్మకాండలలో ఇదే మహత్తరమైనది. మతపరమైన కార్యాలనూ, ఉత్సవాలనూ ప్రారంభించే సమయంలో తరచు గాయత్రీ యజ్ఞం జరుపుతూ ఉంటారు. 16 సంస్కారాలలో, పండుగలలో, పర్వాలలో దీనికి ప్రాముఖ్యం ఇస్తారు. దీనిని తప్పనిసరిగా జరుపుతారు.

యజ్ఞాగ్ని ఒడిలో భారతీయ మతానికి చెందిన వ్యక్తులను చితిపై పరుండబెడతారు. జనన కాలంలో నామకరణం, పుంసవనం మున్నగు సంస్కారాల సమయంలో యజ్ఞం జరుపుతారు. యజ్ఞోపవీత సంస్కారంపై జరిగే చర్చలో 'యజ్ఞ' శబ్దాన్ని మొదట ప్రయోగిస్తారు. అగ్ని చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణం చేయడం వివాహంలో ఒక ప్రధానమైన ఘట్టం. వానప్రస్థం కూడా యజ్ఞం సాక్షిగా జరుపబడుతుంది. పండుగలూ, ఉత్సవాలూ అన్నింటిలో యజ్ఞాగ్ని కలిసిఉంటుంది. సంప్రదాయాలు మరుగునపడిన ఈ రోజుల్లో కూడా చదువు రాకపోయినా స్త్రీలు 'అగ్యారీ' రూపంలో దీన్ని చిహ్న పూజవలె జరుపుతారు. హోలీ వార్షికమైన యజ్ఞమే. కొత్త ధాన్యాన్ని వాడే ముందు దానిని యజ్ఞపితకు అర్పణ చేసి ఆ తర్వాత తాము భుజించే ఆచారం ఉంది.

గాయత్రితో విడదీయరాని విధంగా ముడిపడి ఉన్న

**సూర్యుని సూక్ష్మ చేతనతో అనుబంధానికి సాధనం ధ్యానం.**

'యజ్ఞాన్ని' ప్రాచీన కాలంలో పరబ్రహ్మ యొక్క ముఖంగా పరిగణించారు. ప్రథమ వేదమైన ఋగ్వేదంలో మొదటి మంత్రంలో యజ్ఞాన్ని పురోహితుడుగా వర్ణించారు. మణిహారాల వలె అది హోతలను ఎంతో విలువైన వారినిగా చేస్తుందని కూడా చెప్పబడింది. అగ్నిని ప్రతి ఒక్కరూ ధారణ చేయాలి. దాని శక్తీ, దాని తేజస్సూ అంతటివి. అగ్ని తన సంపర్కంలోకి వచ్చిన వారికి తన శక్తిని ప్రదానం చేస్తుంది. మన పద్ధతులు కూడా ఆ విధంగానే ఉండాలి.

శాంతి కుంజ్‌లోని బ్రహ్మవర్చస్ పరిశోధన సంస్థలో ఉన్నతమైన వైజ్ఞానిక శిక్షణ పొందిన నిపుణులు పరిశోధన జరుపుతున్నారు. ఆ పరిశోధనలో గాయత్రీ మంత్రం యొక్క శబ్దోచ్చారణ పైనా, యజ్ఞం వల్ల జనించే శక్తిపైనా పరిశోధన జరుగుతోంది. వాటి ప్రభావం ఆధ్యాత్మిక రంగానికే పరిమితమైనదా, భౌతిక రంగానికి కూడా విస్తరిస్తుందా అనే అంశాన్ని నిపుణులు పరిశోధిస్తున్నారు. గాయత్రీ మంత్రంతో ముడిపడిన యజ్ఞశక్తి పశువుల, పక్షుల, చెట్టుచేమల అభివృద్ధికి దోహదం చేస్తుందని ఆ పరిశోధనలో కనుగొనబడింది. మానవుల శారీరక రోగాలనూ, మానసిక రోగాలనూ నివారించే అద్భుత శక్తి దానిలో ఉండనే ఉంది. అంతే కాదు. కాలుష్య నివారణా, పర్యావరణ ప్రక్షాళనా దాని వల్ల సహజంగా జరుగుతాయి. ఈ పరిశోధనలో మరిన్ని ప్రయోజనాలు వెలికి వస్తాయని ఆశించబడుతోంది. బ్రహ్మవర్చస్ పరిశోధన సంస్థయే కాక-దేశంలోని ప్రతి ప్రాంతంలో యజ్ఞ సంప్రదాయాన్ని ప్రోత్సహిస్తూ దానివల్ల జనించే శక్తి ద్వారా సత్ప్రవృత్తుల పరిపోషణకూ, దుష్ప్రవృత్తుల నిర్మూలనకూ ఎక్కడ ఏ విధంగా ఏమేరకు దోహదం జరుగుతుందనే విషయాన్ని పరిశోధించే కార్యం కొనసాగుతోంది. గాయత్రీ యజ్ఞాలను ఒక స్వతంత్ర ఉద్యమంగా ఒక ధార్మిక కార్యక్రమం స్థాయిలో నిర్వహిస్తున్నారు. ఆ సందర్భంగా-గాయత్రీ యజ్ఞాలలో ఇమిడి ఉన్న ఉత్కృష్టతల వల్ల వ్యక్తిగతమూ, సామూహికమూ అయిన అభ్యుదయానికి ఎంతటి మహత్తరమైన దోహదం జరుగుతోందో ప్రజానీకానికి వివరిస్తున్నారు. ఆ యజ్ఞం యొక్క ఆధ్యాత్మిక ప్రభావంపై విస్తృతమైన పరిశోధన ఇటీవల జరిగింది. అది అన్ని విధాలా ప్రయోజనకరంగా ఉన్నదని కనుగొనబడింది.

## ఒక ఆధ్యాత్మిక ప్రయోగం

ఇది యుగసంధి సమయం. 20వ శతాబ్దిలోని యజ్ఞాగ్ని అవాంఛనీయ అంశాలను తొలగించడానికీ, 21వ శతాబ్దితో పాటు ఉజ్వల భవిష్యత్తు ప్రవేశించడానికీ, కృతయుగం తిరిగి రావడానికీ తగు వాతావరణాన్ని నిర్మించింది. రెండు శతాబ్దుల మధ్య సమయమైన యుగసంధి నేడు జరుగుతోంది. ఇందుకోసమై ప్రత్యక్షంగా అనేక కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి. అంతే కాదు. కోటిమంది యాజకుల ద్వారా లక్ష గాయత్రీ యజ్ఞాలు ఈ రోజుల్లో నిర్వహింపబడుతున్నాయి. భాగీరథి అయిన గంగ అవతరించిన విధంగా ఒక అభినవ అదృష్టం తిరిగి దిగివస్తుందని ఆశించబడుతోంది. మామూలు మాట లౌడ్‌స్పీకర్ వల్ల దూరదూరాలకు వినిపించే విధంగా - గాయత్రీ మంత్రంతో యజ్ఞశక్తి కలియడంతో ఆశించిన ఫలితం మరింతగా విస్తరిస్తోంది. రేడియో ప్రసారాల వలె, టెలీ కమ్యూనికేషన్ ప్రసారంవలె అది విస్తరిస్తోంది. యజ్ఞాగ్ని అనే విద్యుచ్ఛక్తి గాయత్రీ మంత్రం యొక్క శబ్దమాలికతో సమన్వయం పొంది ఆశించిన ధర్మ కార్యాన్ని స్థానిక స్థాయికి పరిమితం చేయకుండా విశాలమైన రంగాన్ని ప్రభావితం చేస్తోంది. అందువల్ల అసంఖ్యాకులైన ప్రజలు ఎన్నెన్నో ప్రయోజనాలు పొందుతున్నారు.

బ్యాటరీలలో పెద్దపెద్దవీ ఉంటాయి. మామూలు గడియారంలో అమర్చబడి అది సంవత్సర కాలం నడిచేటట్లు చేసేవీ ఉంటాయి. గాయత్రీ యజ్ఞాలు పెద్దపెద్దవీ ఉంటాయి. దీపయజ్ఞాల స్థాయిలో చిన్నవీ ఉంటాయి. నిప్పురవ్వ చిన్నదిగానే ఉంటుంది. అయినా దావానలంగా మారే సామర్థ్యం దానిలో ఇమిడి ఉంటుంది.

**నిద్రిస్తూన్న చక్రాలు ధ్యానం వల్ల మేలుకొంటాయి.**

గాయత్రీ మంత్రం చిన్నది అయినా, దానితో ముడిపడి ఉన్న శక్తి ఇలాంటి అద్భుతాలను సాధించగలుగుతుంది. సాధన సంపత్తి ధరలు పెరగడం, ఎక్కువ సమయం పట్టడం, పురోహితుల దాన దక్షిణల బరువు మోయలేని ప్రస్తుత పరిస్థితి- వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని దీపయజ్ఞాల రూపంలో గాయత్రీ మంత్రం ఇప్పుడు కొత్తతరహాలో ప్రయోగించబడుతోంది. దాని ఫలితాలు ఉన్నత స్థాయికి చెందినవిగా, విస్తృతమైన రంగాన్ని ప్రభావితం చేసేవిగా ఉంటున్నాయి.

ప్రస్తుత పది సంవత్సరాల యుగసంధి కాలంలో శాంతికుంజ్ నుండి రెండు అత్యంత ప్రబలమైన ఉద్యమాలు ప్రారంభమైనాయి. మొదటిది దీప్తయజ్ఞాల ద్వారా లక్షమంది నిర్మాణాత్మక సాధకులను సమీకరించడం. రెండవది ఈ ఉద్యమంలో భాగస్వాములు కావడానికై కోటిమందిని సమీకరించడం. ఈ ఉద్యమాలు రెండూ ఎంత వేగంగా నిర్వహించబడితే అంత వేగంగా నవయుగ ఉదయానికి, అనగా కృతయుగం తిరిగి అవతరించడానికి, అనుకూల వాతావరణం నిర్మాణం అవుతుంది. ఈ మహోద్యమాన్ని ప్రారంభించే సమయంలోనే ఇది సఫలమయ్యే సూచనలు కానవస్తున్నాయి. నవయుగ అవతరణ నిర్ణీత సమయంలో జరిగితీరుతుందనే గట్టినమ్మకం కలుగుతోంది. కార్యశూరత ఒకవైపు నుండీ, పరమార్థం మరోవైపు నుండీ పని చేస్తున్నాయి. ఒకటి ప్రక్క ఒకటి చేరితే రెండు కాక పదకొండు అయ్యే విధంగా ఆ రెండింటి సమన్వయం ఫలితంగా ప్రస్తుత దీపయజ్ఞ కార్యక్రమాలు సఫలం అవుతున్నాయి. సూత్రబద్ధమైన ఆధ్యాత్మిక ప్రయోగాలు, కోటిమంది వ్యక్తులు స్వీకరించిన నిర్మాణాత్మక కార్యక్రమం-ఈ రెండూ కలసి నవయుగ అవతరణను సుసాధ్యం చేస్తే, మత్స్యావతారం వలె దానిని విశ్వవ్యాప్తం చేస్తే అందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు.

నేడు వ్యక్తినీ సమాజాన్నీ ఆవరించి ఉన్న తీవ్ర సంక్షోభాలకు ప్రముఖ కారణం మనస్సు పెడదారి పట్టడం అని ఆలోచనాపరులూ, మనీషులూ అంగీకరిస్తున్నారు. భ్రష్టమైన ఆలోచనల వల్ల భ్రష్టమైన ఆచరణ వచ్చింది. దాని ఫలితంగా అనర్థాల వరద ముంచుకువచ్చింది. దీనిని నివారించడానికి ఒకేఒక మార్గం భావవిప్లవం. ప్రజా మనస్సును సంస్కరించనిదే వివిధ రూపాలలో వస్తూన్న విపత్తులను నివారించలేము. భావ విప్లవం ఈ యుగం యొక్క మహత్తర ఆవశ్యకత. ఈ భావవిప్లవాన్ని సాధించడానికై గాయత్రీ యజ్ఞంలో ఇమిడి ఉన్న తత్వం ప్రజా మనస్సులో స్థిరపడవలసి ఉంది. దీనితో పాటు - ఆదిశక్తిగా, సమగ్ర శక్తిగా పరిగణించబడే గాయత్రి యొక్క ఉపాసనను మనం ఆశ్రయించవలసి ఉంది. కొద్దిమంది వ్యక్తులు కఠోర తపస్సు చేసి తమ కర్తవ్యం పూర్తి అయినట్టు భావిస్తే చాలదు. దీనితో పాటు ప్రజలు అత్యధిక సంఖ్యలో ఒక స్థాయికి చెందిన సాధనా పద్ధతిని అవలంబించాలి. దాని సహాయంతో నిర్మాణమయ్యే ప్రాణశక్తిని విస్తరింపజేస్తూ ఆ ప్రక్రియను నిర్వహించాలి. దానిని పరిమితం చేస్తే ప్రయోజనం లేదు. దానిని వ్యాప్తి చేయడం ద్వారానే, విస్తృతం చేయడం ద్వారానే ఆశించిన ప్రయోజనాలు సిద్ధించగలవు.

వివిధ ప్రయోజనాల కోసం గాయత్రీ ఉపాసన యొక్క వివిధ పద్ధతులను అనుసరించాలి. దాని వివరణను సాధనా విజ్ఞానానికి సంబంధించిన శాస్త్రాల ద్వారా, అనుభవాల ద్వారా, నిపుణుల ద్వారా పొందవచ్చు. తగిన గురువును ఎంపిక చేసుకుని ఆయన మార్గదర్శనంలో చేసిన సాధన అపారమైన ఫలితాన్ని అందిస్తుంది. మానసిక జపాన్ని ఎక్కడయినా చేయవచ్చు. అందుకు అభ్యంతరం లేదు. అయితే, ఒక ప్రత్యేక ప్రయోజనం ఉద్దేశించిన అనుష్ఠానాన్ని నిర్వహించాలంటే - ఆ పద్ధతినీ, విధానాన్ని సవివరంగా తెలుసుకోవాలి. ఆ తర్వాతనే దానిని ప్రారంభించాలి. గాయత్రీ ఉపాసన ఏ సాధకునికైనా హాని కలిగిస్తుందనే అపోహను పూర్తిగా తొలగించుకోవాలి. వాస్తవానికి - గాయత్రీ సాధన సాధకునికి ఎపుడూ ఎలాంటి నష్టమూ కలిగించదు. ఎందుకంటే ఇది సద్బుద్ధిని ఆవాహన చేసుకునే సాధన.

H H H

**సాధకుని సదాచారం దైవ కృపకు సోపానం.**

## కృష్ణావతారం-28

# వసుదేవుని యజ్ఞదీక్ష

ఋషులిట్లు స్తుతింపగా వసుదేవుడు వారిని తన హితమును గూర్చి సలహా అడిగెను. ఋషులకు చాల ఆశ్చర్యము కలిగెను. ఈయన శ్రీకృష్ణభగవానునికి చెందిన వాడైయుండి మనలను మార్గదర్శనము చేయుడని అడుగునేమి? అపుడు నారదుడు వారికిట్లు చెప్పెను - ఈ వసుదేవుడు శ్రీకృష్ణుని తన పుత్రునిగా తలంచుచున్నాడు. అందువలన ఆయన నుండి దివ్య జ్ఞానమును పొందవలెనను ఊహ కలుగుట లేదు. మానవ స్వభావమేమనగా ఏది తేలికగా లభించునో దాని గొప్పతనమును అది తెలిసికొనజాలదు -

**సన్నికర్షోహి మర్త్యానా మనాదరణ కారణమ్ ।**
**గాంగం హిత్వా యథాన్యామ్భుస్తత్రత్యో యాతి శుద్ధయే॥**

సన్నిహితముగా ఉండుట మానవుల అనాదరణమునకు కారణమగును. గంగాతీరమున నివసించువాడు గంగా జలమును వదిలి తన శుద్ధికై మరియొక తీర్థమునకు వెళ్ళును.

1. ఏది లభించినదో దానికి సరియైన విలువకట్టి ప్రయోజనమును పొందుటను మానవునకు అలవాటు చేయవలెను.

నారదుని సూచనను తెలిసికొని ఋషులు వసుదేవునకు ఇతర పౌరులకు సద్గృహస్థులకు తగిన మార్గమును ఉపదేశించిరి. సాంసారికములైన కర్తవ్యముల నుండి త్వరగా బయటపడి పరమార్థ పరాయణమగు తాపసిక జీవనమును గడపవలసినదిగా వారికి సలహానిచ్చిరి. ఋషులు ఇట్లు పలికిరి -

**విత్తైషణాం యజ్ఞ దానైర్గృహైర్దారసుతైషణామ్ ।**
**ఆత్మలోకైషణాం దేవ కాలేన విసృజేద్బుధః ।**
**గ్రామే త్యక్తైషణాః సర్వే యయుర్ధీరాస్తపోవనమ్ ॥**

వసుదేవా! ఆత్మహితపరాయణులగు పురుషులు యజ్ఞ- దానాదుల ద్వారా ధన వాంఛను, సమయ ప్రభావమును చూచి దారా పుత్రాదులయందలి వాంఛను, లోక వాంఛను వదల వలెను. ఇట్లు ధీరులగు పురుషులందరు గృహస్థ జీవనమునందే మూడు విధములగు వాంఛలను వదలి తపోవనమునకు పోవలెనను నియమమున్నది.

1. మూడు ఏషణల యొక్క (వాంఛలయొక్క) స్వరూపము ఇది.
2. సత్కార్యముల యందు ధనమును వ్యయము చేయుట వలన ధనముపై మోహముండదు.
3. కాల ప్రభావముచే భార్యా పుత్రాదులు మరియు యశస్సు గూడా ఉండవు. ఈ విషయమును గూర్చి ఆలోచించుట వలన వాని పట్ల మోహము తొలగిపోవును.

ఋషులిట్లు పలికిరి. - మానవుడు తన సాంసారిక ఋణములనే గొప్పగా భావించును. కాని వాని మీద పితృ ఋణము, ఋషి ఋణము, దేవ ఋణము గూడా ఉండును. వీనిని తీర్చుట అవసరము. ఉత్తమ సమాజ నిర్మాణమునకు తగిన వ్యక్తులను నిర్మించి పితృ గణము ద్వారా ఉపాసన, ఆత్మాన్వేషణ, తపస్సు, పరమార్థము మున్నగు వాని ద్వారా తనలో ఋషులవంటి వ్యక్తిత్వమును కలిగించుట వలన ఋషిఋణమును తీర్చికొనవచ్చును. లోకహిత కార్యములైన యజ్ఞము దానము మున్నగువాని ద్వారా ప్రపంచములో సద్భావనను, సద్విచారమును, సత్కర్మను వ్యాపింపజేసినచో దేవ ఋణము నుండి విముక్తి పొందవచ్చును.

ఋషుల ఉపదేశము విని వసుదేవుడు అక్కడే యజ్ఞ దీక్షను స్వీకరించెను. సాంసారిక బాధ్యతల నుండి బయటపడి ఆయన యజ్ఞ సంబంధమైన జీవన విధానమును అవలంబించుటకై సంకల్పము చేయుచు ఒక సార్వజనిక యజ్ఞమును చేసి తీర్థయాత్రికులందరికి ప్రేరణ నొసంగెను.

**పాత్రతను వికసించుకోనిదే దైవత్వం అణువంతయినా లభించదు.**

యజ్ఞమును పూర్తి చేసి ఋషుల ఆశీస్సులను పొంది వసుదేవుడు పరిజన సహితుడై ద్వారకకు తిరిగి వెళ్ళెను.

పరీక్షిన్మహారాజు భగవత్కథారసమును ఆస్వాదించుచూ శుకమహర్షిని ఇట్లు అడిగెను. - ఋషివరా! సాంసారిక జీవనము ధనధాన్యములను పూర్తిగా ఉపయోగించు కొనును. కాని లక్ష్మీపతి యగు భగవానుని భక్తులు అభావగ్రస్త జీవితమును, త్యాగమయ జీవితమును గడుపవలసి వచ్చుచున్నది, దీనికి కారణమేమి?

శుకమహర్షి ఇట్లు పలికెను. - రాజా! ఈ ప్రశ్ననే అశ్వమేధ యజ్ఞానంతరము యుధిష్ఠరుడు భగవానుని అడిగెను. దానికి భగవానుడిచ్చిన సమాధానమును చెప్పెదను వినుము. భగవానుడు పలికెను - ధర్మరాజా! మానవుడు నాకు చాలా ప్రియుడు. నేను వానికి తన సుఖ దుఃఖముల కొరకు, ఉత్థాన పతన ములకొరకు స్వాతంత్ర్యము నిచ్చియున్నాను. వాని సంకల్పమున నేను వానికి సహాయము చేయుదును. సాంసారిక సుఖవాంఛల కొరకు ప్రయత్నము చేయువారికి అవి లభించును. కాని నా సాన్నిహిత్యమైన అనుగ్రహమును కోరువారి దృష్టిని నేను లౌకిక సంపద నుండి తొలగించి అలౌకిక సంపదవైపు ఆకర్షింతును. వారి సంబంధమును స్వార్థపరులైన స్వజనులతో తెగగొట్టి ఆదర్శపరాయణులతో కలుపుదును.

**యస్యాహమనుగృహ్ణామి హరిష్యే తద్ధనం శనైః ।**
**తతో ధనం త్యజన్త్యస్య స్వజనాద్దుఃఖ దుఃఖితమ్ ॥**

**న యదా వితథోద్యోగో నిర్విణ్ణః స్యాద్ధనేహయా ।**
**మత్పరైః కృతమైత్రస్య కరిష్యే మదనుగ్రహమ్ ॥**

నేను ఎవనిపై కృపజూపుదునో మొదట మెల్లమెల్లగ వాని ధనమును అపహరింతును. అపుడు నిర్ధనుడైన వానిని జూచి స్వార్థపరాయణులైన వాని బంధువులు వాని కష్టమును గూడా చూడక పూర్తిగా వానిని వదిలివేయుదురు. ఇట్టి స్థితిలో అతడు ధనమునకై చేయు ప్రయత్నములకు విముఖుడై నా ఆదర్శములలో నిమగ్నులైన సత్పురుషులతో సహవాసము చేయును. అప్పుడు వానిపై నా కృప ప్రసరించును.

1. ధన సంపాదనమునకై భగవంతునిపై భక్తి చూపుట భ్రాంతి.
2. భగవానుడు భక్తునకు ఇవ్వదలచిన అలౌకిక సంపద యొక్క మహత్త్వమును తెలిసికొని ఆదర్శనిష్ఠమగు జీవితమును గడుపవలెను.

శుక మహర్షి ఇట్లు పరీక్షిన్మహారాజునకు సమాధాన మొసంగి అనంతర కథ చెప్పసాగెను. ఆయన ఇట్లు పలికెను - రాజా! శ్రీకృష్ణ భగవానుడు ప్రపంచమును దుర్మార్గులనుండి కాపాడి ధర్మమును వ్యవస్థీకరించెను. ఈ కార్యమును ఆయన ఒంటరిగ గూడ చేసెను, పాండవుల యాదవుల సాహాయ్యముతో గూడా చేసెను. పాండవులు ఆయన ఆదేశానుసారము కట్టుబాటుతో గూడిన జీవితమును గడుపసాగిరి. కాని యాదవులలో అహంకారము స్వేచ్ఛావృత్తి పెంపొందసాగెను. శ్రీకృష్ణుడు ఆలోచించెను. "నేను ఉన్నచో వీరు హద్దులో ఉందురు. తరువాత వీరందరు స్వతంత్రులై అరాచకము సృష్టింతురు". ఇట్లు ఆలోచించి ఆయన తన కర్తవ్యమును నిర్ణయించుకొని ఈ విధముగా చేసెను.

**నైవాన్యతః పరిభవో Eస్య భవేత్కథంచి**
**న్మత్సంశ్రయస్య విభవోన్నహనస్య నిత్యమ్ ।**
**అంతః కలిం యదుకులస్య విధాయ వేణు**
**స్తంబస్య వహ్నిమివ శాన్తిముపైమి ధామ ॥**

ఈ యాదవులు నన్ను ఆశ్రయించియున్నారు. ఏనుగులు గుఱ్ఱములు, జనబలము, ధన బలము మొదలగు విపులమగు వైభవమువలన అదుపులేని వారగు చున్నారు. మరియెవ్వరివలన వీరికి పరాజయము కలుగదు. వెదురు వనములో పరస్పర ఘర్షణ చేత పుట్టిన అగ్ని వలె పరస్పర సంఘర్షణచే వీరిని అంతము చేయుటవలననే శాంతి కలుగును. అటు తరువాత నేను మానవ శరీరమును వదలి నాలోకమునకు వెళ్ళెదను.

1. భగవానుడు తన కర్తవ్యములను చాల కఠినముగ పాలించును. ఆయనకు తనవారని చెప్పబడువారు గూడా ఆయన ఆదర్శములను ఉపేక్షించినచో శిక్షను తప్పక పొందెదరు. HHH


**అల్పత్వాన్ని సర్వాధిక్యంలో సమర్పించడమే ప్రార్థన.**

ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 15

# సద్గురువు సాక్షాత్కరించిన సుముహూర్తం - 2

## కబీరు మృతదేహంపై వివాదం

మరొక దృశ్యం. కబీరు హిందువులను, ముస్లింలను కూడా విమర్శిస్తున్నారు. అన్ని మతాల ఏకత్వానికి కాక, ఆయా మతాల అనుయాయుల మధ్య సామరస్యానికి ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. బాహ్య రూపాలు, కర్మకాండ, ప్రతీకలు, ఆచారాలు మున్నగువానిలో భూమికీ, ఆకాశానికీ ఉన్నంత తేడా ఉన్నప్పటికీ, అన్ని మతాలూ ఒకే సత్యాన్ని ఉద్ఘాటిస్తున్నాయి. లోపల కూర్చున్న పరమాత్మ; బయట ఆ పరమాత్మ ప్రకటీకరణ-ఇదే ఆ సత్యం.



కబీరు నిర్యాణం మహగర్‌లో జరిగిందా, కాశీలో జరిగిందా అనే విషయంలో చరిత్రకారుల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నాయి. ఆయన మరణించిన తర్వాత-హిందువులూ ముస్లింలూ తమతమ ఆచారాల ప్రకారం ఆయన అంతిమ సంస్కారం జరగాలని కోరినట్లు చెపుతారు. ఈ విషయమై వివాదం ఏర్పడింది. శవాన్ని దహనం చేయాలని హిందువులు వాదించారు. శవాన్ని ఖననం చేయాలని ముస్లింలు వాదించారు. ఇరు పక్షాల వారూ శవంపై కప్పిన వస్త్రాన్ని తొలగించగా - అక్కడ మృతదేహానికి బదులు పూల కుప్ప ఉన్నది. సగం పువ్వులు హిందువులూ, సగం పువ్వులు ముస్లింలూ తీసుకున్నారు. ఇరు మతాల వారు తమతమ సంప్రదాయాల ప్రకారం వాటిని దహనం, ఖననం చేశారు. పంచతత్వాలతో ఏర్పడిన శరీరం వేర్వేరు ప్రక్రియల ద్వారా తన మూల రూపంలోకి చేరింది. ఇది కథే కావచ్చు. ఈ కథ పై సత్యాన్ని ప్రకటిస్తుంది.

తనకు చివరి ఘడియలు వస్తున్నాయని తెలుసుకున్న కబీరు కాశీ వదలి మగహర్ వెళ్లారని కొందరు చెపుతారు. కాశీ మోక్ష నగరం అనే మూఢ నమ్మకాన్ని ఖండించడం ఈ ప్రయాణం వెనుక ఉన్న ఉద్దేశ్యమని వారు వివరిస్తారు. కాశీలో మరణించిన వారికి మోక్షం లభిస్తుందనే నమ్మకం ప్రజలలో ఉంది. ఈ గ్రుడ్డి నమ్మకం వల్ల కొందరు కాశీలో ఆత్మహత్యలు సైతం చేసుకుంటారు. అయితే-మగహర్‌లో చనిపోవడం వల్ల కబీరు కర్మ బంధనాలలో చిక్కుకుని ఉండిపోయారని ఎవరు చెపుతారు?

కబీరు జీవితంలో చరిత్రాత్మకమైన వర్ణనల కన్న వదంతులే హెచ్చుగా కనిపిస్తాయి. ఆయన ఒక ముస్లిం. సాలెవాడు ఆయనను పెంచిపోషించాడు. ఆయన ఒక బ్రాహ్మణ కన్యకు జన్మించారని చెపుతారు. ఆయన జన్మలో, పోషణలో హిందూ, ముస్లిం మతాల ముద్ర పడింది. హిందూ, ముస్లిం మతాలను పట్టి పీడిస్తున్న అంధ విశ్వాసాలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ ఖండనలకు తీవ్రమైన ప్రతిక్రియ వచ్చింది కూడా. కొందరు సంప్రదాయవాదులు ఆయనను చంపడానికి ప్రయత్నించారు. మరి కొందరు ఆయనను కాశీ నుండి బహిష్కరింపజేశారు.

కబీరు జీవితానికి సంబంధించిన అనేక సంఘటనలు శ్రీరామ్ మనో ఫలకంపైకి వెలికివచ్చాయి. ఆ సంఘటనలు వస్తూపోతూ ఉన్నాయి. కబీరు శరీరం నశించే దృశ్యంతో అవి సమాప్తమైనాయి. విద్య, వివేకముల మూల బిందువు మన ఆంతరిక చేతన అనే ఆంతరిక దృష్టి శ్రీరామ్‌లో మేలుకొన్నది. ఎన్ని శాస్త్రాలు చదివినా, తనలోపల ప్రజ్ఞ మేలుకొనకపోతే అదంతా వ్యర్థమే. మరోప్రక్క - ఆంతరిక

**అజ్ఞాన అంధకారం ఎంత దట్టంగా ఉంటే, పరమాత్మ అంత దూరంగా ఉంటాడు.**

చేతన మేలుకొంటే, చదువుకొన్నా చదువుకొనకపోయినా, అంతర్‌దృష్టి తనకు తానుగా అన్నింటినీ తెలుసుకునేందుకు సమర్థం అవుతుంది. తెలుసుకుంటుంది. కబీరుకు సంబంధించిన స్మృతులు పూర్తయినాయి. ఆయన జీవితంలోని సంఘటనలు సినిమా రీళ్లలా తిరిగి ఆగిపోయాయి.

## 'సావధాన్' చేసిన హెచ్చరిక

కొంత కాలవ్యవధి తర్వాత, చరిత్ర దృష్టిలో వంద సంవత్సరాల తర్వాత, వచ్చిన యుగం. ప్రాంతం మహారాష్ట్రం. కాలం ఔరంగజేబు పాశవిక పాలన. ఆ పాలనలో ఏ వ్యక్తికీ, ఏ వర్గానికీ తన విశ్వాసానికి అనుగుణంగా జీవించే అవకాశం లేదు. వ్యక్తులు తమ విశ్వాసాల కోసం మూల్యం చెల్లించవలసివచ్చేది. ఆ మూల్యం ధనం రూపంలో ఉండేది. దండన రూపంలో ఉండేది. వివిధ మత సంప్రదాయాలు, ముఖ్యంగా సాధన, అధ్యాత్మ విద్యల భారతీయ ధారలు బాగా క్షీణించిపోయాయి. బాగా బలహీనం అయిపోయాయి. జనం తమలో తాము కొట్లాడుకుంటున్నారు. తమను తాము సర్వనాశనం చేసుకుంటున్నారు.

అంధకారంతో, నిరాశా నిస్పృహలతో నిండిన ఈ యుగంలో మహారాష్ట్రంలో ఒక సన్యాసి ఉదయించారు. పూజ గదిలో శ్రీరామ్ సమక్షంలో ఆ సాధువు జీవనలీలలోని వివిధ దృశ్యాలు వెలికి వచ్చాయి.

వివాహ మండపంలో యువకుడు రామదాసు కూర్చొని ఉన్నాడు. ప్రక్కనే పెళ్లికూతురు. సప్తపది ప్రారంభమయ్యే ముందు పురోహితుడు కర్మకాండకోసం సిద్ధంగా ఉండాలని సూచిస్తూ, "వర వధూ సావధాన్" అని అన్నాడు. అనగా- తర్వాతి క్రియలను మెలకువతో, వాటి అర్థం గ్రహించి నిర్వహించాలి. 'సావధాన్' అనే ఆ ఉద్ఘాటన రామదాసు చేతనను మరో విధంగా హెచ్చరించింది. ఆయన అంతరాత్మ ఆయనను ఇలా ప్రబోధించింది- "దేశ, ధర్మాలు ఇంతటి దారుణ స్థితిలో పడి ఉన్నాయి. నీవేమో సంసారంలో చిక్కుకుంటున్నావు." రామదాసు వివాహ మండపం వదిలి పారిపోయాడు. సావధానుడు అయినాడు. మేలుకొన్నాడు. సన్యాస జీవితాన్ని స్వీకరించాడు. పరశురామునివలె శాస్త్రం, శస్త్రం (ఆయుధం) రెంటిలో శిక్షణ ఇవ్వడం ప్రారంభించాడు.

సమర్థ గురు రామదాసు (క్రీ.శ 1608-1692)గా ప్రఖ్యాతి పొందిన ఈ మహనీయుడు పంచవటి, నాసిక్‌లో 12 సంవత్సరాలు గాయత్రీ సాధన జరిపారు. ఆ తర్వాత తీర్థయాత్రలకు బయలుదేరారు. దేశం, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలనూ, ఆనాటి పరిస్థితులనూ అవగాహన చేసుకున్నారు. మహారాష్ట్రానికి తిరిగి వచ్చారు.

మహారాష్ట్రంలో ఆయన శరీర బలం, మనో బలం, ఆత్మ బలం కలిగిన యువకులను సంఘటితం చేసే పథకాన్ని రూపొందించారు. దానిని అమలు జరిపారు. తాను వెళ్లిన ప్రతి చోటా హనుమంతుని ఆలయాలను స్థాపించారు. ఆలయంతో పాటు వ్యాయామశాలను ప్రారంభించారు. ఆ వ్యాయామశాలలలో యువకులకు వ్యాయామం, కుస్తీ, మల్లయుద్ధం, ఆయుధాల ప్రయోగాలలో శిక్షణ ఇచ్చే ఏర్పాటు ఉండేది. ఆ వ్యాయామశాలల సంప్రదాయం దేశంలో నేటికీ కొనసాగుతోంది. ప్రజలు వాటిని రామదాసీ అఖాడాలు అని పిలుస్తున్నారు.

మరో దృశ్యం. సన్యాసి అయిన సమర్థ రామదాసు తన తల్లిని కలుసుకోడానికి వెళ్లారు. ఆయన వివాహ మండపం నుండి లేచి పారిపోయిన నాటి నుండి ఆమె ఏడ్చి ఏడ్చి నీరసించిపోయింది. కంటి చూపు పోయింది. ఆమె పదేపదే తన కుమారుణ్ణి తలచుకుని క్రుంగిపోయేది. సాధన, తీర్థయాత్రలను ముగించుకుని తిరిగి వచ్చిన వెంటనే, సమర్థ రామదాసు తన తల్లిని వెదికారు. ఆమె పాదాలకు నమస్కరించారు. ఆ అడుగుల చప్పుడుతోనే ఆమె గుర్తుపట్టింది తన కుమారుడు వచ్చాడని. ప్రేమతో కుమారుడి తల నిమిరింది. ఆమెకు కంటి చూపు తిరిగి

**తపస్సు వల్ల కుసంస్కారాలు నిర్మూలం అవుతాయి.**

వచ్చింది, తన కుమారుడు కనిపించాడు. పులకించిపోతూ ఆ తల్లి ఇలా అన్నది-

''నాయనా! నీవు ఏదో భూతాన్ని తెచ్చినట్లు అనిపిస్తోంది. ఆ భూతం నాకు కంటిచూపు తిరిగి తెచ్చింది. మరి ఆ భూతం ఏదో నాకు చెప్పవూ.''

## సమర్థులు నిర్మించిన సంఘటన

తల్లి ఆశీస్సులు పొంది, సమర్థ రామదాసు బయలుదేరారు. సాధు-సన్యాసులనూ, గృహస్థులనూ సంఘటితం చేయడంలో నిమగ్నులు అయినారు. ఆయన మార్గదర్శనంలో ఎందరో మహావీరులు స్వాతంత్ర్యం కోసం, జాతి గౌరవాన్ని తిరిగి తేవడం కోసం సంఘర్షణ జరిపారు. వారిలో అగ్రగణ్యుడు ఛత్రపతి శివాజీ. శివాజీకి దీక్ష ఇవ్వడం, జాతి ఉద్ధరణకు ఆయనను అంకితం చేయడం, అధర్మాన్ని నాశనం చేయడానికి అన్ని మార్గాలను అవలంబించడంలో ఆయనకు ప్రేరణ ఇవ్వడం - ఈ దృశ్యాలన్నీ శ్రీరామ్ మనోఫలకంపైకి వెలికివచ్చాయి.

ఒక దృశ్యం. సమర్థ రామదాసు శివాజీ వద్దకు వెళ్లి భిక్ష అడిగారు. అప్పటికే ఛత్రపతి సామ్రాజ్యాన్ని స్థాపించి ఉన్నారు. గురువుగారి "జయ జయ రఘువీర సమర్థ" నాదం విన్న శివాజీ పరుగుపరుగున వచ్చారు. గురువుగారి జోలెలో ఏమి సమర్పించాలని క్షణకాలం ఆలోచించారు. క్షణంలోనే నిర్ణయించుకున్నారు. కాగితం, కలం తీసుకుని సంకల్ప పత్రం వ్రాశారు. 'రాజ్యమంతా మీదే. మీరే పాలించండి'- అంటూ సంకల్పం తీసుకున్నారు.

అందుకు గురువుగారు ఇలా అన్నారు-

''అవును. నేటి నుండీ ఈ రాజ్యం నాదే. నా వారసత్వంగా పరిగణించి, నా తరఫున నీవు పరిపాలన సాగించు. ఈ రాజ్యాన్ని పెంచు. ప్రజల సుఖ సమృద్ధులను పెంపొందించు. జాతి జాగరణకై నీ ఆహుతి ఇవ్వు.''

ఆ తర్వాత - ధర్మం ప్రకారం రాజ్యాన్ని ఎలా పాలించాలో, అందులోని ప్రతి విషయాన్ని స్పష్టం చేస్తూ ఒక ప్రవచనం. ఆ ప్రవచనం ప్రజారంజనం, జన కళ్యాణముల బాధ్యతను నిర్వహించే పాలకులందరికీ ధర్మ విధానం.

ఆ తర్వాత సమర్థ గురువు శిష్యునికి ఒక ప్రార్థన నేర్పసాగారు. ఆ ప్రార్థనలో దేవతలందరికీ నమస్కరించారు. వారిలో ఇమిడి ఉన్న అద్వైత తత్వాన్ని స్మరించారు. ఈ ప్రార్థన సమర్థ రామదాసు రచించిన 'దాస బోధ'లో కూడా ఉంది. ఆ ప్రార్థన ఆ దృశ్యంలో నినదిస్తోంది-శ్రీరామ్ స్వయంగా గానం చేస్తున్నట్లు.

## విలక్షణమైన ప్రార్థన

"ఓ గజవదనా! నీకు ప్రణామం. నీ మహిమకు అవధి లేదు. నీవు అందరికీ విద్యనూ, బుద్ధినీ ఇస్తావు.

"భగవతి సరస్వతికి ప్రణామం. నీ వల్లనే వాణికి స్ఫురణ వస్తుంది. బహు కొద్ది మంది మాత్రమే నీ స్వరూపాన్ని సాక్షికంగా గుర్తించగలుగుతారు.

"చతురాననా! నీవు ధన్యుడవు. నీవే ఈ సృష్టి చేశావు. శాస్త్రాలన్నింటినీ వెలువరించావు.

"ఓ విష్ణుమూర్తీ! నీవు ధన్యుడవు. నీవు అందరినీ పాలిస్తావు.

"శివునికి ప్రణామం. నీవు నిరంతరం రామనామాన్ని జపిస్తూ ఉంటావు. నీ వరాలకు అంతం లేదు.

''ఓ ఇంద్రదేవా! నీవు ధన్యుడవు. ధర్మం, అధర్మం-అన్నీ నీకు తెలుసు. వాటిని అర్థం చేసుకునే శక్తి ఇవ్వు.

"మహాబలవంతుడైన ఓ హనుమాన్! నీవు ధన్యుడవు. మమ్మల్ని కూడా బలానికి ఉపాసకులను చెయ్యి.

'ఓ క్షేత్రపాలుడా! నీవు ఎందరికో ముక్తిమార్గంలో పయనించే ప్రేరణ ఇచ్చావు.

**ప్రతి వ్యక్తీ పరమేశ్వరుని ప్రతిమ.**

"ఓ పాండురంగా! నీ ఆలయంలో సదా భగవత్ కథా గానం నినదిస్తూ ఉంటుంది.

"రామ-కృష్ణ మున్నగు అవతారాల మహిమ అపారం. వారివల్లనే ఎందరెందరో ఉపాసనలో నిమగ్నులు అయినారు.

"అయితే - ఈ దేవతలందరికీ మూలం ఆ పరమాత్మ. భూమండలంలోని ప్రజలంతా అంతరాత్మగా ఆ పరమాత్మనే పొందుతున్నారు. ఆ పరమాత్మయే అనేక శక్తులుగా వ్యక్తమయింది. అన్ని వైభవాలనూ అనుభవించేది ఆ పరమాత్మయే."

ప్రార్థన సుదీర్ఘమైనది. మన లోపలా, బయటా ప్రపంచంలో వ్యాపించిన వివిధ శక్తిరూపాల ఆధ్యాత్మిక పక్షాన్ని అందులో సంబోధించారు.

ప్రార్థన పూర్తయిన తర్వాత సమర్థ రామదాసు తమ ఇహలోక లీలను ఉపసంహరించుకున్నారు.

దివ్యజీవనంలోని ఆంతరిక సత్యాన్ని స్పష్టంగా వ్యక్తం చేయడం, తమ కర్తవ్యాల పాలన, ధర్మ-సేవనం, లోకకళ్యాణములలోని వివిధ కార్యకలాపాల దృశ్యాలు చూపబడ్డాయి. ఆయన లీలా విస్తరణలోని సందేశం జగత్తులో ధర్మ ప్రతిష్ఠ. బలీయమైన ధర్మాన్ని బలీయంగా ప్రతిష్ఠించడం.

## మూడవ జన్మ

జ్ఞాపకాలు పొరలు విడివడుతున్నాయి.

మరో దృశ్యం. కలకత్తా దగ్గర ఉన్న స్థలం. సమయం 19 శతాబ్దం మొదటి సగం. శ్రీరామ్‌కు ఈ అనుభూతుల సమయంలో ఎంత వయస్సు ఉందో అపుడు అంతే వయస్సు ఉండవచ్చు. దక్షిణేశ్వర ఆలయంలోకి తన అన్నగారితో పాటు వచ్చి నివసించాడు ఒక యువకుడు. పేరు రామకృష్ణ. అది కాళీమాత ఆలయం. రాణి రాసమణి దాన్ని నిర్మించింది. ఆమె జాలరి కులం మహిళ. ఆ కులాన్ని తక్కువ కులంగా పరిగణించేవారు. శ్రద్ధా భక్తులతో పొంగిపొరలే హృదయం ఉన్నప్పటికీ - ఆమె ఆనాటి ఉన్నత వర్గాల దౌష్ట్యాలను సహించవలసివచ్చేది.

జనం ఆమె ఆలయాన్ని వ్యతిరేకించారు. ఆ ఆలయంలో కాళి విగ్రహ ప్రతిష్ఠ, పూజ జరగకూడదని వారన్నారు. విద్వాంసులు, పండితుల వ్యతిరేకత వల్ల ఎవ్వరూ ఆ ఆలయంలో పూజ జరిపే బాధ్యతను స్వీకరించలేదు. రాణి రాసమణి పెక్కు ఆశ్రమాల, గురుకులాల, విద్యాపీఠాల తలుపులు తట్టింది. పండితులను ప్రార్థించింది. కానీ, ఏ ఒక్కరి హృదయమూ కరగలేదు. కలకత్తా సమీపంలోని కామార్పుకుర్ గ్రామానికి చెందిన యువకుడైన ఒక బ్రాహ్మణ పండితుడు రామకుమార్ పూజ చేయడానికి అంగీకరించాడు. ఆయన బంధువర్గమంతా అందుకు ఆయనను తీవ్రంగా వ్యతిరేకించింది.

## కాళీమాతతో సజీవ సంపర్కం

రామకృష్ణ కూడా తన అన్నగారు రామ్‌కుమార్ వద్దకు వచ్చి నివసించసాగారు. కూర్చుని కాళీమాత విగ్రహాన్ని అలా చూస్తూ తన్మయులై ఉండిపోయేవారు. ఈయన భక్తిశ్రద్ధలకు పరవశుడైన అన్నగారు తాను సంస్కృత పాఠశాల బాధ్యతను చేపట్టి, పూజ బాధ్యతను రామకృష్ణకు అప్పగించాడు. కొత్త పూజారి పూజా విధానం విచిత్రంగా ఉండేది. ఆయన ఆ విగ్రహాన్ని కాళీమాతగానే భావించి వ్యవహరించేవారు. ఏదో దైవ విగ్రహానికి కాక - సజీవమైన మాతకే సేవ చేస్తూన్నట్లు పూజ చేసేవారు. ఆ మాత జవాబు చెపుతూన్నట్లు ఆమెతో మాట్లాడేవారు.

కాళీమాత పూజ, సాధన చేస్తూ రామకృష్ణ ఇహలోకాన్ని దాదాపుగా విస్మరించారు. ఆయన సాధన గురించీ, సమాధి గురించీ వార్తలు దూర దూరాలకు వ్యాపించాయి. ఆలయంలో భక్తుల సమూహం పెరుగసాగింది. భక్తునిగా, సిద్ధి పొందిన సంత్‌గా ప్రఖ్యాతి పెరుగుతూన్న రోజులలో రామకృష్ణకు వివాహం జరిగింది. వయస్సులో ఆయన భార్య ఆయన కన్న 16 సంవత్సరాలు చిన్నది. అయితే ఈ వయో

**ఏది సముచితమో తెలిసి కూడా అది చేయకపోవడం సాహస రాహిత్యం.**

భేదానికి వివాహంతో సంబంధం లేదు. ఆ వివాహం మామూలు గృహస్థ జీవితం గడపడానికి జరిగింది కాదు. అనంతర కాలంలో రామకృష్ణుని చుట్టూ శిష్యులతో, సాధకులతో కూడిన ఒక పెద్ద బృందం ఏర్పడింది. వారి యోగ క్షేమాలు చూడడానికీ, వారికి మాతృ వాత్సల్యాన్ని పంచి ఇవ్వడానికీ జరిగింది ఆ వివాహం.

సాధకుల చిన్నచిన్న అవసరాలను గురించి ఆలోచించే స్థితిలో రామకృష్ణ ఉండేవారు కారు. మొదటి రోజులలోనే ఆయన తరచు భావ సమాధిలో ఉండిపోయేవారు. భావసమాధి స్థితిలో ఆయన శరీరం పూర్తిగా స్పృహ కోల్పోయి ఉండేది. శరీరంలో ఎలాంటి కదలికా ఉండేది కాదు. ఆయన భావ సమాధి విషయం తెలియకపోతే, చూచేవాళ్లు ఆ శరీరం మృతదేహమే అనుకోవచ్చు. ఆ స్థితిలో శారదా మాతయే రామకృష్ణను కనిపెట్టుకుని ఉండేవారు.

ఒక చేతిలో రూపాయి, మరో చేతిలో మట్టిముద్ద తీసుకుని రెంటినీ గంగలో విసరివేసే విచిత్ర లీల(టాకామాటీలో జరిగింది) ఆ రోజుల్లోనే జరిగింది. ఆయనను గురువుగా స్వీకరించాలని రాణి రాసమణి అనుకున్నది. అలా ఎంపిక చేయడానికి ముందు ఆమె ఒక పరీక్ష జరిపింది. ఆయనకు కామినీ, కాంచనముల ప్రలోభం చూపింది. ఆయనను మోహపరచడానికి సుందరులను పంపింది. వారు రామకృష్ణను తండ్రిగా పరిగణించారు. 'మమ్మల్ని క్షమించండి గురువుగారూ'- అంటూ వారు రాణి రాసమణి వద్దకు తిరిగి వచ్చారు.

రాణి రాసమణి ఒక రోజున ఆయన వెళ్లే దారిలో బంగారు నాణెములు వెదజల్లి ఉంచింది. ఆయనతో పాటు ఆ దారిలో నడవసాగింది. ఆమె ఆ నాణెముల వైపు సైగ చేసి చూపింది. కానీ, 'అవి కూడా మాత ప్రసాదమే, మట్టిలా అవీ నేల మీద పడి ఉన్నాయి'- అంటూ ఆయన ముందుకు సాగారు.

మరోసారి వస్త్రాలలో దాచి ఆమె ఆయనకు బంగారు నాణెములు ఇచ్చింది. ఆ వస్త్రాన్ని తాకగానే రామకృష్ణ కంపించిపోయారు. కాలుతూన్న ఇనుపముక్కను తాకినట్లు.

ఆ తర్వాత ఆయనకు మరే పరీక్షా జరగలేదు. రాణి రాసమణి ఆయనను తన గురువుగా స్వీకరించింది.

H H H

## వీరవనితను గౌరవించు

అమెరికా సంయుక్త రాష్ట్రాలు (యూనియన్), భాగస్వామ్య పక్షాల మధ్య ఆరోజుల్లో గృహ యుద్ధం నడుస్తున్నది. అబ్రహం లింకన్ యూనియన్ పార్టీలో ఉన్నాడు. గృహ యుద్ధంలో విరోధి పక్షంలోని అనేక మంది బందీలయినారు. లింకన్ చేతిలో అధికారమున్నది. గెలుపు ఆయన పక్షముననే ఉన్నది. విరోధి పక్షానికి చెందిన ఒక యువతి బంధించబడిన తన సోదరుని కలుసుకోవటానికి ప్రయత్నిస్తున్నది. అధికారులు అందుకు అనుమతి ఇచ్చుట లేదు. చివరకు ఆమె ప్రెసిడెంటు వద్దకు చేరుకొని తన అభిప్రాయం తెలియజేసింది.

లింకన్ ఆమెను అడిగాడు-"నీవు దేశ భక్తురాలివని నా విశ్వాసం'. యువతి నిర్భయురాలై సమాధానమిచ్చింది-"నేను నా దేశమైన వర్జీనియా పట్ల భక్తి కలిగి ఉన్నాను". వర్జీనియా విరోధి పక్షం. విరోధులకు సౌకర్యాలు కల్పిస్తే దానివలన సంకటం కలుగవచ్చుననే అనుమాన మున్నప్పుడు వారికి సౌకర్యాలు ఎందుకు కలిగించాలి అనే ప్రశ్న ఉదయించింది. లింకన్ కొంతసేపు ఆలోచించాడు ఒక చీటీ వ్రాసి ఇచ్చి జైలుకు వెళ్లి సోదరుణ్ణి కలుసుకోమని చెప్పాడు.

అధికారులు ఈ ఉదారతకు కారణమేమని ప్రెసిడెంటును అడిగారు. దానికి ఆయన చెప్పాడు-"నిజాయితీపరుడైన శత్రువు వలన నష్టమునకు అవకాశముండదు. ఈ యువతిలో సౌజన్యం, సాహసం ఉన్నాయి. ఏ దృష్టిలోనైనా అభినందనీయురాలే. ఆమెను దండించే బదులు గౌరవించాలి. ఆమె నుండి నేర్చుకోవాలి".

- ప్రజ్ఞాపురాణం నుండి

**సూత్రబద్ధతయే సౌందర్యం. అదే కళా కౌశలం.**

నావారితో నా మాట

# మహోద్యమం సాగిస్తున్న విరాట్ యాత్ర - 3

ప్రస్తుత మహా విప్లవాన్ని ఇద్దరు వస్తాదుల కుస్తీగా పరమ పూజ్య గురుదేవులు వర్ణించారు. ఈ కుస్తీ అసురత్వానికీ, దేవత్వానికీ మధ్య జరుగుతోంది. దేవత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవకూడదని అసురత్వం కోరుతోంది. తన పెత్తనమే సాగాలని కోరుతోంది. మరోప్రక్క-యుగసంధి సమయం అంతిమ దశకు చేరుకున్న ఈ దశలో అసురత్వాన్ని మట్టి కరిపించడానికి దేవత్వం సర్వసన్నద్ధంగా ఉంది.

ఇద్దరు వస్తాదులు కుస్తీ పడుతూన్నపుడు ఒకోసారి అనిపిస్తుంది-ఎదటి వస్తాదు రెండవ వస్తాదును పడగొట్టాడనీ, అతడు ఇక లేవలేడనీ, అతడు ఓడిపోయాడనీ. కానీ, ఆతర్వాత అలా జరగదు. ఆ వస్తాదు వద్దకూడా ఏదో ఒక అద్భుతమైన పట్టు ఉంటుంది. దానిని అతడు చివరి క్షణంలో ప్రయోగిస్తాడు. అజేయుడుగా పరిగణించబడిన తన ప్రత్యర్థిని చివరికి అతడు ఆ పట్టుతో ఓడిస్తాడు.

నేడు అసురత్వం పెత్తనం చెలాయిస్తోంది. దీన్ని చూచినపుడు-దేవత్వం ఇక ఎన్నడూ పైకి లేవలేదని అనిపిస్తుంది. కానీ, వాస్తవం అది కాదు. దేవత్వం తన పూర్తి బలాన్ని ప్రయోగించి అసురత్వాన్ని చావుదెబ్బ కొడుతుంది. చివరికి అసురత్వం సర్వనాశనం అవుతుంది. దేవత్వం అంతటా విజృంభిస్తుంది.

ఈ ప్రతిపాదనలో అతి ప్రముఖమైన అంశం ఒకటి ఉంది. అది పరమపూజ్య గురుదేవుల భావాత్మక దృష్టి. ఆ దృష్టిలో వారి దివ్య దృష్టి ఇమిడి ఉంది. వారు 1989-90లో చెప్పినదే నేడు జరుగుతోంది. నిరాశాత్మక దృక్పథం కలిగినవారు ఒకోసారి అసురత్వ విజయాల పట్ల ప్రభావితులు అవుతున్నారు. అయితే ఆ విజయాలు క్షణికములు. చివరికి అసురత్వం ఓడిపోతుంది. దేవత్వం ఆధిపత్యం వహిస్తుంది.

### పరమపూజ్య గురుదేవుల దివ్య దర్శనం

పరమపూజ్య గురుదేవులు అఖండజ్యోతి, జూలై 1984 సంచికలో ఒక విశిష్టమైన వ్యాసపరంపరను ప్రచురించారు. విధ్వంసం ఓడిపోయింది. సృజన శక్తి జయించింది. ప్రపంచ యుద్ధం రాదు. ప్రజ్ఞాయుగంలో సమాజం ఎలా ఉంటుంది?- అనే విషయాలను వారా వ్యాసాలలో ప్రతిపాదించారు. మనీషులను కదిపివేసే, కుదిపివేసే ప్రతిపాదనలు అవి.

నేడు సైతం ఆ వ్యాసాలను చదివితే - ఒక ద్రష్ట, ఒక మహాపురుషుడు భవిష్యత్తు గర్భంలోకి ప్రవేశించి అంతా చూచారని మనకు అనిపిస్తుంది. విశాలమైన రష్యా సామ్రాజ్యం ముక్కచెక్కలు కావడం, అమెరికా వారి 'స్టార్ వార్' విఫలం కావడం, బెర్లిన్ గోడ కూలిపోవడం, ఒక ఉదారవాదం ఉదయించడం వంటి సంఘటనలన్నీ ఈ విషయాన్నే చెపుతున్నాయి. ప్రజ్ఞాయుగంలో సమాజం ఎలా ఆదర్శాలను స్థాపన చేస్తుంది, రానున్న 30 సంవత్సరాలలో (1984-2015) ఎలా పరివర్తన కానవస్తుంది-ఇదంతా ఆయన సూచించినట్లే జరిగింది, జరుగుతోంది.

ఇదంతా చూచినపుడు - యుగపరివర్తన తథ్యమనీ, మనం నిరాశ చెందకూడదనీ, మన సత్ప్రయత్నాలలో నిమగ్నం కావాలనీ అనిపిస్తుంది. ప్రపంచమంతా భావ విప్లవం పరిధిలోకి క్రమంగా వస్తూన్నదని విశ్వసించి, మనం ముందుకు పోవాలి. అఖండ జ్యోతిలో ఈ వ్యాసాల రచన సాగుతూన్నపుడు పరమపూజ్య గురుదేవులు సూక్ష్మీకరణ సాధనలో ఉన్నారనీ, అయిదుగురు వీరభద్రులను నిర్మాణం చేస్తున్నారనీ మనం గుర్తుంచుకోవాలి.

**భగవానుని కంపెనీలో భాగస్వామివి కా. అన్నింటినీ పొందు.**

## నవయుగపు మత్స్యావతారం

యుగ పరివర్తనను సంకల్పించిన మన మిషన్ ఒక దైవీ ఉద్యమమని పరమపూజ్య గురుదేవులు పలుమారులు నొక్కి చెప్పారు. మన మిషన్ నవయుగపు మత్స్యావతారం. అవతారాల లీలలలో భాగంగా భగవానుడు చిన్న చేప రూపంలో అవతరించాడు. క్రమంగా విరాట్ రూపం ధరించసాగాడు. జల ప్రళయంలో వేద జ్ఞానాన్ని పరిరక్షించాడు. సరిగా అలాగే గాయత్రీ పరివార్ ప్రస్తుత నవయుగంలోని మత్స్యావతారం. ఇది విరాట్ రూపం ధరిస్తోంది. నేడు తొమ్మిది కోట్ల వ్యక్తుల వరకు ఇది విస్తరించింది. అరణ్యంలో రగిలిన అగ్ని దావానలంగా, బడబాగ్నిగా వ్యాపిస్తుంది. సరిగా ఆ విధంగా - భావ విప్లవపు అగ్ని జ్వాల సమాజమంతటా, విశ్వమంతటా వ్యాపిస్తుంది.

## గాయత్రీ మహావిద్య పునరుద్ధరణ ఒక మహత్తర సాఫల్యం

మన గురు సత్తా గతంలో సాధించిన సాఫల్యాలను బట్టి ఈ విషయాన్ని అంచనా వేయవచ్చు.

మొట్టమొదట 'గాయత్రీ మహావిద్య' పునరుద్ధరణ జరిగింది. అది వ్యక్తి వ్యక్తికీ అందుబాటులోనికి వచ్చింది. గతంలో ఆ జ్ఞానం కొద్దిమంది పండితులకే పరిమితం అయింది. మహామండలేశ్వరులు, శంకరాచార్యులకే పరిమితం అయింది. పురుషులకూ, బ్రాహ్మణులకూ పరిమితం అయింది. మరో లింగంవారికీ, కులం వారికీ, వర్ణం వారికీ ఆ జ్ఞానం నిషేధించబడింది. నేడా జ్ఞానం అందరికీ అందింది. కుల విభేదాలను ఛేదిస్తూ లక్షలాది స్త్రీ పురుషులు పరమపూజ్య గురుదేవుల సంరక్షణలో గాయత్రీ ఉపాసన ప్రారంభించారు. యజ్ఞం చేయడం, చేయించడం ప్రారంభించారు. అందరూ బ్రాహ్మణత్వాన్ని ఆర్జించారు. అందరూ వీర్యవంతులూ, ఓజస్సూ తేజస్సూ కలిగినవారూ అయినారు.

గాయత్రి జపం చేస్తే స్త్రీలు గొడ్రాళ్లు అవుతారనీ, వారిపై విపత్తు విరుచుకుపడుతుందనీ చెప్పేవారు. కానీ, అలాంటిదేమీ జరగలేదు. వారికి చక్కని సంతానం కలిగింది. వారు మిషన్‌కు తమ ప్రతిభను సమర్పించిన వ్యక్తులుగా రూపొందారు.

ఇలా గాయత్రీమయ జీవితాన్ని గడపడం, తద్వారా లౌకిక, ఆధ్యాత్మిక సుఖాన్ని పొందడం అందరికీ సులభం అయింది. ఎందుకంటే - ఒక సమర్థ సత్తా అందరి యోగ క్షేమాల భారాన్ని తన మీద వేసుకున్నారు. గాయత్రీ మంత్రాన్ని బిగ్గరగా పఠించకూడదని గతంలో చెప్పేవారు. కానీ, నేడు ఆ మంత్ర సంకీర్తన, పఠనం ప్రతి చోటా జరుగుతోంది. గాయత్రి సిడిలు, క్యాసెట్లు ప్రతి చోటా దొరుకుతున్నాయి. అందరి సద్బుద్ధికీ, ఉజ్వల భవిష్యత్తుకూ ప్రార్థనగా గాయత్రీ మంత్రాన్ని అన్ని సంప్రదాయాలూ స్వీకరించాయి. దేశమంతటిలో, ప్రపంచంలోని 100పైగా దేశాలలో గత 60 సంవత్సరాలుగా గాయత్రి చేతన వేగంగా విస్తరించింది. ఆ విస్తరణ మేరకు సుఖశాంతులు, సమృద్ధి పెరిగాయి.

## మహోద్యమంగా యజ్ఞం

అంతే కాదు. భారతీయ సంస్కృతికి సంరక్షక శక్తిగా, విశ్వానికి నాభిగా పరిగణించబడే యజ్ఞం ఒక మహోద్యమంగా రూపొందింది. ఎందరెందరో వ్యక్తులు యజ్ఞీయ జీవితాన్ని గడుపుతున్నారు. ఇంతముందు యజ్ఞం కర్మకాండలు చేసే కొందరు బ్రాహ్మణులకే పరిమితం అయింది. వారే యజ్ఞాలు చేయించేవారు. కలియుగం అంత్యదశకు చేరుకోగానే, యజ్ఞం పురాతనమైన తన సౌమ్య రూపాన్ని కోల్పోయింది. కోరికలు తీర్చుకునేందుకు దేవతల పేరిట యజ్ఞాలు జరపడం ప్రారంభమయింది. అంతే కాదు. యజ్ఞాలకయ్యే ఖర్చు బాగా పెరిగిపోయింది. అవి మామూలు వ్యక్తికి అందుబాటులో లేకుండా పోయాయి. ఈ యజ్ఞాలలో రకరకాల వికృతులు చోటు చేసుకున్నాయి. భౌతిక

**ఆలోచన విత్తనం, కర్మ వృక్షం.**

ప్రయోజనాల కోసం చిత్తం వచ్చినట్టు యజ్ఞాలు చేయసాగారు. యజ్ఞం ప్రాణవిహీనం అయిపోయింది. పరమపూజ్య గురుదేవులు విశుద్ధమైన యజ్ఞ సంప్రదాయాన్ని పునరుద్ధరించారు.

యుగ ఋషి యాజ్ఞవల్క్య పరంపరకు తిరిగి ప్రాణం పోశారు. యజ్ఞంలోని జ్ఞాన విజ్ఞానాలను అందరికీ అందించారు. అందరూ యజ్ఞం చేయవచ్చునని వారు చెప్పారు. యజ్ఞం వల్ల కాలుష్యం ఏర్పడదనీ, పైగా కాలుష్యం నశిస్తుందనీ చెప్పారు. ఇందుకు ప్రమాణం చూపడానికై ఒక యజ్ఞ విజ్ఞాన పరిశోధనాలయాన్ని స్థాపించారు. పర్యావరణ సంతులనానికీ, సముచితమైన రోగరహితమైన జీవనానికీ మూలాధారం యజ్ఞమని వైజ్ఞానిక పరిశోధనల ద్వారా, ప్రతిపాదనల ద్వారా వారు నిరూపించారు. దీనితో పాటు యజ్ఞం దైవీ ప్రయోజనాలను కూడా తీర్చుతుంది. సరళమైన పద్ధతిలో యజ్ఞాలు చేయించేందుకు వివిధ కులాల స్త్రీ పురుషులకు వారు శిక్షణ ఇచ్చారు. తద్వారా యజ్ఞానికి ఒక మహత్తర స్థానాన్ని కల్పించారు.

అశ్వమేధ విజ్ఞానంపై ఆధారపడిన కర్మకాండ శైలిని ఆయన వికసింపజేశారు. బ్రహ్మవాదినులైన సోదరీమణులు ఆ ప్రకారం అశ్వమేధ యజ్ఞాలను నిర్వహించి చూపారు. అంతే కాదు. వారు దీపయజ్ఞ ప్రక్రియను నిర్మాణం చేశారు. ఆ దీపయజ్ఞాలలో లక్షల, కోట్ల మంది భావనాత్మకంగా పాల్గొనడానికి అవకాశం ఉంది. సంస్కార పూర్వకములు, ఉద్యమ పూర్వకములూ, సామాన్యములూ అయిన దీప యజ్ఞములు దేశ విదేశాలలో భారీ యెత్తున జరుగుతున్నాయి.

## యజ్ఞీయ జీవనానికి ప్రాచుర్యం

యజ్ఞం జీవితాన్ని గడిపే విధానం; నిష్కామ భావంతో జీవిస్తూ తమ సంస్కారాలను నిర్మించుకునే ప్రక్రియ. ఈ అర్థం చెప్పి, వారు లక్షలాది వ్యక్తుల జీవితాలలో ఈ యజ్ఞీయ భావనను ప్రవేశపెట్టారు. యజ్ఞం కోసం కాకుండా చేసే కర్మలన్నీ బంధనానికి కారణాలు అవుతాయి(**యజ్ఞార్థాత్ కర్మణోన్యత్ర లోకోయం కర్మబంధనః**)-అనే గీతా వాక్యాన్ని వారు తమ జీవితంతో ప్రారంభించి కోట్లాది వ్యక్తుల జీవితాలలో సార్థకం చేశారు. అనగా- ఆ భావన వారి జీవితాలలో అమలు జరిగింది. యజ్ఞీయ జీవితం గడపడం, దానం (సమయ దానం, అంశదానం, విభూతిదానం, యశదానం), దేవ పూజనం (వ్యక్తిత్వాన్ని సంస్కరించుకోవడం), సంగతికరణం(సమీకరణ, సంఘటన)-వంటి యజ్ఞంలోని అర్థాలను జీవితంలో అన్వయించుకోవడం ఒక మామూలు ప్రక్రియ అయింది. ఆ ప్రక్రియ ఎందరో వ్యక్తులను రూపుదిద్దింది.

## జీవించే కళగా అధ్యాత్మ

అధ్యాత్మ అనేది సంజీవనీ విద్య. అది జీవించే కళ. దానిని ఆ ప్రాతిపదికమీదనే అర్థం చేసుకోవాలి. యుగ ఋషి చేసిన ఈ వ్యాఖ్య ప్రజల హృదయాలలో ప్రతిష్ఠితం అయింది. ఇది ఒక మహత్తర సాఫల్యం. దురదృష్టవశాత్తు గతంలో అధ్యాత్మను పలాయనవాదంతో జోడించారు. ధార్మిక వ్యవస్థను వికృతం చేశారు. జీవితంలో విజ్ఞాన సమ్మతమైన అధ్యాత్మ అమలు జరిగితే ఎలాంటి విప్లవాత్మక ఫలితాలు కలుగుతాయో ఆచార్యశ్రీ నిరూపించారు. అంతే కాదు. మతంలో మూడు తత్వాలు ఉన్నాయి- తత్వమీమాంస (మెటాఫిజిక్స్), నీతి శాస్త్రం(ఎథిక్స్), అధ్యాత్మ (స్పిరిట్యుయాలిటీ). వారు ఈ మూడింటినీ యుగానికి అనుగుణంగా వ్యాఖ్యానించారు. నేటి యువతరం కోసం వాటిని నిత్యనూతనంగా ప్రతిపాదించారు. వీటిపై విరాట్ సాహిత్యాన్ని సృష్టించారు. యుగఋషి పరమపూజ్య గురుదేవులు సుమారు 3000 గ్రంథాలు రచించారు. ఈ గ్రంథాలు అధ్యాత్మను సమాజంలో ప్రతిష్ఠించాయి. 1945 నుండి 2000 వరకు ఈ అధ్యాత్మ చింతన జనమానసానికి కొత్త దిశను ప్రదానం చేసింది. ఉపాసనకు పూరకం ఆరాధన. పరమార్థ ప్రధానమైన సమాజసేవ జరపని పక్షంలో వ్యక్తిగతమైన సాధనాత్మక పురుషార్థం ఏకాకి అవుతుంది.

**అధ్యాత్మ అంటే ఆత్మ సంస్కరణ, ఆత్మక్షాళన.**

యుగఋషి ఈ సత్యాన్నికూడా ప్రజా హృదయంలో ప్రతిష్ఠించారు. పూజ్యవరులు సమాజానికి ఇచ్చిన గొప్ప వరం ఇది. ఎందుకంటే - ఒక వయస్సు వచ్చిన తర్వాతనే, సుఖ భోగాలను పూర్తిగా అనుభవించిన తర్వాతనే మతంవైపు మళ్లాలని గతంలో భావించబడుతూ వచ్చింది.

పరమపూజ్య గురుదేవులు అధ్యాత్మకు ప్రగతిశీలమైన వ్యాఖ్య ఇచ్చారు. అధ్యాత్మను ప్రతి శ్వాసలో, 24 గంటలూ జీవించాలని వారు బోధించారు. యువశక్తి ఈ బోధనను అందుకున్నది. లక్షలాది, కోట్లాది మిగతా వయస్సువారు కూడ అందుకున్నారు. సంజీవనీ సాధనగా అధ్యాత్మ సాధన, శిక్షణ వివిధ స్థలాలలో జరుగసాగాయి. లక్షలాది వ్యక్తులు శాంతికుంజ్ సాధన ఆరణ్యకంలో భాగస్వాములు అయినారు. అరచేతిలోని ఉసిరి కాయలవలె సాధకులంతా ఆ సాధన ఫలితాలను పొందారు. వారి జీవితాలు సంస్కరించబడ్డాయి. చూస్తూ ఉండగానే, ఇహపర సుఖాలూ, ప్రయోజనాలూ వారికి హస్తగతాలు అయినాయి.

### యుగధర్మంగా సమయదానం

సమయదానాన్ని యుగధర్మంగా ప్రతిష్ఠించడం యుగఋషి సాధించిన మరో మహత్తర సాఫల్యం. సమయం కూడ ఒక మూలధనం. సరైన పద్ధతిలో వినియోగిస్తే, దానిని పరమార్థం కోసం అంకితం చేయగలుగుతాం. ఈ పాఠాన్ని లక్షలాదిమంది నేర్చుకున్నారు. రోజుకు రెండు గంటలు, లేదా వారానికి ఒక రోజు, లేదా సంవత్సరంలో ఒకటి రెండు నెలలు మిషన్ కోసం, మిషన్‌లోని పారమార్థిక కార్యక్రమాల కోసం ఇచ్చే వ్యక్తులు ఎందరెందరో తయారైనారు.

ఈ మిషన్‌కు ఉన్న అతివిలువైన మూలధనం సమయదానం. సమయదానమే అతిపెద్ద ప్రజాసేవకుల బృందాన్ని నిర్మాణం చేసింది. పలువురు జీవనదానం చేశారు. మహాకాలుని ఈ విశిష్ట కార్యంకోసం కేంద్రానికి తమను తాము సమర్పించుకున్నారు. స్థానిక స్థాయిలో, క్షేత్రం నిర్దేశం ప్రకారం ఇతర స్థలాలకు వెళ్ళి యుగఋషి సందేశాన్ని ప్రజలకు అందిస్తున్నారు. వేతనాలు తీసుకునే ఉద్యోగులకు బదులు స్వచ్ఛంద సమయదానుల వ్యవస్థ ఇంత విరాట్ ఉద్యమాన్ని నిర్వహించగలుగుతుందా? ఇందుకు సజీవమైన నమూనాలు మన అఖిలవిశ్వ గాయత్రీ పరివార్, ప్రజ్ఞా అభియాన్, యుగనిర్మాణ్ మిషన్.

H H H

## సాహసంతో వితంతు వివాహం

స్త్రీలను స్వావలంబులుగా చేయుటకు, ఉన్నతులుగా చేయుటకు తమ సంపద, సామర్థ్యాలను సదుపయోగం చేసిన వారిలో పురుషులు కొందరున్నారు. అవసరం వచ్చినపుడు దురాచారాల నుండి సమాజానికి విముక్తి కలిగించేందుకు వారు సాహసం ప్రదర్శించారు.

సేఠ్ దాన్‌మల్ గుజరాత్ ప్రాంతంలో ప్రముఖ వ్యాపారి. ఆయన 22సం॥ కుమారుడు హఠాత్తుగా చనిపోయాడు. వివాహమై అప్పటికి ఒక్క సంవత్సరమే. తన కోడలు భవిష్య జీవిత ఎలా గడుస్తుందనేదే ఆయన దుఃఖమల్లా. పుత్రశోకానికి సానుభూతి చూపించటానికి బంధువులు, తోటి వ్యాపారులు వచ్చి వెళ్తున్నారు. తన కోడలి పునర్వివాహం గురించి వారి ముందు చర్చిస్తే, అటువంటి సాంప్రదాయం లేనందున వారెవరూ అంగీకరించలేదు. సేఠ్‌జీ తన రెండవ కొడుకును ఇందుకు తయారు చేసి, కోడలి అనుమతి తీసుకొని తన ఇంటిలోనే వివాహం జరిపించాడు. సమాజంలో దీని గురించి చర్చ మొదలైంది. కొందరు మంచిదన్నారు, కొందరు మంచిది కాదన్నారు. అదే సంవత్సరం సవర్ణ కులాలలో అనేక వితంతు వివాహాలు జరిగినపుడు సమాజం దాన్ని స్వీకరించినట్లు అర్థమైంది.

- ప్రజ్ఞాపురాణం నుండి

**చేతనలో శక్తిని సృష్టించే ప్రక్రియ - శక్తిపాతం.**

## బ్రహ్మాండంలో సమానుభూతి

# ఖగోళ విజ్ఞానానికి కొత్త కోణం

మన భూగోళం అంతరిక్షంలోని అతి పెద్ద సౌరకుటుంబానికి చెందిన ఒక చిన్న భాగం. ఈ సౌరకుటుంబంలోని గ్రహాలన్నీ ఒకే సూత్రంలో కట్టుబడి ఉన్నాయి. అవి తమతమ కక్ష్యలలో తిరుగుతూ సూర్యునికి ప్రదక్షిణ చేస్తుంటాయి. ఈ సూర్యుడు తన కుటుంబానికి చెందిన గ్రహ-ఉపగ్రహములతో పాటు మహాసూర్యునికి ప్రదక్షిణ చేస్తుంటాడు. ఈ విధంగా సూర్యుడు ఒక క్రమపద్ధతిలో ముందుకు సాగుతూ బ్రహ్మాండపు నాభిగా పిలువబడే మహా ధృవం వరకు ప్రయాణిస్తాడు. ఇంత క్లిష్టమైన వ్యవస్థాక్రమం ఏర్పడి ఉన్నందువలన గ్రహ నక్షత్రాల గతులలో ఎటువంటి గందరగోళమూ ఏర్పడడం లేదు. ఒకదాని ప్రభావం మరొకదానిమీద పడుతూ పరస్పర సమన్వయంతో నడుస్తున్న సువ్యవస్థ ఈ సౌర కుటుంబం. దీనిని బ్రహ్మాండపు ప్రాణధార అని అనవచ్చు.

నేటి వైజ్ఞానిక యుగంలో ఖగోళశాస్త్రాన్ని క్రొత్త కోణం నుండి తెలుసుకునే ప్రయత్నం తప్పనిసరి అయింది. విజ్ఞాన రంగంలో దీనికి అత్యుత్తమ స్థానమున్నది. ఋతువుల పరివర్తనలు, వర్షాలు, తుఫానులు, వాయుగుండాలు, హిమపాతాలు, భూకంపాలు వంటి ప్రకృతి గతమైన అనుకూలత-ప్రతికూలతల గురించిన అనేక వివరాలను విశ్వగ్రహ గమనముల ఆధారంతో పొందుతున్నారు. ఖగోళ భౌతిక వాదుల అభిప్రాయం ప్రకారం భూమి మీద ఋతువుల పరిస్థితి అంతరిక్షం నుండి వచ్చే ప్రాణశక్తి ప్రవాహాల సంతులనము-అసంతులనాల మీద ఆధారపడి ఉంటుంది. సామాన్యంగా భూమిలోని ధృవప్రాంతాల మీదనే అంతరిక్షపు ప్రాణశక్తి ప్రోగుపడి ఉంటుంది. ఉత్తర ధృవం నుండి మొదలై భూమికి లభించే అసంఖ్యాక సూక్ష్మశక్తులు, సంపదలు బ్రహ్మాండమంతా వ్యాపిస్తాయి.

వీటి నుండి ఉపయుక్తమైన వాటిని భూమి తనలోకి జీర్ణించుకుని పనికిరాని వాటిని దక్షిణధృవ ద్వారం నుండి అనంతాకాశంలోకి నెట్టివేస్తుంది. వర్షముల ప్రభావం ఏ విధంగా జీవకోటి మీద, వనస్పతుల మీద పడుతుందో, అదే విధంగా విశ్వగ్రహ మండలముల సూక్ష్మ ప్రవాహముల ద్వారా లభించిన శక్తి కూడా భూమి మీద పడుతుంది. ఇది చెట్టు చేమలనే కాక ప్రాణికోటిని కూడా ప్రభావితం చేస్తుంది. ఈ ప్రక్రియ వలన మానవుల శారీరక - మానసిక పరిస్థితి కూడా చాలా వరకు ప్రభావితమవుతుంది.

జ్యోతిర్విద్యకు సంబంధించిన వివరాలు చెపుతున్నది ఇది-వర్తమాన స్థితి, భవిష్యత్తు కల్పనలకు సంబంధించి ఈ విజ్ఞానాన్ని ఆధారం చేసుకుని, జరిగే సంఘటనల ద్వారా కలిగే నష్టాలను తప్పించుకొనగలిగే విధానాన్ని, శ్రేష్ఠమైన వాటినుండి మరింత లాభం పొందగలిగే విధానాన్ని అభివృద్ధి పరచినట్టయితే - అది మానవుని సర్వోత్తమ సామర్థ్య మనబడుతుంది. ప్రాచీన ఋషులు దీనికి సముచితమైన మార్గాన్ని సూచించారు. ఇప్పుడు మనం చేయవలసిందల్లా పరంపరాగతంగా వస్తున్న అపోహల నుండి, మూఢనమ్మకాల నుండి విముక్తి పొంది ఈ విజ్ఞాన సమ్మతమైన ప్రణాళికను ఆచరించుటయే.

భూమిమీదనే నివసించే మనిషి విరాటశక్తిలోని చిన్న అంశ అన్న విషయాన్ని ఆధునిక విజ్ఞానం కూడా బాగా అర్థం చేసుకున్నది. అంటే, భూమి ఆ విరాట చిహ్నమైన సూర్యమండలములోని అంశమే కదా! కనుక ఈ మూడింటిలోనూ ఒకే ప్రాణశక్తి ప్రవహించుచున్నది అన్న విషయం యథార్థం. బిడ్డ గర్భావస్థలో తల్లి ద్వారా జోడింపబడిన నాభినాళం (బొడ్డుతాడు) నుండి శక్తి పొందుతూ ఉంటాడు. ఈ రక్త ప్రవాహంతోనే శిశువు కార్యకలాపాలన్నీ నడుస్తుంటాయి. అన్ని జీవకోశాల నిర్మాణం, ఒకే అణువుతో కోట్లాది జీవకణాలు తయారగుట ఈ ప్రక్రియ సహకారంతోనే జరుగుతాయి. దీనిని వైజ్ఞానికులు తమ భాషలో ఎంపథీ లేక సమానుభూతి అని అంటారు. మానవులు, పృథ్వి, సూర్యుడు, మహాసూర్యుడు, పరబ్రహ్మ- ఇవన్నీ కలిసి ఈ సమానుభూతి వలయం. సూర్యుని మీద సంభవించిన ఏదైనా ఒక సంఘటన తాలూకు పరిస్థితి మానవుల, ఇతర ప్రాణికోటి రోమ రోమాలలో

**సంస్థల చీలికలకు ప్రధాన కారణం పదవీ వ్యామోహం.**

ప్రతిస్పందిస్తుంది. మనిషి రక్తంలో సంచరించే రక్తకణాలు, మరియు న్యూక్లియర్ ఏసిడ్ వంటి జీన్స్, జీన్స్‌ను తయారు చేసే అల్పకణాలు సూర్యుని అణువులతో సమానుభూతి - ఐక్యత కలిగి ఉంటాయి. అనగా అన్ని మంచి చెడుల ప్రభావాలలో భాగం పంచుకుంటాయి. సూర్యునికి కోట్ల మైళ్ల దూరంలో నివసిస్తున్నప్పటికీ ఈ ప్రభావంలో ఎటువంటి మార్పు రాదు.

ఈ అంతర్గ్రహ ప్రభావాన్ని, సౌరగతి వలన మానవ శరీరంపై పడే ప్రభావాన్ని కవల పిల్లల ఉదాహరణతో చక్కగా తెలుసుకోగలుగుతాము. ఒకే అండం నుండి జన్మించే ఇద్దరు పిల్లలు గర్భాశయంలో కలిసి వృద్ధి పొందుతారు. జన్మించిన తర్వాత వారిని ఎక్కడ, ఎంత దూరములో ఉంచినప్పటికీ వారి వ్యవహారాలు, ఆలోచనలు, అలవాట్లు ఒకే విధంగా ఉంటాయి. ఇది ఒకే అణువుతో ఒకే ఆవరణలో పెరిగినందువలన కలిగిన పరిణామం. మానవులు, భూమి, సూర్యుడు కూడా ఇదే విధంగా ఒకే అణువు నుండి తయారు కాబడినందున సమాన అనుభూతి ఆధారంగా పరస్పరం ప్రభావితమవుతుంటాయి. ఈ సూత్రమే ఖగోళ విజ్ఞానానికి కేంద్రబిందువు. ప్రతిక్షణం, ప్రతి నిముషం పృథివిలోని అణువణువూ, సూర్యుని మహాకణజాలం, ఒక సంబంధ సూత్రంతో జోడించబడి ఉన్నాయి. నిరంతరం విద్యుత్ ప్రవహిస్తూ ఉండే రెండు కరెంటు తీగలు ఎలా కలిసి ఉంటాయో అలా మానవ జీవాణువులు ఆ విరాట్ స్వరూపంతో జోడించబడి ఉంటాయి.

ఈ సమానుభూతికి ఇప్పటి విజ్ఞానం ఒక క్రొత్త పరిభాష ఇచ్చింది. "క్లినికల్ ఎకాలజీ"- అనగా పర్యావరణ ప్రభావిత జీవ విజ్ఞానం అని అర్థం. ఇందులోనే సూర్యునిపై సంభవించే అన్ని సంఘటనలు, మచ్చలు, మరకలు, జ్వాలలు, భూమిని తాకే తుపానులు, ఋతువులలో ఊహించని మార్పుల వలన ప్రాణుల మీద పడే ప్రభావం సంగ్రహం చేయబడుతుంది. ఇది చైతన్యవంతమైన చేతనా జగత్తు యొక్క ఒక లయబద్ధమైన పరోక్ష ప్రభావానికి ప్రత్యక్ష నిదర్శనం. ప్రతి పదకొండు సంవత్సరాలకు "సన్ స్పాట్" రావడానికి, సంవేదనాశీల వృక్షాలలో వర్తులాకారాలు ఏర్పడడానికి గల పరస్పర సంబంధం వైజ్ఞానికులను ఆశ్చర్యపరుస్తున్నది. సామాన్యంగా వృక్షాలకు ఎన్ని వర్తులాకారాలున్నాయో చూచి వాటి వయసును తేలికగా అంచనా వేయగలుగుతాము. ఎండలు ఎక్కువగా ఉన్నట్లయితే ఈ వలయాలు వెడల్పుగా తయారవుతాయి. కాలం ఉండవలసిన దానికన్న అతి చల్లగా లేదా శుష్కించి ఉన్నట్లయితే ఈ వలయాలు సంకరం అవుతాయి, కలసిపోతాయి. ఈ విధముగా కాలముల వ్యత్యాస ప్రభావం ఎంతో దూరంలో ఉన్న భూమిపై గల వనస్పతులు, వృక్ష సముదాయం మీద పూర్తిగా పడుతోంది.

వృక్షాలు-వనస్పతులు ఎంత సున్నిత తత్త్వం కలిగి ఉన్నవంటే, కోట్ల మైళ్ల దూరాన ఉన్న సూర్యుని మీద సంభవించే పరివర్తనాలను అవి ప్రతిబింబిస్తాయి. అలాంటపుడు మానవ శరీరంలోని సూక్ష్మాతి సూక్ష్మ జీవకణాలు, అతి సూక్ష్మ స్నాయునాళాల మీద వీటి ప్రభావం మరింత ఎక్కువ సమానుభూతిని కలిగిస్తుంది కదా! విజ్ఞానవేత్తలు తమ పరిశోధనలలో ఈ విషయం తెలుసుకున్నారు కూడా. సౌరమండలంలో ఉన్న పల్సార్జ్, బ్లాక్‌హోల్ నుండి వెలువడే న్యూట్రాన్ కణాలు కాంతివేగం కన్నా వేగంగా బయలుదేరి భూమిని చేరుతాయి. ఇవి మానవ మస్తిష్కం యొక్క "మాయింజెన్" అణువులతో ఎక్కువ పోలిక కలిగి కలిసిపోతాయి. ఇదే విధంగా అతి సూక్ష్మ సౌరకుటుంబంలోని గ్రహాల ప్రభావం భూమిమీద నివసించే జీవరాశి మీద పడి తీరుతుంది. వృక్షాల వలె మానవ మస్తిష్కంలో కూడా ప్రతి పదకొండు సంవత్సరాలకు వర్తులాలుగాని లేదా మార్పులు గాని సంభవిస్తాయా లేదా అన్న విషయం మాత్రం ఖచ్చితంగా తెలియరాలేదు. కానీ ఈ విరామంలో మానసిక బలహీనులకు ఉద్రేకం, ఉన్మాదం, అస్థిమితం చాలా తీవ్రంగా ఉంటుంది. ఆత్మహత్యకు పాల్పడుట, ఇతరుల మీద అకారణంగా పోట్లాటకు దిగుట, అనాలోచితంగా దుర్ఘటనలలో చిక్కుకొనుట వంటివి జరుగుతాయి. ఈ విరాట్ రూపంలో అంతర్లీనంగా సంభవిస్తున్న ఆశ్చర్యకరమైన విశేషాలను తెలుసుకొనాలంటే సరైన ఖగోళ విజ్ఞాన అధ్యయనం అవసరం.

ఇప్పుడు విజ్ఞానం అంతరిక్ష ప్రాముఖ్యాన్ని తెలుసుకున్నది. వాయువు, జలముల అంతులేని సంపద ఆకాశపు ముంగిట్లో నిండి ఉన్నదని అందరూ ఎరుగుదురు. విద్యుత్, రేడియో, లేసర్ మొదలైన వాటి తరంగాలు ఆకాశంలో వ్యాపించి ఉంటాయన్న సత్యం వైజ్ఞానికులకు చిరపరిచితమే. ధ్వని,తాపం (వేడిమి), వెలుగు మొదలైన వాటి తరంగాలు

**ఎంత పరిగ్రహిస్తే అంతగా ఆత్మబలం క్షీణిస్తుంది.**

ఆకాశంలో ప్రవహిస్తుంటాయి. అంతర్గ్రహ లాభాలు కూడా అదే రంగంలో లభిస్తాయి. అదృశ్య జగత్తు సంపద సూక్ష్మ అంతరిక్షంలో సమాహితమై ఉన్నదనడానికి ఆలోచనా తరంగాలు వీటి పరిసరాల్లోనే పరిభ్రమిస్తుంటాయన్నదానికి ఎన్నో ఆధారాలు ఉన్నాయి. భూ మండలంతో పోల్చినట్లయితే అంతరిక్షంలో ఉన్న సాధన - సంపదల గొప్పతనం, స్థాయి అనేక రెట్లు అధికమని వాటి వలన స్పష్టపడుతున్నది.

ఆధ్యాత్మిక వేత్తలు అనాదికాలం నుండి తమ దృష్టిని అంతరిక్షం మీద కేంద్రీకరించి ఉన్నారు. వారి సాధనా రంగం అదృశ్యజగత్తు, సూక్ష్మ జగత్తులే. సిద్ధులు, భౌతిక ఆధ్యాత్మిక శక్తులు ప్రత్యక్షంగా కనపడుతున్నప్పటికీ వాటి ఆర్జన పరోక్ష జగత్తు నుండి మాత్రమే సాధ్యపడుతుంది. మానవుని అంతరంగంలో వాటి బీజం ఉంటుంది. కాని అది సువికసితమవడానికి, శక్తులు చేతికి రావడానికి అదృశ్య జగత్తు సహకారం తప్పనిసరి. సాధన జరుగుతున్నప్పటికీ, దైవశక్తుల సహకారం వల్ల మాత్రమే వాటి ప్రతిఫలం అనుభవంలోకి వస్తుంది.

విషాక్తత పెరిగి పోవడంతో ఆకాశంలో కాలుష్యం విపరీతంగా నిండిపోయింది. ఈ కారణం వలన మనుషుల జీవన స్థాయి దిగజారిపోవడం ప్రారంభమయింది. దానితో పాటు ఇతర ప్రాణులకు, మానవులకు దుర్బలత, రుగ్మతల శాపాలను భరిస్తూ అకాల మృత్యువు వాత పడడం మినహా మరో దారిలేక పోతున్నది. ప్రకృతి పరమైన ప్రకోపాలు కూడా ఇప్పుడు అధిక శాతం అనుభవించవలసి వస్తున్నది. భూమి ఏ విధంగా ఇతర గ్రహాల గమన విధులతో ప్రభావితమవుతుందో అదే ప్రకారం సౌరమండల చక్రంలో బంధించబడి ఉన్నందువల్ల భూ వాతావరణం కూడా ఇతర గ్రహాల మీద తన ప్రభావాన్ని చూపుతుంది. అసంతులనం, ప్రకృతి ప్రకోపాలు, మనిషి ద్వారా కాలుష్యమైన భూవాతావరణం కూడా అందుకు సహకరిస్తున్నదని పర్యావరణ పర్యవేక్షకులు-వైజ్ఞానికులు అంగీకరిస్తున్నారు. ఈ విషాక్తతకు విరుగుడు-నివారణ ఉపాయం ఎవరికీ తోచడం లేదు. అనంతాకాశంలోకి నెట్టివేయబడుతున్న అణుధూళి, ఇతర చెత్తా చెదారాల మీద చర్చలు జరుగుతున్నాయి. అది మనిషికి హానికారక ప్రభావాన్ని ఉత్పన్నం చేస్తుందా లేదా అన్న సందేహాల గురించి ఆలోచనలు సాగుతున్నాయి. అంతరిక్షంలో పెరుగుతున్న సాంకేతిక అభివృద్ధికి తోడు నానాటికి పెరిగిపోతున్న ఉపగ్రహాల సంఖ్య భవిష్యత్తులో చూడబోయే భయంకర దృశ్యాలను, నిరాశాపూరిత అంశాలను మన ముందుంచుతున్నది.

భౌతిక విజ్ఞానం దానికి సంబంధించిన సాంకేతిక విద్య ప్రాచీన కాలంలో ఇంత అభివృద్ధి చెంది ఉండకపోవచ్చు. కాని ఏ ప్రయోజనాలకు ఆశించి నేడు అంతరిక్ష వైజ్ఞానికులు ప్రయత్నాలు చేస్తున్నారో అవన్నీ ఖగోళ విజ్ఞానం ద్వారా గణితం ద్వారా చేయబడేవి. అంతరిక్షపు ఆవరణలో గ్రహ-నక్షత్రాల పరిస్థితి, వాటి వలన కలిగే లాభాలు-హానికారక ప్రభావాల జ్ఞానం ఖగోళ విజ్ఞానం ద్వారా తెలిసేది. ఇక ఆత్మవిజ్ఞానం ద్వారా వాటివలన శుభాలను లాభాలను పొందడం, ప్రతికూలతల నుండి రక్షించుకొనడం, ఉపచారాల విధి తెలిసేది. ఇప్పుడు మనం చేయవలసిన విధి ఏమంటే - పోగొట్టుకున్న వెనుకటి ఈ మహావిద్యకు ఖగోళ జ్ఞానపు లంకెను కనుగొనవలసి ఉన్నది. ఈ విజ్ఞానాన్ని క్రొత్త కోణం నుండి తెలుసుకుంటూ దాని అడుగుజాడల్లో చేయీ చేయీ కలిపి నడిచినట్లయితే అంతరిక్షపు భౌతికమైన, ఇతరమైన సంపదలను పొందుట నిశ్చయం.

అధ్యాత్మ, విజ్ఞానాలు పరస్పరం సహాయ సహకారాలను అందించుకునేందుకై వేదాంత స్థాయిలోనే కాక అనేక ఇతర విషయాలలో కూడా ప్రయత్నాలు శాంతికుంజ్‌లో జరుగుతున్నాయి. వాటిలో జ్యోతిర్విజ్ఞానాన్ని క్రొత్త కోణం నుండి తెలుసుకొనే ప్రయత్నం కూడా ఒకటి. దీనివలన ఋషి పరంపర ఆధారంగా నడిచిన భూతకాలపు కార్యక్రమాల గొప్పతనం తెలుసుకొనడమే కాక, దాని ఆధునిక విజ్ఞాన సమ్మతమైన రూపాన్ని ప్రత్యక్షంగా చూడగలుగుతాము. ఈ సందర్భంగా దేవ సంస్కృతి విశ్వవిద్యాలయంలో ఖగోళ విజ్ఞాన విభాగం తనదైన శైలిలో అపూర్వమైన పరిశోధన జరుపుతూన్నది. ఇందువల్ల ఒక ఇంటి యజమాని ఏ విధంగా తన ఇరుగుపొరుగు వారితో ఇచ్చి పుచ్చుకునే సత్సంబంధాలు కలిగి ఉంటాడో అలా విశ్వగ్రహ కుటుంబంతో సత్సంబంధాలు నెలకొనే అవకాశం ఉన్నది.

అనువాదం: విజయకుమారి.

H H H

**ఆలోచనా ధోరణిని మార్చడమే యుగ పరివర్తన.**

బోధకథ

# అపర భగీరథుడు

జార్జ్ బిసెల్ తన ఎదుట నిలబడి ఉన్న నవయువకుడిని నిశితంగా పరిశీలించాడు. అతడి వయసు పద్దెనిమిది సంవత్సరాలకు మించదు. తెల్లని ఛాయ. ముఖంలో ఆత్మవిశ్వాసం నిండిన చిరునవ్వు. అన్నిటికన్న మించినది అతడి కళ్లలో జాలువారుతున్న సమ్మోహనశక్తి. ఆ శక్తి నుండి బిసెల్ కూడా తప్పించుకోలేకపోయాడు. టేబుల్ మీద ఉన్న ఫైళ్లను ఒక ప్రక్కకు సర్దుతూ ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చోమని అతడికి సంజ్ఞ చేశాడు.

కుర్చీలో కూర్చొని ఆ యువకుడు వినమ్రంగా అభివాదం చేశాడు. "నాపేరు ఎడ్విన్ డ్రెక్. బావులు తవ్వడం నాకు బాగా తెలిసిన విద్య. మీరు నూనె బావి తవ్వించే పనిలో ఉన్నారని విన్నాను. నేను మీకు సహాయం చేస్తాను.'' అన్నాడు.

బిసెల్ ఆ యువకుడి వైపు అలా చూస్తుండిపోయాడు. ఎడ్విన్ పలికిన ప్రతి పదమూ అతని ఆత్మవిశ్వాసానికి సాక్ష్యం ఇస్తున్నట్లుంది. పద్దెనిమిదేళ్ల చిన్న వయసులో ఇంత మనోబలం ఎలా సాధ్యపడింది - అని ఒక నిముషం ఆశ్చర్యపడ్డాడు కూడా. కొద్దిసేపు ఆలోచించి చిరునవ్వు నవ్వుతూ "నేను నూనె కోసం వెతుకుతూ బావి తవ్వించాలనుకుంటున్నట్లు నీకెలా తెలిసింది?''-అని అడిగాడు.

"మామూలుగానే....'' ఎడ్విన్ కూడా చిన్నగా నవ్వాడు.

"సరే, రేపు ఉదయం పదిగంటలకు ఇక్కడకు రా. ఈరోజు రోడరిక్‌తో మాట్లాడాలి. అతనితో సంప్రదించకుండా నేనే నిర్ణయమూ చేయను.''

"మంచిది సర్.'' ఎడ్విన్ అంగీకార సూచకంగా తలఊపి గదినుండి బయటకు వెళ్లిపోయాడు. బిసెల్ తన పనిలో మునిగిపోయాడు.

నిజానికి ఎడ్విన్ నిరక్షరాస్యుడు. చదువు సంధ్యలు లేక చేసేందుకు పని దొరక్క తిరుగుతున్నాడు. న్యూయార్క్ నగరానికి ఉత్తర-పశ్చిమాలుగా ఉన్న ఫ్లోరిడాలో ఉంటాడు. తల్లి చిన్నపుడే పోయింది. తండ్రి రెండో పెళ్లి చేసుకున్నాడు. సవతి తల్లికి ఇతడంటే గిట్టేది కాదు. పసివాడని కూడా చూడకుండా అయినదానికీ కానిదానికీ తిట్టడం, కొట్టడం చేసేది. తిట్లూ చీవాట్లూ, దెబ్బలు తినడం అన్నవి వాడి దినచర్యలో ఒక భాగం అయ్యాయి. డబ్బు ఖర్చవుతుందని సవతి తల్లి బడికి పంపకపోయేసరికి, అక్షరజ్ఞానం అతడికి కరువైంది.

వాళ్ల ఇంటికి దగ్గరలో రాబిన్ అనే కంట్రాక్టరు ఉండేవాడు. బావులు తవ్వే పని చేసేవాడు. ఇంట్లో చీదరింపులు, దెబ్బలతో విసిగిపోయిన ఎడ్విన్ ఎక్కువ సమయం రాబిన్ దగ్గర గడిపేవాడు. చిన్నప్పటి నుండీ వాళ్ల మాటలు వినడం, ఆ పనుల్లో తిరగడంతో, అతడికి బావులు తవ్వే పనిలోని మెలకువలు బాగా వంటబట్టాయి. మంచి అనుభవం వచ్చింది.

అప్పటి కాలంలో చమురు బావులు అనేవి ఎక్కడా లేవు. జనం తేనె పిండగా వచ్చిన మైనం, జంతువుల కొవ్వు, రాక్షస బొగ్గు ద్వారా లభించే నూనె ఉపయోగించుకునేవారు. కాని రాక్షసి బొగ్గులతో తీసే నూనె చాలా ఖరీదుగా ఉండేది.

అటువంటి సమయంలో వకీలు జార్జ్ బిసెల్‌కి వైజ్ఞానికుడైన రోడరిక్‌తో స్నేహం కలిసింది. ఒకసారి మాటల మధ్య ఆయన బిసెల్‌కి భూమి లోపలప్రకృతి పరమైన సహజ చమురు నిక్షిప్తమై ఉందన్న విషయం చెప్పి, "కొద్దిపాటి పెట్టుబడితోనే ఈ ఆయిలు కారు చవకగా లభిస్తుంది. ఈ వ్యాపారంలో నువ్వు కోట్లు గడించవచ్చు'' అని చెప్పాడు. అప్పటి నుండి బిసెల్ ఈ నూనె బావుల తవ్వకం గురించి పథకాలు వేయసాగాడు.

రోడరిక్ సాయంత్రం అయిదు గంటలకు బిసెల్ ఆఫీసుకి వచ్చాడు. బిసెల్ ఒక్క నిముషం కూడా వృథా చేయకుండా ఎడ్విన్ గురించి చెప్పి, ఎప్పుడు పని మొదలు పెట్టాలి, ఎలా చెయ్యాలి, అన్న విషయాల గురించి వివరంగా చర్చించాడు. మంచి ప్రణాళిక సిద్ధం అయింది.

బిసెల్ మరునాడు రోడరిక్, ఎడ్విన్‌లను వెంట బెట్టుకు వెళ్లి తగిన చోటు ఖరారు చేసుకున్నాడు. బావి తవ్వే పని ఆరంభం అయింది. తవ్వే పనికి బిసెల్ పదిమంది కూలీలను

**ఆలోచనా ధోరణిని మార్చే ప్రక్రియ జ్ఞానయజ్ఞం.**

నియమించాడు. ఎడ్విన్, రోడరిక్‌ల పర్యవేక్షణలో పని చురుగ్గా సాగింది. పదిరోజులలో అరవై అడుగుల లోతు తవ్వబడింది. కానీ నూనె జాడ మాత్రం కనపడలేదు. ఈ రోజు పడుతుంది, ఈరోజు తప్పకుండా పడుతుంది-అని పదిరోజులుగా ఉత్సాహపడుతూ ఎదురు చూసిన బిసెల్ ఈ అపజయానికి కృంగిపోయాడు. మానసికంగా ఎంతో బాధపడ్డాడు. రోడరిక్ సూచనలను తుచ తప్పక పాటించాడు. ఇలా బెడిసికొట్టింది. ఈ పనికి బిసెల్‌కి అయిదువందల డాలర్లు ఖర్చయ్యాయి.

రోడరిక్ ఎంత నచ్చచెప్పినా బిసెల్ ముందుకు పోవడానికి ఇష్టపడలేదు. పని ఆపించేశాడు. కానీ ఎడ్విన్ మాత్రం నిరాశపడలేదు. దాని అంతు చూడాలన్న దృఢ సంకల్పంలో ఉన్నాడు. వైజ్ఞానికుడు అంత ఖచ్చితంగా చెపుతున్నపుడు అన్వేషించడంలో తప్పేముంది! ఇక్కడ కాకపోతే మరొకచోట పడుతుంది అనుకున్నాడు. చదువు రాకపోవడంతో, రోడరిక్ దగ్గర తనకు కావలసిన సమాచారం సేకరించి మనసులోనే పథకం తయారు చేసుకున్నాడు. ఇప్పుడు డబ్బు సమస్య ఎదురైంది. ప్లాను వేయడానికి పైసా ఖర్చుండదు గాని పని సాగడానికి చేతినిండా డబ్బులుండాలి కదా!

పదిమంది కూలీలు పని చేస్తేనే పదిరోజులకు అరవై అడుగులు తవ్వగలిగారు. తను ఒక్కడు ఒంటరిగా ఏమి చేయగలడు! వెనకడుగు వేయడానికి అతడి మనసు అంగీకరించలేదు. ఒంటరిగానే దిగాడు రంగంలోకి. "చమురు నిక్షేపాల్ని వెదకి బయటకు తీయాలి అంతే"-అని దృఢంగా నిర్ణయించుకున్నాడు.

రోడరిక్ చెప్పిన విషయాలు మననం చేసుకొని దానికోసం ఒక స్థలాన్ని ఎన్నుకున్నాడు. అది బాగా మెరకగా ఉన్నది. బావి తవ్వకానికి కావలసిన పనిముట్లను బిసెల్ దగ్గర అరువు తీసుకున్నాడు. పని మొదలు పెట్టాడు. చూసిన వాళ్లంతా అతడిని చమురు పిచ్చివాడని ఎగతాళి చేశారు. "ఈ హీరోగారట భూమిలోంచి ఆయిల్ తెప్పిస్తాడట"-అంటూ అంతా వ్యంగ్యంగా మాట్లాడారు. కానీ ఎడ్విన్ మాత్రం ఎవరేమంటున్నా పట్టించుకునే వాడు కాడు. వాళ్ల హేళనలకి, వెక్కిరింతలకి అతని జవాబు ఒక్కటే-'మనిషి దగ్గర పట్టుదల, పరిశ్రమించే గుణం ఉండాలి. హృదయంలో ఈశ్వరునిపై విశ్వాసమనే దీపశిఖ ప్రజ్వలించాలి. అటువంటి వాళ్లకు ఈ ప్రపంచంలో అసంభవం, అసాధ్యం అంటూ ఏదీ ఉండదు. ఎంత పెద్ద ఆటంకాలైనా వాళ్ల మార్గాన్ని నిరోధించలేవు.''

ఎడ్విన్ తవ్వకాలలో మునిగిపోయాడు. అది రాత్రా పగలా అన్న భేదాన్ని మర్చిపోయాడు. ఆకలి దప్పికల ధ్యాస కూడా వదిలివేశాడు. అటుప్రక్కగా వెళ్లేవాళ్లంతా పిచ్చివాడని, వెర్రిమాలోకం అని ఎవరికి తోచినట్లు వాళ్లు వ్యాఖ్యలు చేసి నవ్వుకుంటూ ఉండేవారు. కానీ ఎడ్విన్ మనసు మీదా, శరీరం మీదా ఇవేమీ పని చేసేవి కావు. నిరాశా నిస్పృహలకు తావిచ్చేవి కావు. అలసట తెలియనిచ్చేవి కావు. భగవంతునిపై విశ్వాసం, దృఢ సంకల్పం ప్రతి క్షణం క్రొత్త శక్తిని సరఫరా చేస్తున్నట్లు - నూతనోత్సాహంతో పని చేసేవాడు.

ఒక్కడే అయినప్పటికీ, రాత్రీ పగలూ తవ్వడం వల్ల నెల రోజులకు అరవై అడుగులపైగా తవ్వగలిగాడు. అక్కడి నుండి తవ్విన మట్టి జిడ్డుగా కనపడసాగింది. నేలమీద చెవిపెట్టి వినడానికి ప్రయత్నించాడు. అక్కడ చమురు నిక్షేపం ఉండి తీరుతుందని అనిపించింది. ద్విగుణీకృత శక్తితో త్రవ్వకం సాగించాడు. మరో తొమ్మిది-పది అడుగులు తవ్వేసరికి ఒక మూల నుండి నల్లని చమురు ఉబికిరాసాగింది. దానిని చూడగానే ఎడ్విన్ మొహం విప్పారింది. సంతోషం పట్టలేక పిచ్చిగా కేకలు వేశాడు. చిన్న పిల్లవాడిలా గంతులు వేశాడు. తన శ్రమనూ, నమ్మకాన్నీ సార్థకం చేసినందుకు రెండు చేతులూ పైకెత్తి భగవంతునికి భక్తితో నమస్కరించాడు. భూమికి తల ఆనించి ప్రణామం చేశాడు.

దృఢ సంకల్పంతో, పట్టుదలతో ఎడ్విన్ డ్రేక్ పందొమ్మిదవ శతాబ్దపు అతి గొప్ప ఆవిష్కరణ చేశాడు. భూగర్భంలో దాగి ఉన్న చమురు నిక్షేపాలను బయటకు తెచ్చాడు. ఆ ఒక్క పదార్థం మొత్తం ప్రపంచపు గతిని, స్వరూపాన్ని మార్చివేసింది.

ఆత్మ విశ్వాసంతో కూడిన పట్టుదల, నిరంతర పరిశ్రమ అనే రెండు లక్షణాలు అసాధ్యమును సుసాధ్యం చెయ్యడంలో సాటిలేనివని రూఢి అవుతున్నది గదా!

-అనువాదం: విజయకుమారి

**మధుర భాషణమున మర్యాద ప్రాప్తించు.**

## వార్తలు

# కొత్తపేటలో నవకుండీ గాయత్రీ మహాయజ్ఞం

### పొన్నూరులో 24 కుండముల గాయత్రీ యజ్ఞం

2004 డిసెంబరు 24,25,26లలో గుంటూరు జిల్లా పొన్నూరులో 24 కుండలముల గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. నారాకోడూరు గాయత్రీ శక్తి పీఠం యజ్ఞానికి ఆధ్వర్యం వహించింది.

24 సాయంత్రం 558 కలశాలతో భవ్య కలశయాత్ర జరిగింది. వేయిమంది పాల్గొన్నారు. ప్రసాదం స్వీకరించారు.

25 ఉదయం యజ్ఞం జరిగింది. ఆ సందర్భంగా సంస్కారాలు ఇవ్వబడ్డాయి. 1200మంది పాల్గొని, భోజన ప్రసాదం స్వీకరించారు.

నాటి సాయంత్రం 2400 దీపాలతో దీపమహాయజ్ఞం జరిగింది.

26 ఉదయం యజ్ఞం, సంస్కారాలు, పూర్ణాహుతి జరిగాయి. 4000మంది పాల్గొని భోజన ప్రసాదం స్వీకరించారు.

పై కార్యక్రమాలకు డా॥తుమ్మూరి ఆధ్వర్యం వహించారు.

యజ్ఞం సందర్భంగా చక్కని ప్రవచనాలు జరిగాయి. గాయత్రి, యజ్ఞం, ఇతర ఆధ్యాత్మిక విషయాలపై అందువల్ల ప్రజలకు చక్కని అవగాహన ఏర్పడింది.

### కామయ్యపాలెంలో
### 24కుండముల గాయత్రీ మహాయజ్ఞం

2004 డిసెంబరు 4,5లలో పశ్చిమ గోదావరి జిల్లా కామయ్యపాలెంలో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం వైభవంగా జరిగింది.

4 సాయంత్రం కలశయాత్ర జరిగింది. 5న జరిగిన యజ్ఞంలో 600మంది పాల్గొన్నారు. ఆ సందర్భంగా 100మంది మహిళలు, పురుషులు గాయత్రీ మంత్రదీక్ష తీసుకున్నారు.

డా॥తుమ్మూరి, శ్రీయుతులు జి.లింగారెడ్డి, సత్యనారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీయుతులు ధనంజయ, నిధీక్ష, ప్రసాద్, శ్రీమతులు ఫణికుసుమ, లావణ్య, బాబ సహకరించారు.

### విశాఖలో నవకుండీయ గాయత్రీ మహాయజ్ఞం

2004 డిసెంబరు 21,22,23,24లలో విశాఖపట్నంలోని ప్రహ్లాద కళ్యాణమండపం ఆవరణలో నవకుండీయ గాయత్రీ మహాయజ్ఞం వైభవంగా జరిగింది. జగన్మాత కళా సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రజ్ఞామండలి సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

21న 108 కలశాలతో, 200మందికి పైగా మహిళలతో భవ్య కలశ యాత్ర జరిగింది. 22 ఉదయం యజ్ఞాన్ని శ్రీమతులు సావిత్రి, వసంత, రూపవాణి, శ్రీయుతులు మహేష్, హేమచంద్ర రావు నిర్వహించారు. శ్రీరాజేష్ ప్రతాప్ సింహ్, డా॥జి. చంద్రశేఖరం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 23న దేవీపురం స్వామివారు లలితా కుంకుమార్చనలు నిర్వహించారు. 200మంది మహిళలు పాల్గొన్నారు. 24న డా॥తుమ్మూరి ఆధ్వర్యంలో యజ్ఞం జరిగింది. మధ్యాహ్నం కార్యకర్తల గోష్ఠి, సాయంత్రం 2400 దీపాలతో భవ్య దీపయజ్ఞం జరిగాయి. యజ్ఞాలలో రోజా 500మందికి పైగా పాల్గొన్నారు. రోజూ సాంస్కృతిక కార్యక్రమాలూ, ఆటల ముగ్గుల పోటీలూ కూడా జరిగాయి. శ్రీవి. చిన్నారావు, శ్రీపి. మహేష్ దంపతులు కార్యక్రమాలకు అమూల్య సహకారం అందించారు.

### విశాఖ ప్రజ్ఞామండలి కార్యకలాపాలు

నవంబరు 6న ఆంథోనీనగర్‌లో దీపయజ్ఞం. 21న పి.ఎమ్.పాలెం రత్నగిరి కాలనీలో నామకరణం, యజ్ఞం. 23న శ్రీమతి ఏ.సావిత్రి, శ్రీనరసింహారావుల నూతన గృహప్రవేశం సందర్భంగా 100మంది పాల్గొన్న త్రికుండీ గాయత్రీ యజ్ఞం. యజ్ఞ ప్రసాదంగా యుగసాహిత్య వితరణ. 27న నేతాజీనగర్‌లో హవన యజ్ఞం. డిసెంబరు 5న సెక్టర్ 6లో, 17న సెక్టర్ 2లో, 19న గన్నాబత్తుల వారి వీధిలో హవన యజ్ఞాలు. 29న శ్రీమతి మనజ గృహంలో 100మంది మహిళలచే సామూహిక భగవద్గీతా పఠనం, గాయత్రీ యజ్ఞం. 31న శ్రీమతి పుష్ప శ్రీఅంజిబాబుల గృహంలో హవన యజ్ఞం. నిర్వహణ; శ్రీహేమచంద్ర రావు, శ్రీమతులు సావిత్రి, వసంత, లీలారాణి.

### ఉక్కునగర్‌లో ప్రజ్ఞామండలి ప్రారంభం

విశాఖలోని ఉక్కునగర్‌లో 2005 జనవరి 3న గాయత్రి ప్రజామండలికి ప్రారంభోత్సవం జరిగింది. ఆ సందర్భంగా శివజ్యోతి విద్యాలయంలో శ్రీహేమచంద్రరావు, శ్రీమతులు సావిత్రి, వసంత గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. విద్యాలయం ప్రిన్సిపాల్, 17గురు ఉపాధ్యాయులు, 560మంది విద్యార్థులు, 20మంది బంధుమిత్రులు ఆహుతులు సమర్పించారు. డా॥తుమ్మూరి ఆశీస్సులు అందించారు. శ్రీయుతులు ఎమ్.గణేష్, ఎస్.శ్యామలరావు, డి.ఎస్.ఆర్.మూర్తి, ఎస్.సత్యనారాయణ (శివజ్యోతి విద్యాలయం ప్రిన్సిపాల్), శ్రీమతి శ్రీలక్ష్మి కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించారు.

ఆ సందర్భంగా పాఠశాల యాజమాన్యం వారు యుగ సాహిత్యాన్ని తమ గ్రంథాలయంలో భద్రపరచారు. తమ విద్యార్థులను భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్షకు హాజరు పరచాలని కూడా వారు నిర్ణయించారు.

**స్వర్గ, మోక్షముల ఆనందం ఈ జీవితంలో సాధ్యం.**

# ఆకివీడులో లక్షా 24వేల దీపాలతో దీపయజ్ఞం

పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులోని శ్రీమల్లేశ్వర, వేంకటేశ్వర స్వామివార్ల ఆలయప్రాంగణంలో 2004 డిసెంబరు 10 సాయంత్రం లక్షా 24వేల దీపాలతో గాయత్రీ కార్తీక దీప యజ్ఞం అతి వైభవంగా జరిగింది.

శ్రీ కొప్పర్తి రవికుమార్, గాయత్రి దంపతులు కార్తీక మాసంలో లక్షా 24వేల గాయత్రీ మంత్రజపం పూర్తి చేసిన సందర్భంగా ఈ దీపయజ్ఞం జరిగింది. డా॥తుమ్మూరి, దాసమ్మ దంపతులు దీపయజ్ఞాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వేలాదిగా ప్రజలు పాల్గొన్నారు. శ్రీయుతులు జి.లింగారెడ్డి, ఎమ్.సత్యనారాయణ రాజు, నేరెళ్ల రామరోశయ్య, కొప్పర్తి రవి, మోటుపల్లి ప్రసాద్, కేశిరెడ్డి మురళి, పోశింశెట్టి మురళి, మోటుపల్లి సత్యనారాయణ, పోశింశెట్టి నారాయణరావు సహకరించారు.

## భీమిలిలో పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞం

భీమిలిలోని శ్రీ దుర్గా గాయత్రి శక్తిపీఠంలో 11వ 24లక్షల సామూహిక గాయత్రీ మంత్రజప పూర్ణాహుతి, దత్త జయంతుల సందర్భంగా పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. శ్రీ రామ్ నాయక్, శ్రీ జి.అప్పలకొండ దంపతులతో పాటు 150మంది పాల్గొన్నారు. శ్రీదత్త - గాయత్రీ మంత్ర బీజాక్షరాలతో కూడిన సంగీతాన్ని పద్మినీ మూర్తి అందించారు. శ్రీబొల్లాప్రగడ లక్ష్మీగణపతి భోజన ప్రసాదాలు అందించారు. చంద్రశేఖరం దంపతులు, పి.వి. పండా దంపతులు, అవతారంరాజు దంపతులు సహకరించారు.

## బాలెపెల్లిలో నవకుండీయ గాయత్రీ మహాయజ్ఞం

2004 డిసెంబరు డిసెంబరు 12న కరీంనగర్ జిల్లా జగిత్యాల మండలం బాలెపెల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీవేముల రాంరెడ్డి సహాయ సహకారాలతో నవకుండీయ గాయత్రీ యజ్ఞం, దీపయజ్ఞం ఉత్సాహవంతంగా జరిగాయి.

కోరుట్ల మండలం అయిలాపురంలోని శ్రీసత్యానంద మహర్షి గీతాశ్రమంలో డిసెంబరు 26న గాయత్రీ యజ్ఞం జరిగింది.

జగిత్యాల మునిసిపల్ గెస్ట్‌హౌస్‌లో, శ్రీరంగశంకర్ గృహంలో కూడా యజ్ఞాలు జరిగాయి.

## భీమవరంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం

2004 డిసెంబరు 16న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని రైస్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞం వైభవంగా జరిగింది. డా॥తుమ్మూరి, శ్రీమతి దాసమ్మ దంపతులు యజ్ఞాన్ని నిర్వహించారు. 300మంది పాల్గొన్నారు. శ్రీయుతులు జి.లింగారెడ్డి, ఎమ్.సత్యనారాయణ రాజు, ఎమ్.రామకృష్ణ రావు సహకరించారు.

## పార్వతీపురంలో మాతాజీ చరిత్ర పారాయణం

పార్వతీ పురంలోని గాయత్రి ధ్యానమందిరంలో 2004 డిసెంబరు 24నుండి 30వరకు ఎస్.మహేశ్వరిగారు మాతాజీ చరిత్ర పారాయణం జరిపారు.

ధ్యానమందిరం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలు; 2004 సెప్టెంబరు 30న పార్వతీపురం ఉంగిడి వీధిలో దీపయజ్ఞం. అక్టోబరు 2న నాయుడు వీధిలో దీపయజ్ఞం. అక్టోబరు 8న ప్రజ్ఞాపీఠంలో పుంసవన దీపమహాయజ్ఞం.

దసరా అనుష్ఠానంలో 9మంది పాల్గొన్నారు. అక్టోబరు 21న పూర్ణాహుతి, గాయత్రీ మహాయజ్ఞం జరిగాయి. శ్రీపి.వి.రమణమూర్తి, శ్రీమతి పి.వసుంధరా దేవి నిర్వహించారు. 50మంది పాల్గొన్నారు. జపం: 489100.

అక్టోబరు 28న ధ్యానమందిరంలో దీపమహాయజ్ఞం, నవంబరు 26న దీప మహాయజ్ఞం. డిసెంబరు 26న దీపమహాయజ్ఞం.

2005 జనవరి 8 నాటికి గాయత్రీ మంత్రం మూడవ పురశ్చరణ 24 లక్షలు పూర్తయింది.

పై కార్యక్రమాలన్నీ శ్రీమతి పి.వసుంధరా దేవి ఆధ్వర్యంలో జరిగాయి.

## హైదరాబాదు పూర్ణోదయ కాలనీలో నవకుండీయ గాయత్రీ యజ్ఞం

జనవరి 30న హైదరాబాదులోని సైదాబాదు పూర్ణోదయ కాలనీలో నవకుండీయ గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. హైదరాబాదు డిప్యూటీ మేయర్ శ్రీ సుభాష్‌చందర్‌జీ దీప ప్రజ్వలన చేసి యజ్ఞాన్ని ప్రారంభించారు. శ్రీయుతులు బి.హనుమంతరెడ్డి, జి.జయపాల్ రెడ్డి, వేణుగోపాల్, కృష్ణమూర్తి, ప్రతాపరెడ్డి తదితరులు యజ్ఞంలో పాల్గొన్నారు. శ్రీమతి బి.అనసూయమ్మ, దుర్గాసావిత్రి దంపతులు యజ్ఞాన్ని నిర్వహించారు.

యజ్ఞం సందర్భంగా 400మంది గురుదీక్ష తీసుకున్నారు.

H H H

**సంపదతో కాక సద్గుణ, సద్బుద్ధులతో కలుగుతుంది ఉన్నతి.**